RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com



వుదయం

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
46 Years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

గుంటూరు | 12-11-2026 గురువారం | సంపుటి : 13 | సంచిక : 234 SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal Postal Regd. No. GTR/117/2025-27 Follow us on

స్వచ్ఛ హైదరాబాద్‌కు జాతీయ పురస్కారం



న్యూఢిల్లీ, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):

దేశ రాజధానిలో భాగ్యనగరం కీర్తి పతాక ఎగురవేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'స్వచ్ఛ సర్వేక్షణ్ 202526' మూల్యాంకనంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అత్యుత్తమ జాతీయ పురస్కారాన్ని దక్కించుకుంది. సోమవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఈ అరుదైన అవార్డును సగర్వంగా స్వీకరించారు. పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, ఘన వ్యర్థాల శుద్ధి, మురుగునీటి నిర్వహణ, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, ప్రజల భాగస్వామ్యం వంటి పది ప్రధాన అంశాలకు గాను మొత్తం 10,500 మార్కులతో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఈ ఎంపిక చేపట్టింది. స్వచ్ఛతలో జీహెచ్ఎంసీ ప్రస్థానం ఏళ్లుగా ఆదర్శంగా నిలుస్తోంది. 2017లో ఓడీఎఫ్, 2019లో ఓడీఎఫ్++ హోదాలను సాధించిన హైదరాబాద్.. 2021లో రాష్ట్రంలోనే తొలి 'వాటర్ ప్లస్' నగరంగా నిలిచి ఆ రేటింగ్‌ను నేటికీ నిలబెట్టుకుంటోంది. గతేడాది 10 లక్షలకు పైగా జనాభా గల నగరాల్లో జాతీయ స్థాయిలో 6వ ర్యాంకు సాధించడంతో పాటు ఏకంగా '7 స్టార్ గార్బేజ్ ఫ్రీ సిటీ'గా గుర్తింపు సొంతం చేసుకుంది. కేవలం తన పరిధికే పరిమితం కాకుండా 'స్వచ్ఛ షెహర్ జోడీ' కార్యక్రమంలో భాగంగా మంథని, చేర్యాల మున్సిపాలిటీలకు జీహెచ్ఎంసీ మెంటార్‌గా వ్యవహరిస్తూ అక్కడి పారిశుద్ధ్య ప్రమాణాలు పెంచేందుకు దిశానిర్దేశం చేసింది.

మైనారిటీలకు అండగా ప్రజా ప్రభుత్వం

విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం : సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)

విద్యాభివృద్ధి, మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. చదువు ఒక్కటే జీవితాలను మార్చగలదని, పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాలను అందించి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయాలని పిలుపునిచ్చారు. జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పలు అంశాలపై మాట్లాడారు. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్య, సాగునీటి రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. దేశంలో విద్యాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే బాధ్యతను తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు అప్పగించారని తెలిపారు. దేశంలో సాంకేతిక విద్యను విస్తరించేందుకు ఐఐటీల ఏర్పాటుకు అబుల్ కలాం ఆజాద్ పునాదులు వేశారని, విద్యా విధాన రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పారిశ్రామిక శిక్షణా సంస్థల ఏర్పాటుకు కూడా ఆయన హయాంలోనే బీజం పడిందని వివరించారు. ప్రస్తుతం వాటిని అధునాతన శిక్షణా కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చెప్పారు. సాఫ్ట్‌వేర్ సహా పలు రంగాల్లో కృత్రిమ మేధస్సు కారణంగా ఉద్యోగావకాశాలు తగ్గే పరిస్థితులు ఉన్నాయని, అయితే చేతివృత్తులు, సాంకేతిక నైపుణ్యాలతో కూడిన శారీరక శ్రమ ఆధారిత ఉద్యోగాలను కృత్రిమ మేధస్సు పూర్తిగా భర్తీ చేయలేదని అభిప్రాయపడ్డారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుంటే భవిష్యత్తులో ఇటువంటి ఉద్యోగాలకు విస్తృత అవకాశాలు ఉంటాయని సూచించారు.

మైనారిటీల సంక్షేమం కాంగ్రెస్ బాధ్యత

గులాం నబీ ఆజాద్ నుంచి షబ్బీర్ అలీ వరకు కాంగ్రెస్ పార్టీ మైనారిటీలకు అనేక అవకాశాలు కల్పించిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని తెలిపారు. మైనారిటీ రిజర్వేషన్లను తొలగిస్తామని బీజేపీ చేవెళ్ల సభలో ప్రకటించిందని, ఆ నిర్ణయాన్ని ముందుగా గుజరాత్‌లో అమలు చేసి చూపించాలని కాంగ్రెస్ సవాల్ విసిరిందని గుర్తుచేశారు. మైనారిటీల సంక్షేమం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పేదలు, మైనారిటీలకు కాంగ్రెస్ ఓటు హక్కును కల్పిస్తే, బీజేపీ వారి ఓట్లను తొలగించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీని బీజేపీ 12 ఏళ్లు గడిచినా నెరవేర్చలేదని అన్నారు. బీజేపీని ఎదుర్కొనే శక్తి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణలోని గల్లీల నుంచి బయలుదేరిన కారు ఢిల్లీకి చేరగానే ప్రధాని మోదీ కమలంగా మారిపోతోందని విమర్శించారు. మైనారిటీ విద్యార్థుల ఉపకార వేతనాలను తొలగించాలని బీజేపీకి ఏ దేవుడు చెప్పాడని ప్రశ్నించారు. మైనారిటీల హక్కులు, సంక్షేమాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.

మైనారిటీలకు ప్రజా ప్రభుత్వం అండ

క్రీడల్లో దేశ ప్రతిష్టను పెంచిన మైనారిటీ క్రీడాకారులను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా గౌరవించిందని ముఖ్యమంత్రి తెలిపారు. వారికి నగదు బహుమతులతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. మహ్మద్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చి గౌరవించామని, షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా నియమించామని వివరించారు. ప్రజా ప్రభుత్వం మైనారిటీలకు అనేక అవకాశాలను అందించిందని పేర్కొన్నారు.

హైదరాబాద్‌ను కేవలం పాత నగరంగా చూడకూడదని, అది అసలైన నగరమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నగరాన్ని పరిరక్షించడంతో పాటు అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పాత నగరంలో మెట్రో రైలు పనులను వేగవంతం చేశామని, మూసీ నది పునరుజ్జీవం ద్వారా పాత నగరానికి పూర్వ వైభవం తీసుకొస్తామని వెల్లడించారు. మూసీ నది పరివాహక ప్రాంతంలో రాత్రి వేళల్లోనూ ఆర్థిక కార్యకలాపాలు విస్తరించేలా చర్యలు చేపడతామని తెలిపారు.

బెంగళూరు, మైసూరులో మోదీ పర్యటన



బెంగళూరు , నవంబర్ 11 (ఎఎంస్) :

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం నుంచి కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. శుక్రవారం ఉదయం స్వామి వివేకానంద యోగా అనుసంధాన సంస్థ నివాస ప్రధాన ప్రాంగణమైన ప్రశాంతి కుటీరంలో నిర్వహించే స్వర్ణోత్సవ వేడుకల్లో ప్రధాని పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం తవరెకెరె నుంచి ఐఐఎం బెంగళూరు మెట్రో స్టేషన్ వరకు మెట్రో రైలును ప్రారంభించి, అందులో ప్రయాణించనున్నారు. ఆ తర్వాత బెంగళూరులోరూ.15,600 కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. అదే రోజు మైసూరుకు చేరుకోనున్న ప్రధాని మోదీ భారత్ వన్ ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు.

రాజకీయ కక్షతోనే మాపై కేసులు



న్యూఢిల్లీ, నవంబర్ 11 (ఎఎంస్) :

నేషనల్ హెరాల్డ్ పత్రిక పునరుద్ధరణ వ్యవహారంలో తాను, తన కుమారుడు రాహుల్ గాంధీ ఎలాంటి ఆర్థిక ప్రయోజనం పొందలేదని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ స్పష్టం చేశారు. తమపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణలను ఖండించారు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజకీయ ప్రేరేపిత కేసులు బనాయిస్తున్నాయని విమర్శించారు.

హార్పర్‌కాలిన్స్ ఇండియా ప్రచురించిన తన జ్ఞాపకాల పుస్తకం 'బంధం: ప్రేమ ప్రయాణం'లో సోనియా గాంధీ ఈ అంశాలను వెల్లడించారు. మంగళవారం వెలువడిన ఈ పుస్తకంలో నేషనల్ హెరాల్డ్ పత్రిక పునరుద్ధరణ వెనుక ఉన్న పరిస్థితులను వివరించారు. జవహర్‌లాల్ నెహ్రూ 1938లో స్థాపించిన ఈ పత్రిక పాఠకుల ఆదరణ, ప్రచురణ నాణ్యత క్రమంగా తగ్గిపోవడంతో 2010లో లాభాపేక్షలేని కొత్త సంస్థ ద్వారా తిరిగి ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రధాన స్రవంతి పత్రికలు, దృశ్య మాధ్యమాల్లో ఎక్కువ భాగం కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే వ్యాపార వర్గాల నియంత్రణలోకి వెళ్లిన నేపథ్యంలో నేషనల్ హెరాల్డ్ పునరుద్ధరణ అత్యవసరమని భావించినట్లు ఆమె పేర్కొన్నారు.

ఈ నిర్ణయం తీసుకునే ముందు ఆర్థిక, న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపామని వివరించారు. లాభాపేక్షలేని సంస్థ కావడంతో దాని వాటాదారులు, సంచాలకులు ఎలాంటి ఆర్థిక ప్రయోజనం పొందడానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. పత్రిక పునరుద్ధరణ ప్రక్రియలో భాగమైన తనతో పాటు రాహుల్ గాంధీ, ఇతర సంచాలకులు ఎవరూ సంస్థ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని సోనియా గాంధీ పేర్కొన్నారు.

నగర జర్నలిస్టులకు త్వరలో ఇంటి జాగా

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

- ముందుగా హైదరాబాద్.. ఆపై జిల్లాల జర్నలిస్టులకు స్థలాలు
- జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



హైదరాబాద్, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి) :

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేసారు. బుధవారం నాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణల నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రిని కలిసి, ఇటీవల జరిగిన తమ సంఘ రాష్ట్ర కార్యవర్గ తీర్మానాలతో కూడిన వినతి పత్రాన్ని అందించింది. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ఇటీవల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు చేసిన సానుకూల ప్రకటనపై తమ సంఘ కార్యవర్గ సమావేశం కృతజ్ఞతలు తెలపడంతో పాటు ఈ ప్రక్రియను వేగవంతం చేసి జర్నలిస్టుల్లో నెలకొన్న ఆందోళనకు తెరదించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసినట్లు విరాహత్ అలీ, రాంనారాయణలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మరో ప్రధాన సమస్య అయిన ఆరోగ్య పథకాన్ని అమలు చేసి, జర్నలిస్టుల ప్రాణాలకు ప్రభుత్వం భద్రతా కల్పించాలని తమ సంఘం చేసిన తీర్మానాన్ని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ముందుగా హైదరాబాద్ లో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, త్వరలోనే ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే జిల్లాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు అందించేందుకు చర్యలు చేపడతామని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేసారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రాజేష్ లు ఉన్నారు.

సర్పంచ్ స్థానాలపై వైసీపీ గురి!

12 పంచాయతీల్లో పట్టు కోసం వ్యూహాలు.. జడ్పీటీసీ ఓటమిపై ఎమ్మెల్యే సమీక్ష ఉంటుందా? కూటమి నాయకుల్లో అంతర్మథనం



చంద్రగిరి, యర్రావారిపాలెం నవంబర్11(వుదయం ప్రతినిధి):

రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మండలంలోని 12 పంచాయతీలపై వైసీపీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రతి పంచాయతీలోనూ తమ బలాన్ని పెంచుకోవడంతో పాటు ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన పరిషత్ ఎన్నికల్లో తమ ఉనికిని చాటుకున్న వైసీపీ నాయకులు అదే తరహాలో పంచాయతీ పోరులోనూ సత్తా చాటాలని వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం.

పరిషత్ ఫలితాలే ప్రాతిపదికగా..

ఇటీవల జరిగిన పరిషత్ ఎన్నికల్లో మండలంలోని ఎనిమిది ఎంపీటీసీ స్థానాల్లో ఆరు స్థానాలు ఏకగ్రీవం కాగా, మరో స్థానంలో టీడీపీ అభ్యర్థి విజయం సాధించారు. దీంతో మొత్తం ఏడు ఎంపీటీసీ స్థానాలను కూటమి ఖాతాలో వేసుకుంది. మరోవైపు చింతగుంట ఎంపీటీసీ స్థానంతో పాటు జడ్పీటీసీ స్థానాన్ని వైసీపీ కైవసం చేసుకుంది. జడ్పీటీసీ అభ్యర్థి రెడ్డమ్మ మెజారిటీతో విజయం సాధించడం వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ ఫలితాలే రానున్న పంచాయతీ ఎన్నికల్లో రెండు పార్టీలకు రాజకీయ బలాబలాలను అంచనా వేసుకునే ప్రాతిపదికగా మారాయి.

జడ్పీటీసీ ఓటమిపై ఎమ్మెల్యే సమీక్ష ఉంటుందా?

ఏడు ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకున్న కూటమి జడ్పీటీసీ స్థానాన్ని మాత్రం చేజార్చుకోవడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పులివర్తి నాని మండల కూటమి నాయకులను పిలిచి ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఏయే పంచాయతీల్లో కూటమికి ఆశించిన స్థాయిలో ఓట్లు రాలేదు? ఎక్కడ ఓట్ల శాతం తగ్గింది? ఏయే ప్రాంతాల్లో వైసీపీకి అనుకూలంగా ఓట్లు మళ్లాయి? స్థానిక నాయకుల మధ్య సమన్వయం ఏ మేరకు ఉంది? అనే అంశాలపై సమీక్ష జరిగితే ఓటమికి గల కారణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సమన్వయ లోపం, స్థానిక రాజకీయ సమీకరణాలు, ఓటర్లను ఏకతాటిపైకి తీసుకురావడంలో ఎదురైన ఇబ్బందులు ఓటమికి కారణమై ఉండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జనసేన అభ్యర్థి పోటీ చేసిన చింతగుంట ఎంపీటీసీ స్థానంలో వైసీపీ అభ్యర్థికి భారీ మెజారిటీ రావడం కూడా రాజకీయంగా చర్చకు దారితీసింది. ఈ అంశాలన్నింటినీ పంచాయతీల వారీగా పరిశీలించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు కూటమి వర్గాల్లో వినిపిస్తున్నాయి.

పంచాయతీ పోరు పరిషత్ ఎన్నికలకు భిన్నం..

పరిషత్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే పంచాయతీ ఎన్నికల్లోనూ పునరావృతమవుతాయని భావించడం సరికాదు. పరిషత్ ఎన్నికల్లో పార్టీ గుర్తులు, రాజకీయ సమీకరణాలు ప్రధాన పాత్ర పోషిస్తే, పంచాయతీ ఎన్నికల్లో స్థానిక అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, ప్రజలతో సంబంధాలు, గ్రామ సమస్యలపై అవగాహన, అభివృద్ధి కార్యక్రమాలు కూడా కీలక ప్రభావం చూపుతాయి. అందువల్ల 12 పంచాయతీల్లోనూ గెలుపు లక్ష్యంగా ముందుకు వెళ్లాలంటే రెండు పార్టీలకు గ్రామస్థాయిలో బలమైన వ్యూహం అవసరం.

బొమ్మల కుటుంబానికి మరో అవకాశం దక్కేనా?

మరోవైపు జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమి పాలైన బొమ్మల చంగమ్మ కుటుంబం విషయంలోనూ స్థానికంగా చర్చ జరుగుతోంది. చంగమ్మ భర్త, మాజీ జడ్పీటీసీ బొమ్మల కుమారస్వామి మండల ప్రజలకు సుపరిచితుడు. గతంలో ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం, స్థానికంగా ఉన్న పరిచయాలు తమకు అనుకూలంగా మారతాయని ఆ కుటుంబం ఆశించినప్పటికీ జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమి ఎదురైంది. ఈ నేపథ్యంలో రానున్న పంచాయతీ ఎన్నికల్లోనైనా లేదా మరేదైనా రాజకీయ పదవిలోనైనా బొమ్మల కుమారస్వామి కుటుంబానికి మరో అవకాశం కల్పించే అంశాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని పరిశీలిస్తారా? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం వెలువడలేదు.మొత్తానికి పరిషత్ ఎన్నికల్లో సాధించిన విజయాలపై కూటమి ధీమాగా ఉన్నప్పటికీ జడ్పీటీసీ ఓటమి మాత్రం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశంగా మారింది. మరోవైపు వైసీపీ కూడా అదే ఫలితాలను ఆసరాగా చేసుకుని పంచాయతీ ఎన్నికలకు సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల ఫలితాలను సమీక్షించుకుని, గ్రామస్థాయిలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ ముందుకు వెళ్లడం రెండు పార్టీలకు అవసరంగా మారింది. 12 పంచాయతీల్లో రాజకీయ సమీకరణాలు రానున్న రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతాయో వేచి చూడాలి.

శాంతి దిశగా మరో అడుగు..

ఖైదీల విడుదలకు అంగీకారం

అబుధాబీ: రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధానికి ముగింపు పలికే దిశగా నిర్వహించిన శాంతి చర్చల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో యుద్ధ ఖైదీలను పరస్పరం అప్పగించుకునేందుకు ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయి. అయితే విడుదల చేయనున్న ఖైదీల కచ్చితమైన సంఖ్యను మరికొన్ని గంటల్లో నిర్ణయిస్తామని అమెరికా ప్రతినిధి బృందం వెల్లడించింది.

భారత్ సమ్మిట్ కాదు.. యాంటీ భారత్ సమ్మిట్



హైదరాబాద్, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి) :

కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ లక్ష్యం దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. ఇది భారత్ సమ్మిట్ కాదని, యాంటీ భారత్ సమ్మిట్ అని అభివర్ణించారు. భారతదేశానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్న విదేశీ శక్తులన్నీ ప్రోగ్రెసివ్ అలయెన్స్ పేరుతో ఏకమయ్యాయని ఆరోపించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాంచందర్‌రావు మాట్లాడుతూ.. ఈ కూటమిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా భాగస్వామిగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిల్లీలో సమావేశమయ్యారని, సోనియా గాంధీ సైతం వారితో భేటీ అయ్యారని తెలిపారు. ఈ సంస్థ వెనుక జార్జ్ సోరోస్ వంటి వ్యక్తుల ప్రమేయం ఉందని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు ఈ సంస్థలు ప్రయత్నిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. స్పెయిన్, ఫ్రాన్స్, అల్బేనియా, నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో చోటుచేసుకున్న రాజకీయ అలజడుల వెనుక కూడా ఈ కూటమి ఉందని ఆరోపించారు. ఇప్పుడు అదే విదేశీ శక్తులు హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని భారతదేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. రాజకీయంగా ప్రజాదరణ కోల్పోయిన రాహుల్ గాంధీని తిరిగి ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే భారత్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నారని రాంచందర్‌రావు ఆరోపించారు. వంద దేశాల నుంచి హాజరయ్యే ప్రతినిధుల ముందు రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి స్థాయి నాయకుడిగా ప్రదర్శించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు.

70 దేశాల ప్రతినిధులతో హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు

హైదరాబాద్, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి) :

ప్రపంచ ఆర్థిక, పెట్టుబడుల విధానాలపై చర్చలకు దావోస్ అంతర్జాతీయ వేదికగా ప్రసిద్ధి చెందినట్లే, రాజకీయ, సామాజిక, ఆర్థిక విధానాలపై ప్రపంచానికి దిశానిర్దేశం చేసే వేదికగా హైదరాబాద్ రూపుదిద్దుకోనుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, అహింస, అలీన విధానాల ప్రధాన అజెండాతో ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్ 2 నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న హింస, విద్వేష రాజకీయాలు, విభజన ధోరణుల నేపథ్యంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తోందని తెలిపారు. ప్రపంచంలోని ప్రజాస్వామ్యవాదులు, ఉదారవాదులు, ప్రగతిశీల ఆలోచనాపరులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, సమకాలీన ప్రపంచ సమస్యలపై చర్చించడం ద్వారా నూతన మార్గదర్శకాలను రూపొందించాలన్నదే సదస్సు లక్ష్యమని పేర్కొన్నారు.

హైదరాబాద్ హైటెక్స్‌లోని నోవాటెల్ హోటల్‌లో భారత్ సమ్మిట్ 2 నిర్వహణను విజయవంతం చేసేందుకు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు 70కిపైగా దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రజాప్రతినిధులు, విధాన రూపకర్తలు, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు అంగీకారం తెలిపారని వెల్లడించారు. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంలో, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి నేపథ్యంలో ఈ సదస్సు నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు.

ఇంతే కదా...!



వుదయం



బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఖేడ్ యూనియన్ బ్యాంకులో 108వ వార్షికోత్సవ వేడుకలు.

నారాయణఖేడ్ నవంబర్ 11 (వుదయం)

నేటి ఆధునిక యుగంలో బ్యాంకులు కేవలం డబ్బు దాచుకునే ప్రదేశాలు మాత్రమే కావు. ప్రతి పౌరుడి ఆర్థిక అభివృద్ధికి దోహదపడే సేవా కేంద్రాలు. అయితే, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా మంది ప్రజలు బ్యాంకు సేవల గురించి పూర్తిగా తెలియక నష్టపోతున్నారు. అందుకే ప్రతి ఒక్కరూ బ్యాంకు సేవలను ఖాతాదారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ వి. స్వరూప్ కుమార్ అన్నారు.బుధవారం ప్రాంతీయ కార్యాలయంలో పూజ కార్యక్రమాలు నిర్వహించి ఖాతా దారులకు స్వీట్ లు, పంచి పెట్టారు ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ వి. స్వరూప్ కుమార్ మాట్లాడుతు బ్యాంకులో ఖాతా తెరవడం వల్ల డబ్బు భద్రంగా ఉంటుంది. ఇంట్లో దాచుకుంటే దొంగతనం జరిగే ప్రమాదం ఉంటుంది. బ్యాంకులో దాచుకుంటే వడ్డీ కూడా వస్తుంది. అంతేకాకుండా ప్రభుత్వం అందించే పథకాలు, పెన్షన్, రైతు భరోసా వంటి డబ్బులు నేరుగా బ్యాంకు ఖాతాలోనే జమ అవుతున్నాయి.

నేడు బ్యాంకులు ఎన్నో సేవలు అందిస్తున్నాయి. పొదుపు ఖాతా, రుణ సౌకర్యం, ఏటీఎం, ఫోన్ పే, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపులు, బీమా, ఫిక్సెడ్ డిపాజిట్ వంటివి వాటిలో ముఖ్యమైనవి. చిన్న వ్యాపారులు, రైతులు తక్కువ వడ్డీకే రుణాలు పొంది తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు. వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పు తీసుకొని ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు.

ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి. మహిళల కోసం ప్రత్యేక పొదుపు పథకాలు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందుబాటులో ఉన్నాయి. డిజిటల్ లావాదేవీలు చేయడం వల్ల మోసాలు తగ్గుతాయి. ప్రతి లావాదేవీకి రశీదు లభిస్తుంది.

అయితే బ్యాంకు సేవలు వాడుకునేటప్పుడు జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. ఎవరికీ ఓటీపీ, పిన్ నంబర్ చెప్పకూడదు. బ్యాంకు అధికారులు ఎప్పుడూ ఫోన్ చేసి ఓటీపీ అడగరు. అపరిచిత లింకులపై క్లిక్ చేయకూడదు. పాస్ బుక్, చెక్ బుక్ జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి అన్నారు .ఈ కార్యక్రమంలో వి. స్వరూప్ కుమార్ సీనియర్ మేనేజర్ (బి. హెడ్) సార్, రాజు పి. మేనేజర్ (డిప్యూటీ బి.హెడ్) సార్

జి. పుల్లయ్య స్పెషల్ సిఎస్ఏ,శ్రీకాంత్ డి. సీనియర్ సిఎస్ఏ,కె. మేఘన రెడ్డి సిఎస్ఏ, కిషోర్ సబ్ స్టాఫ్,అంబదాస్ సబ్ స్టాఫ్ ,ఎ. రామకృష్ణ గోల్డ్ అప్రైసల్ , కొమ్ముల జ్ఞానానందం ఎస్.యు.డి లైఫ్ ఇన్సూరెన్స్, ఖాతాదార్లు, బ్యాంకు సిబంది తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో చర్చలు..
క్షేత్రస్థాయిలో కాలనీల్లో పర్యటన

- సమస్యల పరిష్కారానికి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు
- కాప్రా (వుదయం ప్రతినిధి)

నవంబర్ 11, మేడ్చల్ జిల్లా

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటికి తక్షణ పరిష్కారం చూపించడమే లక్ష్యంగా నిన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు కాప్రా మున్సిపల్ కార్యాలయంలో MMC అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఉప్పల్, నాచారం, కాప్రా డీసీలు ఆనంద్, నిత్యానంద్, రవీందర్ సాగర్ గార్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, పెండింగ్ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, టౌన్ ప్లానింగ్, దోమల నివారణ, ఫుడ్ సేఫ్టీ తదితర అంశాలపై ఎమ్మెల్యే అధికారులతో సమగ్రంగా చర్చించారు.

ఈ సందర్భంగా ఈ రోజు వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై వారి ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కాలనీల్లో రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వర్షపు నీటి కాలువలు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, దోమల బెడద తదితర సమస్యలను ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీ





సుకువచ్చారు.సమీక్షా సమావేశం అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయా కాలనీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. స్వయంగా సమస్యలు పరిశీలించి, స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ఆయా ప్రాంతాల్లో తక్షణమే చేపట్టాల్సిన పనులను గుర్తించి, సంబంధిత అధికారులకు అక్కడికక్కడే తగిన సూచనలు చేశారు.

ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని, సమస్యలను కేవలం కార్యాలయాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మంజూరైన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, పెండింగ్ పనులపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, ప్రతి కాలనీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, అధికారులను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి పరిష్కార దిశగా అడుగులు వేస్తున్నామని, ఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డీసీ ఆనంద్ EE రమేష్‌బాబు హైడ్రా అధికారులు ,AE శ్వేత SDP అధికారులు వాటర్ వర్క్స్ మేనేజర్ రవీందర్ వినీల్ తదితరులు పాల్గొన్నారు



పేద, మధ్యతరగతి కుటుంబాలకు
సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా – ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

14 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఆల్వాల్ నవంబర్ 11 వుదయం

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో భరోసానిస్తోందని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు అన్నారు.బుధవారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మొత్తం 14 మంది లబ్ధిదారులకు CMRF చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు మాట్లాడుతూ, అనారోగ్య సమస్యలతో వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం అందేలా తన వంతు కృషి నిరంతరం కొనసాగిస్తానని తెలిపారు.CMRF ద్వారా ఆర్థిక సహాయం పొందేందుకు అర్హత కలిగిన ప్రజలు అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జేఏసీ సురేందర్ రెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, డోలి, రమేష్, శ్రీధర్ గౌడ్, సురేష్, సాజిద్, అర్జున్, శరణగిరి ప్రేమ్, సంపత్, అనంత్, వీణ, సురేష్, మోసిన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

మహబూబ్‌నగర్

మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతిని పురస్కరించుకొని జిల్లా మైనారిటీ సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా అధికారులతో కలిసి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని కొనియాడారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి, దేశ



విద్యారంగ అభివృద్ధికి అనేక సంస్కరణలు తీసుకొచ్చి విశేష సేవలందించారని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ఆయన చేసిన కృషి, అందించిన సేవలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, జిల్లా మైనారిటీ సంక్షేమ అభివృద్ధి శాఖ (ఎఫ్ఏసీ), గిరిజన సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి ఛత్రు నాయక్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి, కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీ నాయకులు యూసుఫ్ బిన్ నజీర్, సయ్యద్ తకియుద్దీన్, ఎం.డి. రియాజ్, మిరాజ్ కుద్దూస్ బేగ్, ముస్లిం లీగ్ రాష్ట్ర కార్యదర్శి ఐ.యూ.ఎం.ఎల్. నాయకుడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధిక్ హుస్సేన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులకు కాలనీవాసుల సన్మానం

వుదయం అల్వాల్, నవంబర్ 11

అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జానకి నగర్‌లో నవంబర్ 1వ తేదీన జరిగిన హౌస్ బ్రేకింగ్ దొంగతనం కేసును ఛేదించి, నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసు అధికారులను కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. ఈ దొంగతనంలో ఇంటి యజమాని జి. నరసింహమూర్తికి చెందిన సుమారు 29.2 తులాల బంగారు ఆభరణాలు, 27 తులాల వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకొని దర్యాప్తు చేపట్టిన అల్వాల్ పోలీసులు చేసిన కృషిని



అభినందిస్తూ బాధితుడు జి. నరసింహమూర్తితో పాటు కాలనీ నివాసులు శ్రీనివాస్, కార్తీక్, సూర్య, అమర్ తదితరులు మంగళవారం అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ ప్రశాంత్, డీఐ ప్రవీణ్ కుమార్‌లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పోలీసుల సమయస్ఫూర్తి, అంకితభావంతో కూడిన సేవలను కాలనీవాసులు కొనియాడారు.

బడంపేట్‌లో తాగునీటి వృథా.. అధికారులకు కనిపించడం లేదా?

- ఎల్ నినో ప్రభావంతో నీటి ఎద్దడి పొంచి ఉన్నా పట్టించుకోని పంచాయతీ అధికారులు

కోహీర్, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని బడంపేట్ గ్రామంలో తాగునీరు వృథా అవుతుంది . గ్రామంలో తాగునీటి సరఫరా చేసే సింగిల్ ఫేజ్ మోటార్ వద్ద నుంచి నిత్యం వేలాది లీటర్ల విలువైన నీరు వృథాగా వీధుల్లోకి ప్రవహిస్తున్నా సంబంధిత పంచాయతీ అధికారుల్లో చలనం కనిపించడం లేదు.

ఒకవైపు ఎల్ నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరికలు వినిపిస్తున్నాయి. మరోవైపు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పె



ట్టుకొని ప్రతి నీటి బొట్టును పొదుపు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయినప్పటికీ బడంపేట్‌లో నీటి వృథాను అరికట్టేందుకు కనీస చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.ఈ సమస్యపై గతంలో పలుమార్లు పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ అధికారుల తీరు మారకపోవడం గమనార్హం. పత్రికల్లో వార్తలు వచ్చినా స్పందించకపోతే ప్రజల సమస్యలను అధికారులు ఎప్పుడు పరిష్కరిస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. మోటార్ వద్ద నీరు వృథాగా పోతున్న విషయం అధికారులకు తెలియదా? తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీస్తున్నారు. ప్రజలకు తాగునీరు అందించాల్సిన బాధ్యత కలిగిన గ్రామ పంచాయతీ యంత్రాంగం నీటి వృథాను అరికట్టడంలో విఫలమవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మోటార్ వద్ద నీటి సరఫరా వ్యవస్థను సరిచేసి, నీరు వృథాగా పోకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేద్దాం

- అఖిల సాధు పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా శ్రీ సోమేశ్వర శివ శంకర స్వామి ఎన్నిక

జహీరాబాద్:నవంబర్ 11 (:వుదయం)

అఖిల సాధు పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా శ్రీ సోమేశ్వర శివ శంకర స్వామి ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు గా ఎన్నికైన సందర్భంగా జహీరాబాద్‌లోని రాజా ప్యాలెస్‌లో రాజా ప్యాలెస్ అధినేత కాంట్రాక్టర్ రాజు పటేల్ మరియు వివిధ ఆశ్రమాలకు చెందిన పీఠాధిపతులు, సాధువుల సమక్షంలో ఆయనకు ఘనంగా సన్మానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు హిందూ ధర్మ పరిరక్షణ, సనాతన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ, ఆలయాల అభివృద్ధి, యువతలో ధార్మిక చైతన్యం పెంపొందించడం, సాధు సంతుల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రసంగించారు.

హిందూ ధర్మంలోని ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించడంతో పాటు, ధార్మిక సంప్రదాయాల పరిరక్షణకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పీఠాధిపతులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం బర్దిపూర్ ఆశ్రమ పిఠాధిపతి అవదూత గిరి మహారాజ్,దానసిరి ఆశ్రమం పిఠాధిపతితో పాటు వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో విషాదం.. రెండు నెలల పసికందు మృతి!

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ

కోహీర్, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా కోహీర్ పట్టణంలోని మావా హెల్త్ కేర్ ప్రైవేట్ ఆసుపత్రిలో రెండు నెలల పసికందు మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతి చెందిందని తల్లిదండ్రులు ఆరోపించారు.

వివరాల్లోకి వెళితే.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రెండు నెలల చిన్నారి మృతి చెందడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తమ బిడ్డ మృతికి వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ కోహీర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు సంబంధిత వైద్యుడిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నా



రు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయిన తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు .ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన చిన్నారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెంటనే స్పందించి జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు, వైద్యుల అర్హతలు, చికిత్సా విధానాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. వైద్య నిర్లక్ష్యానికి పాల్పడే ఆసుపత్రులు, వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మావా హెల్త్ కేర్ ప్రైవేట్ ఆసుపత్రిని తక్షణమే మూసివేయాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వైద్యశాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కోహీర్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ నరేష్ మీడియాతో మాట్లాడుతూ, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సంబంధిత వైద్యుడిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నామని వెల్లడించారు.

లైసెన్సులు లేకుండా బహిరంగ కొనుగోళ్లు చేస్తున్న వ్యాపారుల పై
కఠిన చర్యలు తీసుకోవాలి



- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కొమ్ముల భాస్కర్.

హుస్నాబాద్, వుదయం (నవంబర్ 11)

వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఎలాంటి అనుమతులు, లైసెన్సులు లేకుండా బహిరంగంగా వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న వ్యాపారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సమితి సభ్యులు కొమ్ముల భాస్కర్ డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన మార్కెట్ కమిటీ అధికారులు అక్రమ కొనుగోళ్లను అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం రోజున హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యదర్శి నాగరాజు కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కొమ్ముల భాస్కర్ మాట్లాడుతూ.. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో కొందరు వ్యాపారులు, ట్రేడర్లు మార్కెట్ నిబంధనలను తుంగలో తొక్కుతూ వడ్లు, మొక్కజొన్న, పత్తి, అపరాలను బహిరంగంగా కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ కమిటీ నుంచి ఎలాంటి లైసెన్సులు పొందకుండా, నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తూ అక్రమ దందాలకు పాల్పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు.సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జేరిపోతుల జనార్ధన్ మాట్లాడుతూ రైతులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పంటలు పండించి మార్కెట్‌కు తీసుకువస్తుంటే, వారి ప్రయోజనాలను కాపాడాల్సిన అధికారులు వ్యాపారుల అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. లైసెన్సులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించడం వల్ల మార్కెట్ నియంత్రణ వ్యవస్థ దెబ్బతినడంతో పాటు ప్రభుత్వ నిబంధనల అమలుపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా మార్కెట్ కమిటీ అధికారులు కళ్లు తెరిచి అక్రమ కొనుగోళ్లకు పాల్పడుతున్న వ్యాపారులను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మార్కెట్ కమిటీ అధికారులు తక్షణమే స్పందించి అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలని, లైసెన్సులు లేని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ముంజ గోపి, సీపీఐ పట్టణ కార్యదర్శి ఎగ్గొజు సుదర్శన చారి, సీపీఐ నాయకులు ఎనగందుల లక్ష్మీనారాయణ, మాడిశెట్టి శ్రీధర్, వేల్పుల ప్రసన్న కుమార్, మాచర్ల శ్రీనివాస్, బైరగొని శ్రీనివాస్, బోయిని సురేష్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు కోయిలకొండ విద్యార్థి ఎంపిక

కోయిలకొండ, నవంబర్ 11 వుదయం

మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలానికి చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికై తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు తుమ్మకుంటలో జరగనున్న 70వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు కోయిలకొండ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఎంపికయ్యాడు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికారెడ్డి విద్యార్థిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. చిన్న వయసులోనే క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ఆసక్తి కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించి పాఠశాలకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కుంభం శివకుమార్ రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.

రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు
వెంటనే విడుదల చేయాలి

- ఫీజుల ఒత్తిడితో విద్యార్థులు, తల్లిదండ్రులకు తప్పని తిప్పలు

నవాబుపేట, నవంబర్ 11, వుదయం

రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బీజేవైఎం నవాబుపేట మండల అధ్యక్షుడు మెరుగు నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో బీజేవైఎం నాయకులు తహసీల్దార్ సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సకాలంలో ఫీజుల నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు పెండింగ్ ఫీజుల చెల్లింపుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నాయని తెలిపారు. ఫీజులు చెల్లించలేని పరిస్థితుల్లో విద్యార్థులు చదువును కొనసాగించలేక, ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తల్లిదండ్రులు కళాశాలల ఫీజుల ఒత్తిడితో మరింత మానసిక, ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే కీలకమైన పథకమని, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దీనిపైనే ఆధారపడి ఉందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న రూ.10 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా కళాశాల యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని బీజేవైఎం నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు బుడ్డా అంజిబాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




44వ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం.. లారీని ఢీకొట్టిన కారు

- కారు ముందు భాగం నుజ్జునుజ్జు.. భార్యాభర్తలకు గాయాలు

బాలానగర్, నవంబర్ 11: వుదయం

బాలానగర్ మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు.. బాలానగర్‌లోని జీవీకే కంపెనీ సమీపంలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది.



కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను కారులో నుంచి బయటకు తీసి, చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన భార్యాభర్తలు కడపకు చెందినవారిగా గుర్తించారు.అతివేగం, నిద్రమత్తు కారణంగా డ్రైవర్ కారుపై నియంత్రణ కోల్పోయి లారీని ఢీకొట్టి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ప్రమాద వివరాలు సేకరించి తదుపరి విచారణ చేపట్టారు.

జాతీయ రహదారి గుంతలను పూడ్చివేసిన ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి

- ఈనాడు ఆఫీస్ జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు
- ఎస్పీ ఆదేశాలతో తక్షణ స్పందన



సూర్యాపేట, నవంబర్ 11: వుదయం ప్రతినిధి

సూర్యాపేట పట్టణ పరిధిలోని జాతీయ రహదారి-65పై ఈనాడు ఆఫీస్ జంక్షన్ వద్ద ఏర్పడిన గుంతలు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. ఈ విషయాన్ని గుర్తించిన జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఐపీఎస్ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి తక్షణ చర్యలు చేపట్టారు. మంగళవారం ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు జాతీయ రహదారుల సంస్థ (ఎన్ హెచ్ ఎ ఐ) అధికారులతో సమన్వయం చేసుకొని, సిబ్బంది సహకారంతో రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. వాహనదారులు రహదారులపై ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వేగాన్ని నియంత్రించుకొని నిదానంగా వాహనాలు నడపాలని సూచించారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు.

ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లు నవంబర్ 20లోగా దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, వుదయం ప్రతినిధి

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమంలో భాగంగా వివిధ కారణాలతో ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని, గైర్హాజరైన, శాశ్వతంగా చిరునామా మారిన ఓటర్లకు ఈ నెల 20వ తేదీలోగా నిర్దేశిత అనుబంధ ఫారంలో దరఖాస్తు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో SIR, వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. గతంలో వివిధ కారణాలతో ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారికి మరోసారి అవకాశం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ఫారాలు సమర్పించని ఓటర్ల వివరాలను ఇప్పటికే కేటగిరీల వారీగా బూత్ స్థాయి అధికారులకు (BLOలు) పంపించామని, ఆ జాబితాలను బూత్ స్థాయి ఏజెంట్ల (BLAలు) ద్వారా గ్రామాల్లో మరోసారి చదివించి, అర్హులైన వారు ఫారాలు సమర్పించేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఇప్పటికే ఓటరుగా నమోదైన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు మాత్రమే నవంబర్ 20లోగా ఎన్నికల సంఘం నిర్దేశించిన అనుబంధ ఫారంలో దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 1,58,630 ఎన్యుమరేషన్ ఫారాలు సేకరించలేదని, ఇందులో 32 వేల మంది మరణించినట్లు, 1.44 లక్షల మంది శాశ్వతంగా చిరునామా మారినట్లు, 18 వేల మంది ఇప్పటికే మరోచోట ఓటర్లుగా నమోదైనట్లు, 6,978 మంది గైర్హాజరు ఓటర్లుగా, 182 మంది ఇతర కేటగిరీలో ఉన్నట్లు వివరించారు. శాశ్వతంగా చిరునామా మారినవారు, గైర్హాజరు ఓటర్లు మాత్రమే ఈ నెల 20లోగా నిర్దేశిత ఫారంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అంశంపై విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన వారందరికీ తిరిగి ఓటరుగా నమోదయ్యే అవకాశంపై అవగాహన కల్పించాలని సూచించారు. వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాకు సంబంధించి ఫారం–18 ద్వారా ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ అయినప్పటికీ, ఈ నెల 25 నుంచి డిసెంబర్ 10 వరకు నిర్వహించే అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ సమయంలోనూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అలాగే డిసెంబర్ 30 తర్వాత కూడా ఈ నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, ఇప్పటివరకు అందిన ఫారం–18 దరఖాస్తులు తదితర వివరాలను జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ముంతాజ్, బీజేపీ నుంచి పి. లింగస్వామి, సీపీఐ(ఎం) నుంచి నర్సిరెడ్డి, బీఆర్ఎస్ నుంచి బి. పిచ్చయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి డాక్టర్ ఎస్.కె. అన్సారి, టీడీపీ నుంచి తేలు అన్నారవి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, డీటీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

బహిరంగ సభ గోడ పోస్టర్ ఆవిష్కరణ



దమ్మపేట నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):

ఈనెల 15. తారీకు నుండి 18 వ రకు నల్ల గొండ పట్టణంలో జరుగుతున్న అఖిల భారత రైతుసంఘం. ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలు ను. 15 న జరిగే రైతాంగం ప్రదర్శన రెడ్ షర్టు వాలంటీర్లు ప్రదర్శన చేయాలని. తెలంగాణా రైతుసంఘం. సిఐటియూ. వ్యవసాయ కార్మిక సంఘం మండలం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డాలక్ష్మి నారాయణ. సంఘం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి శ్రీనివాసరావు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్. లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు ఎదొర్కుంటున్న సమస్యలు పరిష్కారం కోసం. అఖిల భారత కిసాన్ సభ ఏఐకేఎస్. గత 90. సంవత్సరాల నుండి నిరంతరం కృషి చేస్తూ ఉందన్నారు. మహాసభలు ముందు రోజున 15. న నల్లగొండ పట్టణంలో జరిగే లక్ష లాది మంది రైతులు భారీగా జరిగే ప్రదర్శన బహిరంగ సభ ను జయప్రదం చేయాలని. రాజకీయాలు కు అతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు . ఈ కార్యక్రమంలో. సిఐటియు మండల కన్వీనర్.మురహరి రఘు. జిసిసి హమాలీ మేస్త్రి బోగ్యం సత్యం. రైతు నాయకులు. గడ్డిపాటి సత్య నారాయణ. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొలిక పోగు శ్రీనివాసరావు. జిసిసి హమాలీలు వెంకటయ్య, నాగేశ్వరరావు. శ్రీనివాస. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక కట్టడాలు, దేవాలయాల పరిరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ బి. చంద్రశేఖర్
- పానగల్ ఛాయా సోమేశ్వర ఆలయంలో హెరిటేజ్ వాక్ ప్రారంభం



నల్గొండ, వుదయం ప్రతినిధి:

పురాతన, చారిత్రాత్మక కట్టడాలు, దేవాలయాలను భావితరాలకు అందించేలా సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (INTACH) తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో నల్గొండ సమీపంలోని పానగల్‌లో ఉన్న ప్రసిద్ధ ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్వహించిన 'హెరిటేజ్ వాక్' (వారసత్వ నడక) కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందిన చారిత్రక ఆలయమని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు ఈ ఆలయాన్ని సందర్శించేందుకు వస్తుంటారని తెలిపారు. 12వ శతాబ్దంలో కాకతీయుల కాలంలో ఈ దేవాలయం నిర్మితమైనట్లు చరిత్ర ద్వారా తెలుస్తోందన్నారు.

హెరిటేజ్ వాక్ ద్వారా ఆలయ చరిత్ర, విశిష్టత గురించి మరింత తెలుసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఇలాంటి పురాతన కట్టడాలు, చారిత్రక నిర్మాణాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇటీవల ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి బడ్జెట్ కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంటాక్ సంస్థ ఆధ్వర్యంలో ఈ ఆలయం వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. అంతకుముందు కలెక్టర్ ఇంటాక్ ప్రతినిధులతో కలిసి ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను, గర్భగుడిలోని శివలింగంపై ఏర్పడే నీడ ప్రత్యేకతను ప్రత్యక్షంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంటాక్ న్యూఢిల్లీ చైర్మన్ అశోక్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ పురాతన కట్టడాలను పునరుద్ధరించడం, వాటి చారిత్రక ప్రాధాన్యతను కాపాడుతూ సంరక్షించడం ఇంటాక్ సంస్థ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నల్గొండ ఇంటాక్ చాప్టర్‌ను ప్రారంభించే ఉద్దేశంతో జిల్లాకు వచ్చి ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఆలయ పరిరక్షణకు ఇంటాక్ సంస్థ తనవంతు కృషి చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డైరెక్టర్ అర్జున్ రావు, వెద్ కుమార్, సజ్జాద్ సాహిది, ధనుంజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణ ఈ-కిడ్స్ ప్రీమియర్ లీగ్ ఘనంగా నిర్వహణ

చిన్నారుల్లో క్రీడాస్ఫూర్తి, జట్టుగా పనిచేసే నైపుణ్యాల పెంపునకు క్రీడా పోటీలు

కోదాడ నవంబర్ 11(వుదయం)

విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడా స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సమష్టి తత్వాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో నారాయణ ఈ–కిడ్స్ ఆధ్వర్యంలో ఈ–కిడ్స్ ప్రీమియర్ లీగ్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిత, ఏవో వీరారెడ్డి, కోఆర్డినేటర్లు సభ, మహేశ్వరి, సెగ్మెంట్ హెడ్స్ రమణయ్య, సలీమా, ఇందిరా పాల్గొన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ క్రీడల ప్రాధాన్యతను వివరించారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి దోహదపడతాయని తెలిపారు.

రామకృష్ణాపురంలో గ్రామ సమైక్య భవనానికి ఘనంగా శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి

చింతకాని నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):

మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాల నిర్వహణ కోసం నిర్మించనున్న గ్రామ సమైక్య (వి.ఓ) భవనానికి ఘనంగా శంకుస్థాపన చేసిన గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి . ప్రత్యేక పూజలు నిర్వహించి భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి, ఏఎంసీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు హాజరై శంకుస్థాపన కార్యక్రమములో పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేకంగా సొంత భవనం ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. మహిళా సంఘాల సమావేశాలు, పొదుపు కార్యక్రమాలు, ఇతర సమాఖ్య కార్యకలాపాలను ఒకే వేదికపై నిర్వహించేందుకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత అభివృద్ధి సాధించేందుకు ఇటువంటి సదుపాయాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో , సీపీఐ మండల నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్. మురళి, ఉపసర్పంచ్ గాదె రామారావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బల్లెం చిన్న పుల్లయ్య, మాజీ సర్పంచ్ తిరుపతి గోవిందరావు, వార్డు సభ్యులు కొర్లపాటి చిరంజీవి, శీలం బలరామ్, పగిడిపల్లి రామారావు, , ఫీల్డ్ అసిస్టెంట్ కర్లపూడి లక్ష్మయ్య గ్రామస్తులు పాల్గొన్నారు

జనం మధ్య సెల్ గండం - తొలగించేదెప్పుడు?

- కుసుమవారిగూడెంలో కాలనీవాసుల ఆందోళన
- రేడియేషన్ భయంతో ధర్నా



సూర్యాపేట, నవంబర్ 11: వుదయం ప్రతినిధి

జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన సెల్ ఫోన్ టవర్ ను వెంటనే తొలగించాలని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 8వ వార్డు కుసుమవారిగూడెం కాలనీవాసులు డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ... గతంలో పలుమార్లు కలెక్టర్, మున్సిపల్, పోలీసు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టవర్ ఏర్పాటు చేయవద్దంటూ తాము ధర్నా చేస్తే మాత్రం పావుగంటలోనే పోలీసులు వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కాలనీలో చిన్నపిల్లలు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు ఉన్నారని, సెల్ టవర్ నుంచి వెలువడే రేడియేషన్ ప్రభావంపై ఆందోళన చెందుతున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని అధికారులు స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ పోతురాజు ఇందుశ్రీ అనిల్ మాట్లాడుతూ... సెల్ టవర్ ఏర్పాటు చేయాలనుకుంటే జనావాసాల మధ్య కాకుండా ప్రజలకు ఇబ్బందులు లేని ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాలనీవాసుల ఆందోళనను అధికారులు పరిగణనలోకి తీసుకొని సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవీందర్ (ఆర్ఎంపీ), రమాదేవి, యూసుఫ్ బి, సుల్తానా, వసీమా, నజీర్, రాములు, రవీందర్ రెడ్డి, పిట్టల వెంకన్న, గోపాల్ రెడ్డి, నాగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖో-ఖో క్రీడలకు మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల కళాశాల విద్యార్థుల ఎంపిక



ఇద్దరు విద్యార్థులకు రాష్ట్రస్థాయి పోటీల్లో అవకాశం

చిలుకూరు, నవంబర్ 11 (వుదయం):

మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల కళాశాల చిలుకూరుకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్–17 ఖో–ఖో క్రీడలకు ఎంపికయ్యారు. ఈ నెల 10వ తేదీ మంగళవారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్–17 ఖో–ఖో పోటీల్లో సూర్యాపేట జిల్లా జట్టు ప్రథమ బహుమతి సాధించింది. ఈ జట్టులో ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థులు కె. రంజిత్, కె. ఆశిష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. శోభారాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు సోమపొంగు లెనిన్‌తో పాటు కళాశాల అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక కావాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆదినారాయణ, నవీన్, గోపాలకృష్ణ, శ్రీను, నరేష్, సురేష్, సుధాకర్ రెడ్డి, రవీందర్, రవి, అప్పా రావు, రాధిక, జ్యోతి, ఫిరదోష్, నాగమణి, ఫ్లోరా, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల్లో మధిర గర్ల్స్ హైస్కూల్‌కు జిల్లా ద్వితీయ స్థానం

మధిర, నవంబర్,11, వుదయం, ప్రతినిధి:

జిల్లా స్థాయి పాఠశాలల అండర్14 బాలికల వాలీబాల్ క్రీడా పోటీల్లో మధిర గర్ల్స్ హైస్కూల్ జట్టు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు పాఠశాలకు చెందిన విద్యార్థినులు పి. ప్రసన్న,పి.డింపుల్ ఎంపికయ్యారు. జట్టు విజయంతో పాటు జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థినులు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీటీ అపర్ణతో పాటు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం సహాయ నిధి ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయండి

సీఎంకి లేఖ రాసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



భద్రాచలం 11/11/26 వుదయం ప్రతినిధి:

నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు తన వంతు సహకారం అందించడంలో భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలను, ఆర్థిక ఇబ్బందులను మానవతా దృక్పథంతో పరిశీలిస్తూ, అత్యవసర వైద్య పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా వెంకటాపురం మండలం, వీఆర్ పురం గ్రామానికి చెందిన బద్ది సదాలమ్మ వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా లెటర్ ఆఫ్ క్రెడిట్ (LOC) రూపంలో రూ.5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు లేఖ రాశారు. వివరాల్లోకి వెళితే.. వెంకటాపురం మండలం వీఆర్ పురం గ్రామానికి చెందిన బద్ది సదాలమ్మ మయోసైటిస్ అనే వ్యాధితో బాధపడుతూ ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందుతున్నారు. ఈ వ్యాధి కారణంగా ఆమె ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా మారడంతో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగించాల్సిన అవసరం ఏర్పడింది. ధిత కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేకంగా లేఖ రాస్తూ, బద్ది సదాలమ్మకు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (LOC) ద్వారా రూ.5,00,000 (ఐదు లక్షల రూపాయలు) ఆర్థిక సహాయం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు



ఖమ్మం వుదయం బ్యూరో

సెప్టెంబర్ 11 జిల్లా అధ్యక్షుడు తాజ్ నోత్ భద్రం అధ్యక్షతన నవంబర్ 15న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో చేపట్టే వివిధ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం '75 ఏళ్ల ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా 2021 నుండి బిర్సా ముండా జయంతిని జాతీయ గిరిజన గౌరవ దినోత్సవంగా (జన్‌జాతీయ గౌరవ్ దివస్) దేశవ్యాప్తంగా అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తుచేశారు. గిరిజన నాయకుల గొప్ప చరిత్రను, వారి పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందిస్తూ, గిరిజన సంస్కృతి సంప్రదాయాలను బిజెపి ప్రభుత్వం పరిరక్షిస్తోందని స్పష్టం చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన తాజ్ నోత్ భద్రం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతి ఉత్సవాలను పండుగ వాతావరణంలో అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

గిరిజన సంక్షేమాన్ని విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం:

గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్ రాథోడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గిరిజన మహిళలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమంపై ప్రస్తుత ప్రభుత్వం కల్లిబొల్లి మాటలు తప్ప ఏమీ చేయడం లేదని విమర్శించారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు రవి రాథోడ్ మాట్లాడుతూ ఎన్నికల వేళ ఇచ్చిన 'చేవెళ్ల డిక్లరేషన్'ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించి, గిరిజనుల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన పోరాట యోధుల చరిత్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి యువతలో స్ఫూర్తి నింపాలని, నిరుద్యోగ సమస్యతో గిరిజన యువత తప్పుదారి పట్టకుండా ప్రభుత్వం బాధ్యత వహించాలని సూచించారు. ఈ ప్రెస్ మీట్‌లో పార్టీ సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శులు రమేష్, రాహుల్, నాయకులు శ్రీకృష్ణ, సాయిరాం, వీరభద్రం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవే లక్ష్యంగా శ్రీ వాసవి సేవా సమితి సేవలు

- జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం
- వ్యవస్థాపక చైర్మన్ పూరి సురేష్ శెట్టి జన్మదినం సందర్భంగా పేదలకు అల్పాహారం పంపిణీ

సూర్యాపేట, నవంబర్ 11: వుదయం ప్రతినిధి



సమాజ సేవయే లక్ష్యంగా శ్రీ వాసవి సేవా సమితి సేవలు అందిస్తుందని శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో శ్రీ వాసవి సేవా సమితి వ్యవస్థాపక జాతీయ చైర్మన్ పూరి సురేష్ శెట్టి 55వ జన్మదిన సందర్భంగా పేద ప్రజలకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజ సేవ లక్ష్యంగా గత పది సంవత్సరాల క్రితం వనపర్తికి చెందిన పూరి సురేష్ శెట్టి శ్రీ వాసవి సేవా సమితి స్వచ్ఛంద సంస్థను స్థాపించి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాలలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భయంకరమైన కరోనా సమయంలో ఆనందయ్య మందును పంపిణీ చేసి ప్రాణదాతలుగా నిలిచారని తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో జనవరి 25న శ్రీ వాసవి సేవా సమితిని స్థాపించి ఎంతో మంది పేద ప్రజలకు సేవలందిస్తున్నట్లు గుర్తు చేశారు . ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి సేవా సమితి ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు, కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు మిర్యాల సుధాకర్, పోతుగంటి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు బచ్చు శ్రీనివాస్, తోనుకునూరి కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు తప్పీ గాంధీ, కలకోట లక్ష్మయ్య, వందనపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పేదలకు ఉచిత కంటి వైద్య సేవలు అభినందనీయం


కాకతీయ సేవా సమితి సేవలను ప్రశంసించిన మంత్రి ఉత్తమ్

కోదాడ నవంబర్ 11 (వుదయం)

పేదలకు నయాపైసా ఖర్చు లేకుండా ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కోదాడ బైపాస్ రోడ్డులోని కాకతీయ సేవా సమితి కల్యాణ మండపంలో శంకర నేత్రాలయ సహకారంతో రావెళ్ల సీతారామయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి శస్త్రచికిత్స శిబిరాన్ని ఎంపీ కుందూరు రఘువీరారెడ్డి, ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకతీయ సేవా సమితి సేవలను మంత్రి అభినందించారు. వైద్య పరికరాల కొనుగోలుకు ఎంపీ నిధులు కేటాయిస్తానని ఎంపీ రఘువీరారెడ్డి హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కోరారు. తొలిరోజు 200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు.

డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు


మధిర, నవంబర్,11, వుదయం, ప్రతినిధి:



భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవీంద్రారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జి. అరుణ, అధ్యాపకులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవీంద్రారెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యావ్యవస్థ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశేష కృషి చేసి విద్యారంగ పటిష్టతకు పునాదులు వేశారని కొనియాడారు.విద్య ఉద్యోగ సాధనకే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, సమాజ అభివృద్ధికి, దేశ పురోగతికి కీలకమైన సాధనమని పేర్కొంటూ విద్యార్థులు క్రమశిక్షణ,నైతిక విలువలు, సామాజిక బాధ్యతతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ జి. అరుణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందించాలనే ఆజాద్ ఆశయాలు నేటికీ స్ఫూర్తిదాయకమని,మహిళా విద్య, ఉన్నత విద్యాభివృద్ధికి ఆయన విశేష ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.విద్యార్థులు తమకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని నిరంతర అభ్యాసంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్. ఇందిర,డాక్టర్ పి.సుజాత, డాక్టర్ వి.నాగరాజు,అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు రోడ్డు భద్రత పై అవగాహన

దమ్మపేట నవంబర్ 12 (వుదయం ప్రతినిధి)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం, దమ్మపేట పి.ఎస్ పరిధిలోని అంకంపాలెం గ్రామం పరిధిలో గల కోడిషాలగూడెం గ్రామం లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, పాల్వంచ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ యొక్క సూచనల మేరకు, అశ్వరావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో, అశ్వారావుపేట సి.ఐ హాజరైన గ్రామస్తులను ఉద్దేశించి మాదకద్రవ్యాల దుర్వినియోగం, రోడ్డు భద్రత మరియు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో (4) ద్విచక్ర వాహనాలకు జరిమానాలు విధించబడ్డాయి. మొత్తం 52 ఇళ్లు తనిఖీ చేయబడ్డాయి మరియు 33 బైకులు, 04 ప్యాసింజర్ ఆటో మరియు 01 ట్రాక్టర్ వాహనం యొక్క పత్రాలు తనిఖీ చేయబడ్డాయి. కార్యక్రమంలో దమ్మపేట మరియు అశ్వారావుపేట ఎస్.ఐ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల భాగస్వామ్యంతోనే ఓటర్ల జాబితా పారదర్శకత

- ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్
- సమగ్ర ఓటర్ సవరణ, ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం, వుదయం బ్యూరో నవంబర్ -11



రాజకీయ పార్టీల పూర్తి భాగస్వామ్యం, సమన్వయంతోనే పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీ సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమగ్ర ఓటర్ల సవరణ (SIR–2026), పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియ శరవేగంగా సాగుతోందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో నివాసంలో లేనివారు, స్థలం మారినవారు, మృతి చెందినవారు, నకిలీ/రెండోసారి నమోదైన ఓటర్ల పేరుతో ఏఎస్ డిడి కేటగిరీ కింద తొలగించిన ఓటర్లకు తుది జాబితాలో పేరు చేర్చుకోవడానికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని తెలిపారు. జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాలు ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి వ్యాప్తంగా మొత్తం 1,57,854 మందిని ఏఎస్ డిడి కేటగిరీ కింద గుర్తించినట్లు తెలిపారు. ఇందులో శాశ్వతంగా వేరే ప్రాంతాలకు మారినవారు 1,01,549 మంది, మరణించినవారు 33,380 మంది, ఇతర నియోజకవర్గాల్లో ముందే ఓటు నమోదు పొందినవారు 11,004 మంది, గైర్హాజరైనవారు 11,371 మంది ఉన్నారన్నారు. వీరందరికీ సవరణ ప్రక్రియ కింద నోటీసులు జారీ చేయగా, ఇప్పటివరకు జారీ చేసిన 1,75,840 నోటీసులలో 1,75,753 నోటీసులను పంపిణీ చేసి విచారణ నిర్వహించినట్లు స్పష్టం చేశారు. నోటీసుల విచారణ ప్రక్రియను నవంబర్ 26 నాటికి పూర్తి చేసి, నవంబర్ 30న ఓటర్ల తుది జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు (ఫారమ్–18) పురోగతిపై కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ 6 నాటికి దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిందని, జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,09,942 ఫారమ్–18 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. నవంబర్ 20 నాటికి డ్రాఫ్ట్ రోల్ తయారీ పూర్తి చేసి, నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని, డిసెంబర్ 30న ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా విడుదలవుతుందని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎస్డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల డీటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బిఎస్పి పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, టీడీపీ పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బి. వేణుగోపాల్, మంకెన రమేష్, సిపిఎం పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, సీపీఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఏ. విప్లవ కుమార్, ఐఎన్సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



చైనా ప్రభుత్వ ఏజెంటుతో వివా హేతర సంబంధం ఉందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎన్‌విడియా సిఇఒ హువాంగ్ విషయంలో ఎఫ్‌బిఐ దర్యాప్తు చేస్తోంది. కృత్రిమ మేధను అభివృద్ధి చేయడానికి సహకరించిన హువాంగ్ కలవరపడాల్సిన అవసరం ఉన్నట్లు నేను భావించడం లేదు. నిజానికి ఎఫ్‌బిఐ మరో కోణంలో ఈ వ్యవహారాన్ని చూస్తోంది. హువాంగ్‌తో ఉన్న స్నేహపూరిత సంబంధాలు భౌగోళిక రాజకీయ పరిస్థితులపై పడే ప్రభావం దృష్ట్యా ఈ దర్యాప్తులో నేను నేరుగా జోక్యం చేసుకున్నాను. ఈ రోజు కూడా నేను ఆయనతో మాట్లాడాను.

- డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు


వే'మన' పద్యం

అనగ ననగ రాగ మతిశయిల్లుచునుండు

దినగ దినగ వేము తియ్యనుండు

సాధనమున పనులు సమకూరు ధరలోన

విశ్వదాభిరామ వినురవేమ



సంపాదకీయం

ప్రజా ఆస్తులపై ప్రైవేటీకరణ నీడ

ప్రభుత్వ రంగ సంస్థలు కేవలం లాభనష్టాల లెక్కలకు పరిమితమైన వ్యాపార సంస్థలు కావు. అవి దేశ ఆర్థిక స్వావలంబనకు, ప్రజల ఉపాధికి, సామాజిక భద్రతకు కీలకమైన పునాదులు. దశాబ్దాల పాటు ప్రజాధనంతో నిర్మితమై, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఈ సంస్థలను ప్రైవేటీకరించాల్సిన అవసరం ఏమిటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా లాభాలు ఆర్జిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయానికి ప్రభుత్వం ఎందుకు ప్రాధాన్యం ఇస్తోందన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం అవసరం.నష్టాల్లో కూరుకుపోయిన సంస్థలను పునరుద్ధరించడం సాధ్యం కానప్పుడు వాటి విక్రయంపై చర్చించవచ్చు. కానీ సమర్థంగా పనిచేస్తూ, లాభాలను ఆర్జిస్తున్న సంస్థలను సైతం ప్రైవేటీకరణ బాట పట్టించడం వెనుక ఉన్న ఆర్థిక తర్కాన్ని ప్రభుత్వం ప్రజలకు వివరించాలి. భారతదేశం ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని చెబుతున్న తరుణంలో, ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయమే ఆర్థిక సంస్కరణలకు ప్రధాన మార్గమని భావించడం సరైన విధానం కాదు.ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆర్థిక పనితీరే ఇందుకు నిదర్శనం.కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర లాభాలు 2022-23లో రూ.1.05 లక్షల కోట్లుగా ఉండగా, 2024-25లో రూ.1.78 లక్షల కోట్లకు చేరాయి. 2025-26లోనూ సుమారు రూ.1.98 లక్షల కోట్ల లాభాలు నమోదైనట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ గణాంకాలు ప్రభుత్వ రంగ బ్యాంకులు లాభదాయకంగా పనిచేయగల సామర్థ్యాన్ని చాటుతున్నాయి. ఇలాంటి సంస్థల ద్వారా వచ్చే ఆదాయాన్ని వ్యవసాయ రుణాలు, గ్రామీణ ఆర్థికాభివృద్ధి, చిన్న వ్యాపారాలు, విద్యారుణాలు, ఉపాధి కల్పన వంటి ప్రజాప్రయోజనాలకు వినియోగించే అవకాశం ఉంది. నిర్వహణ సామర్థ్యం పెంపు, సాంకేతిక ఆధునికీకరణ అవసరమే. అయితే వాటి కోసం ప్రభుత్వ యాజమాన్యాన్ని తగ్గించడమే ఏకైక పరిష్కారమా అన్నది ఆలోచించాలి.ఇటీవల ఐడీబీఐ బ్యాంకు వాటాల విక్రయ ప్రక్రియ ఈ చర్చకు మరింత ప్రాధాన్యం కల్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వం, ఎల్‌ఐసీ కలిపి తమ వాటాలో 60.72 శాతాన్ని సుమారు రూ.52,878 కోట్లకు విక్రయించే ప్రక్రియ చేపట్టాయి. ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు చెందిన సంస్థను వ్యూహాత్మక కొనుగోలుదారుగా కేంద్ర మంత్రివర్గ ఆర్థిక వ్యవహారాల కమిటీ 2026 అక్టోబర్ 14న ఆమోదించినట్లు ప్రకటించారు. ఈ విక్రయంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన 30.48 శాతం, ఎల్‌ఐసీకి చెందిన 30.24 శాతం వాటాలు ఉన్నాయి. . ఒకసారి విక్రయించిన వాటాల ద్వారా భవిష్యత్తులో వచ్చే నిరంతర ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోయే అవకాశాన్ని విస్మరించరాదు.ప్రభుత్వ రంగ సంస్థల ప్రాధాన్యం కేవలం ఆర్థిక లాభాలకే పరిమితం కాదు. స్వాతంత్ర్యానంతరం ప్రజాధనంతో నిర్మించిన ఈ సంస్థలు దేశాభివృద్ధికి తోడ్పడటంతోపాటు లక్షలాది మందికి ఉపాధి కల్పించాయి.ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలం నెలవారీ వేతనం మాత్రమే కాదు. ఉద్యోగ భద్రత, మెరుగైన సేవా నిబంధనలు, పదవీ విరమణ ప్రయోజనాలు, సామాజిక భద్రత కూడా అందులో భాగమే. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగుల సంఖ్య తగ్గుతున్న తీరు ఈ నేపథ్యంలో ఆందోళన కలిగిస్తోంది. ప్రైవేటీకరణ వల్ల పెట్టుబడులు, ఆధునిక సాంకేతికత, నిర్వహణ సామర్థ్యం పెరుగుతాయని దాని అనుకూలవాదులు వాదిస్తున్నారు. ఈ వాదనలో కొంత వాస్తవం లేకపోలేదు. అయితే ప్రభుత్వ రంగ సంస్థల్లో సంస్కరణలు తీసుకురావడానికి ప్రైవేటీకరణ ఒక్కటే మార్గం కాదు. సమర్థవంతమైన పాలన, జవాబుదారీతనం, వృత్తిపరమైన నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం, అవినీతి నియంత్రణ ద్వారా కూడా వాటి పనితీరును మెరుగుపరచవచ్చు.ప్రైవేటీకరణను పూర్తిగా వ్యతిరేకించడం ఎంత వరకు సమంజసం కాదో, లాభాల్లో ఉన్న సంస్థలను విచక్షణారహితంగా విక్రయించడం కూడా అంతే ప్రమాదకరం. ప్రతి సంస్థ విషయంలోనూ దాని ఆర్థిక స్థితిగతులు, సామాజిక బాధ్యత, ఉద్యోగుల భద్రత, భవిష్యత్తులో సమకూర్చే ఆదాయం, దేశ ఆర్థిక ప్రయోజనాలను సమగ్రంగా బేరీజు వేయాలి. కేవలం ప్రభుత్వ ఖజానాకు తక్షణ ఆదాయం సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలను విస్మరించరాదు. సంక్షేమ రాజ్యం అంటే పథకాలను ప్రకటించడం, సబ్సిడీలను అందించడం మాత్రమే కాదు. ఉపాధి అవకాశాలను కల్పించడం, ఆర్థిక భద్రతను పరిరక్షించడం, ప్రజాధనంతో నిర్మించిన ఆస్తుల ప్రయోజనాలను సమాజంలోని అన్ని వర్గాలకు అందించడం కూడా ప్రభుత్వ బాధ్యత. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజల ఆస్తులు. వాటి భవిష్యత్తుపై నిర్ణయాలు తీసుకునేటప్పుడు తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కంటే దేశ దీర్ఘకాలిక ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. లాభాల్లో ఉన్న సంస్థలను అమ్మడం కాదు.. వాటిని మరింత సమర్థంగా తీర్చిదిద్ది ప్రజలకు మరింత మేలు చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం కావాలి.

రచనలు పంపండి


వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

దురాశ చెదలు

పోగొట్టుకునేంత ఆస్తి లేదు
పోగు చేసుకునేంత సంపాదన లేదు
వచ్చే జీతం రెండు పూటలకే సరిపోతుంది
ఆశలు, అడియాసల నడుమ..
బలవంతంగా సాగుతోంది బతుకు బండి !
అన్నీ బాగున్నపుడు..
నీతో ఉన్నవారు కాదు నీవాళ్లు
నీవు ఏకాకివి అయినపుడు..
నీ చేయి వదలని వారే నీ బంధువులు !

అర్హత కన్న అతిగా ప్రేమ, గౌరవం ఇస్తే..
చులకనగా చూస్తుంది ఈ పాడు లోకం
ప్రేమ, గౌరవాలు పరస్పరం ఇచ్చిపుచ్చుకునేవి
ఈ రెండు లేని చోట నీవు నిలబడకు !
సంతోషంతో గుడి సెలో ఉన్నా..
కొండంత బంగళా వలె కనిపిస్తుంది
దురాశ చెదలు పట్టిన రోగికి..
ప్యాలెస్ కూడా ఫూట్‌పాత్‌లా కనిపిస్తుంది !
మోసపోవడం కూడా మంచిదే..

నడకను అమ్మానాన్నలు నేర్పిస్తే..
నిలకడను అనుభవం నేర్పుతుంది
ఆస్తి కన్న అనుభవమే మిన్న మిత్రమా !
పూజ గదిలో శ్లోకాలు చదివిన భక్తుడు..
దేవుడు వింటున్నాడని నమ్ముతాడు
ఇతరుల్ని మోసం చేసే సందర్భంలో..
దేవుడు చూస్తున్నాడని మాత్రం అనుకోడు !



మధుసూదన్ రెడ్డి
9949700037

స్వార్థమే పరమార్థం... కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తం

కుటుంబం అనగా ఒకే గృహంలో నివసించే కొంత మంది మానవుల సమూహం. వీరు సాధారణంగా పుట్టుకతో లేదా వివాహముతో సంబంధమున్నవారు. సమాజంలో వివిధ మత పరమైన వివాహ చట్టాలు కుటుంబ వ్యవస్థను గుర్తించాయి. "రక్త సంబంధము, సహచరత్వము, ఒకే నివాసం అంశాల విషయంలో కుటుంబ నైతిక, సామాజిక సూత్రాలు కుటుంబ సమైక్యత, సంఘటితం గురించి ప్రజలందరికీ అవగాహన కలిగించడం, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సుస్థిర కుటుంబాలకు దోహదం చేయడం, నైపుణ్యాన్నీ, అనుభవాలను, సామాజిక విలువలను పరస్పరం పంచుకుంటూ కుటుంబ సమస్యల విషయంలో సరైన సమాచారాన్ని, సహకారాన్ని అందించడం, కుటుంబాలలో నెలకొన్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖశాంతులు నెలకొల్పడం వంటి లక్ష్యాలతో నవంబర్ 12ను జాతీయ కుటుంబ సౌహార్ద్ర దినోత్సవంగా జరుపు కుంటారు.భారతీయ సంస్కృతికి, సంప్రదాయాలకు, నాగరికత పురోగతికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. నాగరికత విస్తరణకు పూర్వమే మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని వివిధ గ్రంథాలలో పొందు పరచబడి ఉంది. నాగరి ప్రపంచంలోనూ మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లింది. ప్రాచీన కాలం నుండి ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదలతో తూల తూగాయ నడంలో సందేహం లేదు.ఒక కుటుంబంలో తాత మొదలు వారి పిల్లలు వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి అనే గొడుగు కింద ఒదిగి పోయేవి. ఇంటి లోని పెద్దకు అందరూ గౌరవం ఇవ్వాల్సిందే. ఆయన మాటే వేదవాక్కు. అందరిదీ ఉమ్మడి వ్యవసాయమే. సమష్టి సంపదనే, సమష్టి భోజనాలే ఉండే వంటే ఆత్మీయత అనురాగం, ఉట్టి పడేలా చేసేవి. తల్లిదండ్రులు, అత్త మామలు, అక్క చెల్లెళ్లు, అన్నదమ్ములు, బావా మరదళ్లు, బంధు మిత్రులు, తాతలు, బామ్మలు, మనవలు, మనవ రాండ్రతో కళకళలాడే ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదల నిలయాలు. పిల్లలు చిన్న వయస్సులో ఉన్నపుడు తల్లిదండ్రుల చెంతనే ఉంటారు. వారు పెద్దవారై పెళ్ళిళ్ళు అయిపోతే ఎవరి కుటుంబాలు వారివే. అంటే ఒక కుటుంబం నుంచి మరిన్ని కుటుంబాలు ఉదయిస్తాయి. ఒక కుటుంబం మరెన్ని కుటుంబాలను సృష్టించినప్పటికీ వంశవృక్షపు వేళ్ల మూలాలు మాత్రం మొదటి కుటుంబంను అల్లుకునే ఉంటాయి. అందుకే సంవత్సరంలో ఒక రోజైనా అందరూ కలుసు కోవాలని సరదాగా గడపాలని కోరుకోవడం అత్యంత సహజం. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒక రినొకరు పలుక రించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో. విదేశీ పాలకుల పాలనలో



ఉమ్మడి కుటుంబాలుగా చెలామణి అయిన ఎన్నో కుటుంబాలు నవనాగరిక ప్రపంచంలో విచ్ఛిన్న మయ్యాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వెరసి ఉమ్మడి వ్యవస్థ మీదా తీవ్ర ప్రభావాన్ని చూపింది. నవ నాగరిక ప్రపంచంలో రెండు కుటుంబాలు కాదు కదా రెండు మనసులు కూడా కలసి జీవించ లేని పరిస్థితి నెలకొంది.ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో. కేవలం ఫోన్ లోనో, మొబైల్ లోనో యోగక్షేమాలు కనుక్కునే కుటుంబాలు కూడా లేకపోలేదు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలకు మనదేశం పుట్టి ల్లు. ఇప్పుడు ఆ సంస్కృతి భూతద్దం పెట్టి వెతికినా దొరకదంటే అతిశయోక్తి కాదు. అనేక కుటుం బాలు వ్యక్తిగత కారణాలతో విచ్ఛిన్నం కావడం మనం రోజూ చూస్తూ ఉన్నదే. అయినప్పటికీ మన దేశంలో అనేక కుటుంబాల మధ్య కనిపించే అన్యోన్యతా భావం మరే దేశంలోనూ కనిపించదు.డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలక రించుకునే సమయం చిక్కడం లేదంటే కుటుంబాలు ఎంతగా విచ్ఛిన్న మయ్యాయో అర్థం చేసు కోవచ్చు. ఉమ్మడి కుటుంబాలలో కలిసి మెలిసి మనగలిగే మనస్తత్వాలు లోపించి పెళ్లయిన మరు నాడే వేరు కాపురాలు పెట్టుకుని జంటలుగా ఒంటరై పోతున్నారు. దీంతో సంహాలిచ్చే పెద్ద దిక్కులు లేకపోవడం, ఆపదలలో ఆదుకునే ఆత్మీయులు దూరం కావడం, కనీసం మనసు లోని బాధలను పంచుకునే బంధువులు కరువవ్వడం నేటి సమాజంలో మనకు నిత్యం కనిపించే దృశ్యం.కుటుంబ దౌర్జన్యం చట్టం 498ఎను దుర్వినియోగం చేయడం ద్వారా కొందరు భార్యలు, భర్తలతో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై తప్పుడు కేసులు బనాయించి వారిని వేధింపులకు గురి చేస్తున్నారు. బోగస్ వరకట్న కేసులు బనాయించడం ద్వారా దేశవ్యాప్తంగా 57 వేల మంది పురుషులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే పురుషులు వివాహం చేసుకోవడానికి వెనుకంజ వేసే పరిస్థితి వస్తుంది. భార్యాభర్తల మధ్య చోటు చేసుకున్న విభేదాలు న్యాయస్థానం వెలుపలనే పరిష్కరించు కోవడం సముచితంగా ఉంటుందని నవంబరు 12 న జాతీయ కుటుంబ సౌహార్ద్ర దినోత్సవంగా జరుపు కోవాలని నిర్ణయించారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

మగ్గం మీద మరణమృదంగం! నేతన్నల ఉసురు తీస్తున్న పాలకుల నిర్లక్ష్యం!

ప్రభుత్వాలు మారుతున్నాయి.. నేతన్నల బతుకులు మారడం లేదు! తెలంగాణలో చేనేత సంక్షోభం.. ఆత్మహత్యలెన్ని? అనాథలైన కుటుంబాలెన్ని? మూతపడిన మగ్గాలెన్ని? బతుకుదెరువు కోసం వృత్తి వదిలి వలస వెళ్లిన కార్మికులెందరు?

చీర నేసిన చేతులే ఇప్పుడు కన్నీళ్లు తుడుచుకుంటున్నాయి! దేశానికి అందమైన వస్త్రాలను అందించిన నేతన్న కుటుంబాలు నేడు అప్పుల ఊబిలో చిక్కుకున్నాయి. ఒకప్పుడు ఇంటింటా మగ్గం చప్పుడు వినిపించిన ప్రాంతాల్లో ఇప్పుడు నిశ్శబ్దం అలుముకుంటోంది. పని లేక మగ్గాలు మూతపడుతున్నాయి. అప్పులు తీర్చలేక కొందరు కార్మికులు ప్రాణాలు తీసుకుంటున్నారు. బతకడానికి మరికొందరు కూరగాయలు అమ్ముతున్నారు. సెక్యూరిటీ గార్డులుగా, రోజువారీ కూలీలుగా మారుతున్నారు. ఇంకొందరు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. ఇదేనా చేనేతకు మనం ఇస్తున్న గౌరవం? ఇదేనా ప్రభుత్వాల అభివృద్ధి? ఎన్నికల ముందు నేతన్నల సంక్షేమం గురించి మాట్లాడే రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత వారి కన్నీళ్లను ఎందుకు పట్టించుకోవడం లేదు?47,852 మంది నుంచి 59,325 మంది వరకు.. అసలు లెక్క ఏది? కేంద్ర ప్రభుత్వ నాలుగో జాతీయ చేనేత గణన 2019-20 ప్రకారం తెలంగాణలో 25,930 మంది ప్రధాన నేత కార్మికులు, 21,922 మంది అనుబంధ కార్మికులు కలిపి మొత్తం 47,852 మంది చేనేత రంగంపై ఆధారపడి ఉన్నారు. మరోవైపు తెలంగాణ చేనేత శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో 59,325 మంది ప్రధాన, అనుబంధ కార్మికులు ఉన్నట్లు పేర్కొంది. ఈ రెండు గణాంకాల మధ్య తేడా ఎందుకు వచ్చింది? ఏది ప్రస్తుత లెక్క? ఎంతమంది మగ్గాలపై పని చేస్తున్నారు? ఎంతమంది వృత్తిని వదిలేశారు? ఎంతమంది ఇతర పనులకు వెళ్లిపోయారు? ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవ గణాంకాలను ప్రకటించాలి.దేశవ్యాప్తంగా 35,22,512 మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని కేంద్ర గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో 26,73,891 మంది ప్రధాన నేత కార్మికులు, 8,48,621 మంది అనుబంధ కార్మికులు. ఇంత పెద్ద ఉపాధి రంగానికి ప్రభుత్వాల నుంచి నిరంతర రక్షణ, మార్కెట్ భరోసా, సామాజిక భద్రత అవసరం.తెలంగాణలో 360 మంది నేతన్నల ఆత్మహత్యలు.. కుటుంబాల పరిస్థితి ఏమిటి?తెలంగాణలో చేనేత కార్మికుల ఆత్మహత్యల అంశం అత్యంత ఆందోళనకరం. మానవ హక్కులు, కార్మికుల సంక్షేమంపై పనిచేస్తున్న MCRF సంస్థ తన చేనేత రంగ అధ్యయనంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 360 మంది నేతన్నలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు పేర్కొంది. ఇది సంస్థ వెల్లడించిన గణాంకం. ప్రభుత్వ అధికారికంగా ధ్రువీకరించిన సమగ్ర మరణాల జాబితా కాదు. అయినప్పటికీ ఈ సంఖ్య చేనేత రంగంలో ఉన్న విషాద పరిస్థితిని విస్మరించలేని విధంగా చూపిస్తోంది.ఒక నేతన్న మరణిస్తే ఒక వ్యక్తి మాత్రమే కుటుంబం నుంచి దూరమవడం కాదు. అతనిపై ఆధారపడిన భార్య, పిల్లలు, వృద్ధ తల్లిదండ్రులు జీవనాధారాన్ని కోల్పోతారు. అప్పులు మిగులుతాయి. పిల్లల చదువులు మధ్యలో ఆగిపోవచ్చు. కుటుంబానికి ఆదాయం లేకపోతే జీవనం మరింత దుర్భరమవుతుంది. ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను పరిశీలించడంతో పాటు,మరణించిన వారి కుటుంబాలకు అందిన పరిహారం, పిల్లలకు విద్య, జీవనోపాధి, అప్పుల నుంచి ఉపశమనం వంటి అంశాలపై ప్రభుత్వం సమగ్ర నివేదిక ఇవ్వాలి. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో 42 మరణాలపై నివేదిక.. ప్రభుత్వం గుర్తించింది 18 మాత్రమే!కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నల సమస్యలపై తీవ్ర చర్చ జరిగింది. 2025 డిసెంబర్ 6న వెలువడిన ఒక వార్తా కథనం ప్రకారం, కాంగ్రెస్ పాలనలో తొలి రెండేళ్లలో నేతన్నల సంఘాలు, మీడియా వెల్లడించిన ఆత్మహత్యల సంఖ్య 42గా ఉండగా, ప్రభుత్వం 18 మరణాలను మాత్రమే ఆత్మహత్యలుగా గుర్తించినట్లు పేర్కొంది. గుర్తించిన 18 కుటుంబాల్లో 11 కుటుంబాలకే పరిహారం చెల్లించినట్లు అదే కథనంలో కార్మిక సంఘం నాయకుడు వెల్లడించారు. ఆత్మహత్యలపై విచారణ.. పరిహారం కోసం కుటుంబాల ఎదురుచూపులు!2024 జూన్‌లోనే రాజన్న సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యలపై వివాదం తలెత్తింది. అప్పటికి నమోదైన 12 మరణాల్లో ఆరింటిని మాత్రమే ప్రభుత్వం ఆత్మహత్యలుగా గుర్తించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. మిగిలిన కేసులపై విచారణ అవసరమని ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది.అయితే బాధిత కుటుంబాలకు పరిహారం అందించడంలో ఆలస్యం జరిగిందనే విమర్శలు వచ్చాయి. 2024 సెప్టెంబర్‌లో కూడా పరిహారంపై కమిటీ నిర్ణయం



తీసుకోలేదని మరో వార్తా కథనం వెల్లడించింది. ఒక కుటుంబానికి పెద్దదిక్కు మరణిస్తే ఆ కుటుంబం ఎదుర్కొనే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో పాలకులు అర్థం చేసుకోవాలి. మరణం తర్వాత కూడా కుటుంబం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తే సంక్షేమ పాలనకు అర్థం ఏమిటి?సిరిసిల్లలో 70 వేల మగ్గాలు.. 20 వేల మగ్గాలకు తాళాలు!తెలంగాణ చేనేత, వస్త్ర పరిశ్రమలో రాజన్నసిరిసిల్ల కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఒకప్పుడు వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించిన ఈ ప్రాంతం ఇప్పుడు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 2025 డిసెంబర్‌లో వెలువడిన నివేదికలో సిరిసిల్లలో సుమారు 70 వేల మగ్గాలు ఉండగా, దాదాపు 20 వేల మగ్గాలు మూతపడినట్లు CITU రాష్ట్ర నాయకుడు వెల్లడించారు. అప్పులు, ఆర్డర్ల కొరత, ఆర్థిక ఇబ్బందులు కార్మికులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సంఖ్యలు కార్మిక సంఘం నాయకుడు వెల్లడించిన వివరాలు.ప్రభుత్వం వాటిపై తాజా అధికారిక సర్వే విడుదల చేయాలి.23 వేల మంది కార్మికులు వృత్తి వదిలి ఇతర పనుల్లోకి!అదే నివేదికలో CITU నాయకుడు వెల్లడించిన మరో విషయం మరింత ఆందోళనకరం.సుమారు 23 వేల మంది కార్మికులు తమ సంప్రదాయ వృత్తిని వదిలి కూరగాయల వ్యాపారం, సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు, రోజువారీ కూలీ పనులు వంటి ఇతర ఉపాధి మార్గాలను ఎంచుకున్నారని పేర్కొన్నారు. వేలాది మంది సోలాపూర్, భీవండి, ముంబై వంటి ప్రాంతాలకు వలస వెళ్లినట్లు తెలిపారు. కాలపరిమితి ఉండాలి. అర్హులైన వృద్ధ కార్మికులకు నెలవారీ ఆర్థిక భరోసా కల్పించాలి.రుణమాఫీ ప్రకటనలు.. కార్మికుడికి అసలు ఉపశమనం ఎంత?చేనేత కార్మికుల అప్పుల సమస్యకు పరిష్కారం చూపుతామని ప్రభుత్వం రుణమాఫీ పథకాన్ని ప్రకటించింది. అయితే అర్హతలు, రుణ పరిమితులు, సాంకేతిక కారణాలతో అనేకమంది దరఖాస్తులు తిరస్కరించబడుతున్నాయని కార్మిక వర్గాలు ఆరోపించాయి. 2025 డిసెంబర్‌లో వెలువడిన నివేదికలో సుమారు 17,600 మంది నేతన్నలు రుణాలు తీసుకున్నట్లు, పథకం కింద సుమారు రూ.33 కోట్లు మాత్రమే విడుదలైనట్లు ప్రస్తావించారు.కార్మికులకు మాత్రం రుణమాఫీ అమలుపై అసంతృప్తి ఉన్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వం రూ.1,751 కోట్లు ఖర్చు చేశామంటోంది..ఫలితం ఎంత?2026 సెప్టెంబర్‌లో సిరిసిల్లలో జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత పదేళ్లలో చేనేత రంగంపై రూ.2,234 కోట్లు ఖర్చు కాగా, తమ ప్రభుత్వం రెండున్నరేళ్లలో రూ.1,751 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. ఇది ప్రభుత్వం ప్రకటించిన వ్యయ గణాంకం. ఈ ప్రకటనను స్వాగతించాల్సిందే. అయితే ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసిన తర్వాత కార్మికుల జీవన ప్రమాణాలు ఎంత మెరుగయ్యాయి? ఎన్ని మూతపడిన మగ్గాలు తిరిగి ప్రారంభమయ్యాయి? ఎన్ని కుటుంబాలకు నిరంతర ఉపాధి లభించింది? ఎన్ని ఆత్మహత్యలు నివారించగలిగారు? అనే ఫలితాల నివేదిక కూడా ప్రభుత్వం ఇవ్వాలి. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల నేతన్నల పరిస్థితి ఎవరు పరిశీలిస్తున్నారు?సిరిసిల్ల సమస్యలపై చర్చ జరుగుతున్నప్పటికీ వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో చేనేత వృత్తిపై ఆధారపడిన కుటుంబాల పరిస్థితిని కూడా నిర్లక్ష్యం చేయకూడదు. ఈ జిల్లాల్లో ఎంతమంది మగ్గాలు నడుపుతున్నారు? ఎంతమంది కార్మికులు వృత్తిని వదిలేశారు? ఎన్ని కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి? అనే వివరాలు బహిరంగంగా లేవు.2026 ఫిబ్రవరి రాజ్యసభ సమాధానంలో మహిళా చేనేత కార్మికుల సంఖ్య రంగారెడ్డిలో 637, వికారాబాద్‌లో 10గా నమోదైంది. ఇవి మొత్తం కార్మికుల సంఖ్యలు కావు. మహిళా కార్మికుల గణాంకాలు మాత్రమే. ఈ వివరాల ఆధారంగా మొత్తం కార్మికుల సంఖ్యను నిర్ధారించలేం.

చేనేత కార్మికుడి కుటుంబం రోడ్డున పడితే బాధ్యత ఎవరిది? ఒక నేతన్న ఆత్మహత్య చేసుకున్నప్పుడు వార్తల్లో ఒక పేరు కనిపిస్తుంది. కానీ ఆ పేరు వెనుక ఒక కుటుంబం ఉంటుంది. పిల్లల చదువులు ఉంటాయి. భార్య భవిష్యత్తు ఉంటుంది. వృద్ధ తల్లిదండ్రుల బాధ్యత ఉంటుంది. అప్పులు ఉంటాయి. జీవనాధారం కోల్పోయిన కుటుంబం మళ్లీ నిలబడటానికి సంవత్సరాలు పట్టవచ్చు. నేతన్నకు కన్నీళ్లు కాదు. కడుపునిండా అన్నం కావాలి!

తెలంగాణలో ప్రభుత్వాలు మారాయి. రాజకీయ పార్టీలు మారాయి. పాలకులు మారారు. చేనేత సంక్షేమంపై హామీలు మారాయి. కానీ మగ్గం ముందు కూర్చున్న కార్మికుడి సమస్యలు మాత్రం పూర్తిగా పరిష్కారం కాలేదు. గత పాలకులు చేనేత రంగానికి చేసిన ఖర్చుపై ప్రస్తుత పాలకులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత పాలకుల పథకాలపై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ రాజకీయ విమర్శల మధ్య నేతన్న మాత్రం తన బతుకును నిలబెట్టుకోవడానికి పోరాడుతున్నాడు.గత ప్రభుత్వాలైనా, ప్రస్తుత ప్రభుత్వమైనా చేనేత కార్మికుడి జీవితాన్ని మార్చడంలో సాధించిన ఫలితాలను ప్రజల ముందు ఉంచాలి. ఎవరు ఎంత నిధులు కేటాయించారు? ఎంత ఖర్చు చేశారు? ఎన్ని కుటుంబాలకు ఉపాధి కల్పించారు? ఎంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారు? ఎంతమందికి పరిహారం అందించారు?

అనే లెక్కలు బహిరంగంగా ప్రకటించాలి.నేతన్న నేసిన చీరకు ప్రపంచ మార్కెట్‌లో గుర్తింపు రావడం గొప్ప విషయం. కానీ ఆ చీర నేసిన కార్మికుడి ఇంట్లో ఆకలి ఉండటం మన పాలనా వ్యవస్థకు అవమానం.మగ్గం నడిస్తేనే నేతన్న బతుకుతాడు. నేతన్న బతికితేనే చేనేత సంస్కృతి బతుకుతుంది. ప్రభుత్వాలు మారడం కాదు. నేతన్నల బతుకులు మారాలి. ఇదే తెలంగాణ ప్రజల ప్రశ్న.. ఇదే చేనేత కార్మికుల న్యాయమైన డిమాండ్!



యం డి. ఉస్మాన్ ఖాన్
9912580645

సరిహద్దు గోడ నిర్మాణం




వాషింగ్టన్‌లో అమెరికా సుప్రీంకోర్టు కీలక అనుమతి ఇచ్చింది. టెక్సాస్‌లోని బిగ్ బెండ్ ప్రాంతంలో సరిహద్దు గోడ నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించేందుకు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అనుమతి పొందింది. నిర్ణయం పూర్తయినా, నిర్మాణ పనులు తిరిగి మొదలయ్యే దశపై సమాచారం లేదు. సరిహద్దు గోడ నిర్మాణం ట్రంప్ ప్రధాన ఎన్నికల హామీల్లో ఒకటిగా ఉంది. టెక్సాస్ బిగ్ బెండ్‌లోని భూస్వాములు నిర్ణయంపై నిరాశ వ్యక్తం చేశారు. స్థానిక వ్యాపారులు కూడా సుప్రీంకోర్టు తీర్పును తీవ్రంగా ప్రశ్నించారు. పర్యావరణ పరిరక్షణ కార్యకర్తలు నిర్మాణానికి వ్యతిరేకంగా నిలిచారు. రెండు ప్రధాన పార్టీల నేతలు కూడా ఈ ప్రాంతంలో ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారు. జీవ వైవిధ్య కేంద్రం అధిపతి నిర్ణయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు తాకని ఎడారి ప్రాంతాలను బుల్డోజర్లతో ధ్వంసం చేయవచ్చని ఆయన హెచ్చరించారు. లోయల రాళ్లను పేలుళ్లతో తొలగించే అవకాశం ఉందన్నారు. న్యాయస్థానాలు చట్టబద్ధతను ఇంకా తేల్చకముందే ప్రక్రియ మొదలవుతుందని ఆయన పేర్కొన్నారు. బిగ్ బెండ్‌ను టెక్సాస్‌లోని అత్యంత ప్రత్యేకమైన సహజ ప్రాంతంగా కార్యకర్తలు అభివర్ణించారు. నిర్మాణం ఆ ప్రాంతాన్ని శాశ్వతంగా నాశనం చేయవచ్చని హెచ్చరికలు వచ్చాయి. ప్రాజెక్టును ప్రభుత్వ ధన వృథాగా ప్రతిపక్ష నేతలు పేర్కొంటున్నారు. స్థానిక ఆర్థిక వ్యవస్థ, జీవనశైలికి కూడా ముప్పు ఉందని వారు అంటున్నారు. అమెరికా కాంగ్రెస్‌లో గత ఏడాది రిపబ్లికన్ సభ్యులు నిధులు ఆమోదించారు. ప్రాజెక్టుకు 4.6 బిలియన్ అమెరికన్ డాలర్లు కేటాయించారు. అక్రమ వలసలు, అక్రమ రవాణాను అడ్డుకోవడమే నిర్మాణ లక్ష్యమని సీబీపీ తెలిపింది. ఆ లక్ష్యంతో సీబీపీ పనులను వేగవంతం చేసింది. ప్రాజెక్టులో సుమారు 30 అడుగుల ఎత్తైన ఉక్కు గోడలు ఉంటాయి. వాహనాలను అడ్డుకునే నిరోధకాలు కూడా నిర్మిస్తున్నారు. అధునాతన నిఘా సాంకేతికతను ప్రాజెక్టులో ఉపయోగిస్తున్నారు. డ్రోన్లలాంటి ఆధునిక నిఘా పద్ధతులు గోడకంటే సమర్థమని నేతలు చెబుతున్నారు. ట్రంప్ ప్రభుత్వం పసిఫిక్ మహాసముద్రం నుంచి మెక్సికో సింధుశాఖ వరకు భద్రత లక్ష్యంగా పెట్టుకుంది. ఆ సరిహద్దు సుమారు 2,000 మైళ్ల పొడవు ఉంది. వారానికి దాదాపు 12 మైళ్ల మేర నిరోధకాలు ఏర్పాటు చేస్తున్నారు. నిర్ణయం వెలువడిన తేదీ 11 నవంబర్ 2026.

చీలమండ పరికరం కోసిన మార్కిల్‌ను కోర్టు నిర్బంధించింది

టాంపా ఫెడరల్ కోర్టులో విచారణ ఎదురుచూస్తున్న 82 ఏళ్ల మార్కిల్‌ను మేజిస్ట్రేట్ లిండ్సే గ్రిఫిన్ మంగళవారం నిర్బంధించారు


అమెరికా అధికారులు చెప్పిన ప్రకారం, మేఘన్ తండ్రి థామస్ మార్కిల్ టాంపాలో జైలు పాలయ్యారు. చీలమండకు అమర్చిన ఎలక్ట్రానిక్ పర్యవేక్షణ పరికరాన్ని తొలగించడంతో కోర్టు ఆయనను నిర్బంధించింది. మార్కిల్ ఫ్లోరిడాలోని టాంపా ఫెడరల్ కోర్టులో విచారణ కోసం నిర్బంధంలో ఉన్నారు. ఈ విషయాన్ని సహాయ అమెరికా న్యాయవాది బిల్ ఎస్సెలీ తెలిపారు. మంగళవారం 1.45 గంటలకు పరికరం తొలగించిన వెంటనే ఆయనను అరెస్టు చేశారు. బిల్ ఎస్సెలీ విడుదల నిబంధనలు కోర్టు ఆదేశాలని, సూచనలు కాదని అన్నారు. మార్కిల్ విడుదలను రద్దుచేసి, విచారణ పూర్తయ్యే వరకు నిర్బంధించాలని అధికారులు కోర్టును కోరారు. కేసును చట్టపరిమితిలో పూర్తిగా కొనసాగిస్తామని ఎస్సెలీ చెప్పారు. మేజిస్ట్రేట్ న్యాయమూర్తి లిండ్సే గ్రిఫిన్ మంగళవారం మార్కిల్‌ను నిర్బంధంలో ఉంచాలని ఆదేశించారు. శుక్రవారం జరిగిన అరెస్టుకు ఈ నిర్ణయం కొద్దిరోజులకే వచ్చింది. లాస్ ఏంజెలిస్ ప్రాంతంలోని నివ్వ గదుల నుంచి అధికారులు సుమారు 78 వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో స్లైడ్లు, ఫిల్మ్ నెగెటివ్‌లు, పుస్తకాలు ఉన్నాయి. పిల్లలపై లైంగిక దాడికి సంబంధించిన అనుమానిత చిత్రాలు వాటిలో ఉన్నాయని అధికారులు తెలిపారు. మార్కిల్ శుక్రవారం అరెస్టయ్యారు. ఆ నివ్వ గదులను ఆయన 2008 నుంచి అద్దెకు తీసుకున్నట్లు ఎఫ్‌బీఐ గుర్తించింది. ఫిలిప్పీన్స్‌లోని మోటెల్ శ్రేణికి చెందిన ప్రదేశంలా కనిపించే చోట తీసిన చిత్రమూ ఉందని ఫిర్యాదు పేర్కొంది. మైనర్ బాలికలతో మార్కిల్ ఉన్న లైంగిక చిత్రాలు ఆరోపిత సమాచారంలో ఉన్నాయని తెలిపింది. దర్యాప్తు అధికారి 35 మిల్లీమీటర్ల ఫిల్మ్ నెగెటివ్‌లను చూశారు. అవి మార్కిల్ పేరిట నమోదైన స్టోరేజ్ యూనిట్ 1 నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు 18 చిత్రాలు బాలల అశ్లీల చిత్రాలుగా కనిపించాయని అధికారి నివేదించారు.



మార్కిల్ వినియోగాన్ని యూనిట్‌లోని పేరున్న పెట్టెలు కూడా ధ్రువీకరించాయని ఫిర్యాదు తెలిపింది. పెట్టెలపై టామ్ మార్కిల్ పేరు, కాలిఫోర్నియా సెంట్రల్ డిస్ట్రిక్ట్ చిరునామా ఉన్నాయి. యూనిట్ల ఆటో చెల్లింపు చివరిసారిగా అక్టోబర్ 14న జరిగినట్లు ఎఫ్‌బీఐ తెలిపింది. దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని అధికారి పేర్కొన్నారు. గత వారం ఫ్లోరిడాలోని లేక్‌ల్యాండ్ సీనియర్ కేర్ సెంటర్ నుంచి మార్కిల్‌ను అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. విడుదల సమయంలో మార్కిల్‌కు ఎలక్ట్రానిక్ పర్యవేక్షణ తప్పనిసరి చేశారు. సాధారణంగా ఈ నిబంధనకు చీలమండ బంధనం ధరించాలి. గత శుక్రవారం కోర్టు హాజరులో మార్కిల్‌కు విషయాలు గుర్తు లేకపోవడం కనిపించిందని గ్రిఫిన్ అన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి, అధిక వయస్సును కూడా న్యాయమూర్తి పరిగణించారు. మార్కిల్ మానసిక సామర్థ్య పరీక్షకు గ్రిఫిన్ ఆదేశించారు.

సుప్రీంకోర్టు చారిత్రక తీర్పుతో అరెస్టు లెక్క మారింది

రెండు సమయాల మధ్య 18 గంటల వ్యత్యాసం



సుప్రీంకోర్టు 5 నవంబర్ 2026న 24 గంటల అరెస్టు నిబంధనను స్పష్టం చేసింది. వ్యక్తి స్వేచ్ఛను కోల్పోయిన క్షణం నుంచే గడువు మొదలవుతుందని పేర్కొంది.

కాగితాల్లో నమోదైన అరెస్టు సమయం నిర్ణయాత్మకం కాదని తేల్చింది. సుజిత్ దాస్, సుమన్ దాస్, రూపక్ సర్కార్, రాజు దాస్ కేసులో తీర్పు వెలువడింది.

త్రిపుర హైకోర్టు బెయిల్ నిరాకరణను సుప్రీంకోర్టు రద్దు చేసింది. నలుగురినీ విడుదల చేయాలని ఆదేశించింది.

ఆరోపణలు సెప్టెంబర్ 29, 2025న మధ్యాహ్నం 2:30 గంటలకు మొదలయ్యాయి. అధికారిక అరెస్టు సెప్టెంబర్ 30న ఉదయం 11:15 గంటలకు నమోదైంది.

రెండు దశల మధ్య దాదాపు 18 గంటల వ్యత్యాసం ఉంది. ఎన్‌డీపీఎస్ కేసులో 11.03 కిలోల మెథాంఫెటమైన్ స్వాధీనం ఆరోపణగా ఉంది.

రాజ్యాంగంలోని 21, 22(2) అధికరణాలు, బీఎన్ఎస్ఎస్‌లోని 57, 58 సెక్షన్లు పరిశీలనకు వచ్చాయి. వాస్తవ నిర్బంధ సమయాన్నే లెక్కించాలని ధర్మాసనం చెప్పింది.

మేజిస్ట్రేట్ అరెస్టు మెమోను మాత్రమే నమ్మకూడదు. వ్యక్తిని పోలీసులు ఎప్పుడు అదుపులోకి తీసుకున్నారో నమోదు చేయాలి.

శోధన, స్వాధీనం, అధికారిక అరెస్టు సమయాలను కూడా పరిశీలించాలి. 24 గంటల పరిమితి ఉల్లంఘిస్తే తక్షణ విడుదలకు ఆదేశించాలి.

అనవసరంగా దీర్ఘ నిర్బంధమైతే రిమాండ్‌ను మేజిస్ట్రేట్ తిరస్కరించవచ్చు. కుటుంబం అరెస్టు సమయం, కారణం, మెమో ప్రతిని కోరాలి.


అవసరమైతే రాజ్యాంగంలోని 226 అధికరణం కింద హేబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయవచ్చు.

అత్యాచారం ఆరోపణల కేసులో పాకిస్థాన్ ఉప ప్రధాని



లాహోర్‌లో ఎనిమిది మంది నిందితులపై అభియోగాలు నమోదయ్యాయి. వారిలో ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ మనవడు ఉన్నాడు. ఇద్దరు విదేశీ మహిళలపై సామూహిక అత్యాచారం కేసులో ఈ చర్య జరిగింది. లాహోర్ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి రఫాకత్ అలీ గోండల్ మంగళవారం నవంబర్ 10న అభియోగాలు నమోదు చేశారు. నిందితులంతా నేరాన్ని అంగీకరించలేదు. అభియోగాల విచారణకు నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. ప్రస్తుతం వారంతా న్యాయ కస్టడీలో ఉన్నారు. అభియోగాల నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత న్యాయమూర్తి తదుపరి చర్యను నిర్దేశించారు. అభియోగపక్షం తన సాక్షులను డిసెంబర్ 9న హాజరుపరచాలి. ఆ సాక్ష్యాల అనంతరం అధికారిక విచారణ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ విషయాలను కోర్టు అధికారి బుధవారం నవంబర్ 11, 2026న తెలిపారు. కేసులో నిందితులుగా గుర్తించిన వారిలో ముహమ్మద్ రజా దార్, హసన్ రజా, సికందర్ ఖాన్, సాజిద్ అలీ ఉన్నారు. లాహోర్ కోర్టు ఈ నిందితులను ఐదు రోజుల పోలీసు రిమాండ్‌కు పంపింది. కేసు నమోదు సమయంలో వారిపై వచ్చిన ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. అయితే కోర్టు అభియోగాలు నమోదు చేయడం నేరం రుజువైనట్లు కాదు. నిందితులపై విచారణ ఇంకా ప్రారంభం కాలేదు. పంజాబ్ పోలీసులు ఇషాక్ దార్ మనవడు రజా దార్‌కు గతంలో క్లీన్ చిట్ ఇచ్చారు. అతని నలుగురు సహచరులకూ అత్యాచారం ఆరోపణల నుంచి పోలీసులు మినహాయింపు ఇచ్చారు. కోర్టుకు సమర్పించిన పోలీసు నివేదికలో ఈ విషయం ఉంది. అదే నివేదిక ముగ్గురు తక్కువ వేతన ఉద్యోగులపై ఆరోపణలు మోపింది. ఆ ఉద్యోగులే మహిళలపై అత్యాచారం చేశారని పోలీసులు పేర్కొన్నారు. ఈ విరుద్ధ పరిణామం కేసు దర్యాప్తుపై ప్రశ్నలు లేవనెత్తింది. నెదర్లాండ్స్‌కు చెందిన ఒక మహిళ, వెనిజులాకు చెందిన మరో మహిళ బాధితులుగా ఉన్నారు. ఇద్దరూ జూన్‌లో వ్యాపార పర్యటన కోసం లాహోర్‌కు వచ్చారు. పోలీసులు తెలిపిన ప్రకారం, రజా దార్, అతని నలుగురు స్నేహితులు వారిని అపహరించారు. అనంతరం మహిళలపై అత్యాచారం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వైద్య పరీక్షల్లో మహిళలపై అత్యాచారం జరిగినట్లు నిర్ధారణ అయింది. వాంగ్మూలాలు నమోదు చేసిన తర్వాత ఇద్దరూ తమ దేశాలకు వెళ్లిపోయారు. పోలీసు నివేదిక ప్రకారం, మహిళలకు రజా దార్‌తో సింగపూర్‌లో 2025లో పరిచయం ఏర్పడింది. క్రిప్టోకరెన్సీ వ్యాపారంలో పెట్టుబడి పెట్టాలని మహిళలు అతన్ని ఆహ్వానించారు. ప్రారంభ పెట్టుబడిపై లాభాలు వచ్చిన తర్వాత రజా దార్ $500,000కు పైగా పెట్టుబడి పెట్టాడు. తరువాత మహిళలు లాభం చెల్లించలేదని నివేదిక తెలిపింది. పెట్టుబడి మొత్తాన్ని కూడా వారు తిరిగి ఇవ్వలేదని పేర్కొంది. ఈ ఆర్థిక వివాదం కేసులో ప్రధాన నేపథ్యంగా మారింది. జూన్‌లో మరో పెట్టుబడిదారుతో సమావేశం పేరుతో రజా దార్ మహిళలను పాకిస్థాన్‌కు పిలిచాడు. ఇద్దరూ ఇస్లామాబాద్‌లోని హోటల్‌లో బస చేశారు. తరువాత తమ ఇష్టంతో మ్యూరీ కొండ ప్రాంతానికి వెళ్లారు. ఆపై వారిని లాహోర్ డిఫెన్స్ హౌసింగ్ అథారిటీ ప్రాంతంలోని ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ వారిని నిర్బంధించి డబ్బు చెల్లించాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. పోలీసులు మహిళల నుంచి $19,500 బదిలీ చేయించారని తెలిపారు. ఆ ఇంటి వద్ద ఆయుధధారులు మహిళలను కాపలా కాశారని పోలీసులు చెప్పారు. కత్తి, తుపాకీ, విరిగిన అద్దం ముక్కతో బెదిరించారని పేర్కొన్నారు. డిమాండ్లు నెరవేర్చకపోతే చంపుతామని హెచ్చరించారని తెలిపారు. శరీర భాగాలను విక్రయిస్తామని కూడా బెదిరించినట్లు పోలీసులు చెప్పారు. అపహరణకారులు మహిళలను లాహోర్ విమానాశ్రయానికి తీసుకెళ్తుండగా వాహనం ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో ఇద్దరూ తప్పించుకున్నారని పోలీసులు తెలిపారు.

రాజ్యాంగ సవరణలపై తీవ్ర చర్చ




స్వతంత్ర, నిష్పాక్షిక ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల సంఘం రాజ్యాంగ బాధ్యత. వచ్చే ఏడాది ఐదు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు సంఘం కీలక మార్పు చేసింది. గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రధాన కార్యదర్శులు, ముఖ్య ఎన్నికల అధికారులకు ఈ మార్పులు వర్తిస్తాయి. ఆచరణ నియమావళిలో చేసిన మార్పులను కచ్చితంగా అమలు చేయాలని సంఘం ఆదేశించింది. ఈ చర్యతో ఎన్నికల సంఘం అధికారాలపై కొత్త రాజ్యాంగ చర్చ మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం పదవీ విరమణ తర్వాత మళ్లీ నియమితులైన అధికారులు, ఉద్యోగులపై ఆంక్షలు విధించింది. రాజకీయ పార్టీలు లేదా అభ్యర్థుల తరఫున ప్రచారం చేయడాన్ని నిషేధించింది. ఎన్నికల అధికారులతో సమావేశాలు, వీడియో కాన్ఫరెన్సుల్లో పాల్గొనడాన్నీ ఆపింది. ఈ నిబంధనలు ఐదు రాష్ట్రాల ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించినవిగా ఉన్నాయి. పదవీ విరమణ తర్వాత ప్రభుత్వ శాఖలు, కమిషన్లు, సంస్థల్లో బడీ మంది మళ్లీ నియమితులవుతున్నారు. వారి రాజకీయ, సామాజిక కార్యకలాపాలపై పరిమితులు సేవా నియమాలు, చట్టాలే నిర్ణయిస్తాయి. ప్రస్తుత చట్టాలను మించి కొత్త ఆంక్షలు విధించే అధికారం ఎన్నికల సంఘానికి ఉందా అన్నదే ప్రధాన ప్రశ్న. ఈ అంశంపై వివాదం తీవ్రంగా మారింది. రాజ్యాంగంలోని 324వ అధికరణం ఎన్నికల నిర్వహణ, నియంత్రణ బాధ్యతను సంఘానికి అప్పగించింది. పార్లమెంట్ చేసిన చట్టాలు, రాజ్యాంగ పరిమితులను పక్కనపెట్టి సంఘం ఏకపక్షంగా వ్యవహరించవచ్చని దాని అర్థం కాదు. కొత్త ఆంక్షలకు చట్టం లేదా నియమాల సవరణ అవసరమైతే, నిర్ణీత న్యాయ ప్రక్రియను అనుసరించాలి. ఎన్నికల సంఘం అధికారాలు రాజ్యాంగ, చట్టపరమైన పరిమితుల్లోనే ఉంటాయి. ఇటీవలి సంవత్సరాల్లో ఎన్నికల ప్రక్రియపై పలు ప్రశ్నలు తలెత్తాయి. ఎన్నికల అధికారుల హక్కులు, ఎన్నికల గణాంకాలు, సంఘం పోర్టల్, సాఫ్ట్‌వేర్ నిర్వహణపై కూడా సందేహాలు వ్యక్తమయ్యాయి. వివిధ రాష్ట్రాల్లో భిన్న విధానాలు, నియమాలపై అన్ని రాజకీయ పార్టీలు పారదర్శకత కోరుతున్నాయి.

రష్యా సంబంధాల ఆరోపణలపై అమెరికా సైనికుడు అరెస్టు



గ్లౌస్టర్ సమీపంలో బ్రిటిష్ ఉగ్రవాద నిరోధక పోలీసులు 41 ఏళ్ల అమెరికా సైనికుడిని అరెస్టు చేశారు. రష్యాతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై ఈ అరెస్టు జరిగింది. లండన్ ఉగ్రవాద నిరోధక పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అమెరికా అధికారులు, సైన్యం, ఎఫ్‌బీఐతో కలిసి పోలీసులు పనిచేస్తున్నారు. అమెరికా సైనిక ప్రతిగూఢచారి కమాండ్ ఆరోపణలు సీనియర్ సైనికుడికి సంబంధించినవని తెలిపింది. సైనికుడు గ్లౌస్టర్‌షైర్‌లోని ఇష్టిన్ బ్యారక్స్‌లో పనిచేస్తున్నాడు. గ్లౌస్టర్‌షైర్‌లోని ఇన్స్‌వర్త్ ప్రాంతంలో ఇష్టిన్ బ్యారక్స్ ఉన్నాయి. నాటో మిత్రదేశాల శీఘ్ర ప్రతిస్పందన దళానికి ఆ బ్యారక్స్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్నాయి. మంగళవారం గ్లౌస్టర్ సమీపంలో పోలీసులు సైనికుడిని అదుపులోకి తీసుకున్నారు. జాతీయ భద్రతా చట్టంలోని సెక్షన్ ఒకటి కింద అనుమానం నమోదైంది. విదేశీ గూఢచారి సంస్థకు సహకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రక్షిత సమాచారాన్ని పొందడం లేదా బహిర్గతం చేయడంపైనా అనుమానిస్తున్నారు. లండన్‌లోని ఓ పోలీస్ స్టేషన్‌లో సైనికుడు ఇంకా కస్టడీలో ఉన్నాడు. దర్యాప్తులో భాగంగా గ్లౌస్టర్‌షైర్‌లోని రెండు ప్రాంతాల్లో సోదాలు సాగుతున్నాయి. మెట్రోపాలిటన్ పోలీసులు ఈ వివరాలను వెల్లడించారు. అరెస్టు ఇతర కొనసాగుతున్న ఉగ్రవాద నిరోధక దర్యాప్తులతో సంబంధం లేదని తెలిపారు. కేసులో ఆరోపణలు ఇంకా నిరూపితమైన నేరాలుగా మారలేదు. దర్యాప్తు కొనసాగుతున్నందున తుది నిర్ణయం వెలువడలేదు. ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ అరెస్టుపై స్పందించారు. ఈ కేసులో గూఢచర్య ఆరోపణలు ఉన్నాయని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ఆ ఆరోపణలు అమెరికా, మిత్రదేశాలకు అత్యంత ఆందోళనకరమని తెలిపారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు ఎఫ్‌బీఐ చర్యలు కొనసాగుతాయని పటేల్ చెప్పారు. ప్రమాణాన్ని ఉల్లంఘించే వ్యక్తులపై సహనం ఉండదని స్పష్టం చేశారు. జాతీయ భద్రతకు ముప్పు కలిగించే చర్యలను ఎఫ్‌బీఐ తీవ్రంగా చూస్తుందని అన్నారు. గత 21 నెలల్లో ఎఫ్‌బీఐ 167 ప్రతిగూఢచారి, గూఢచర్య అరెస్టులు చేసిందని పటేల్ తెలిపారు. ఆ సంఖ్య 53 శాతం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. దేశాల రక్షణకు భాగస్వామ్యాలు కీలకమని పటేల్ అన్నారు. యూకే కౌంటర్ టెర్రరిజం పోలీసింగ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎంఐ5, యూకే డిఫెన్స్ కౌంటర్ ఇంటెలిజెన్స్ సంస్థలను కూడా ప్రస్తావించారు. యూఎస్ ఆర్మీ కౌంటర్ ఇంటెలిజెన్స్ కమాండ్ సేవలను ఆయన అభినందించారు. ఉప సహాయ కమిషనర్ విక్కీ ఇవాన్స్ దర్యాప్తుపై వివరాలు ఇచ్చారు. ఆరోపణలు తీవ్రమైనవని ఆమె అన్నారు. దర్యాప్తు పూర్తిగా కొనసాగుతోందని ఇవాన్స్ చెప్పారు. యూకే, అమెరికా చట్ట అమలు భాగస్వామ్యం బలంగా ఉందని పేర్కొన్నారు. జాతీయ భద్రతా సహకారాన్ని ఈ చర్య చూపిస్తోందని అన్నారు. పాల్గొన్న అన్ని బృందాల పనిని ఇవాన్స్ ప్రశంసించారు. అమెరికా ఆర్మీ కౌంటర్ ఇంటెలిజెన్స్ కమాండ్ కమాండింగ్ జనరల్ సీన్ ష్టించన్ స్పందించారు. సున్నితమైన సమాచారాన్ని అప్పగించిన సీనియర్ సైనికుడిపై ఆరోపణలు కలవరపెడుతున్నాయని చెప్పారు. సంస్థలలోపలి ముప్పులు నిజమైనవేనని ఆయన హెచ్చరించారు. అలాంటి ముప్పులు నిరంతరం కొనసాగుతాయని ష్టించన్ పేర్కొన్నారు. అనుమానాస్పద ఘటనను చూసినవారు సమాచారం ఇవ్వాలని కోరారు. స్థానిక ప్రతిగూఢచారి కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. జాతీయ భద్రతను దెబ్బతీసే నేరాలపై యూకే, అమెరికా కలిసి చర్యలు తీసుకుంటాయని ఇవాన్స్ తెలిపారు.

రక్షణ శాఖ 498.58 కోట్ల ఒప్పందం



ఢిల్లీలో రక్షణ మంత్రిత్వ శాఖ ఐఎన్ఎస్ బెత్వా పునరుద్ధరణకు ఒప్పందం కుదుర్చుకుంది. కోచిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌తో ఒప్పందం విలువ 498.58 కోట్లు. రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో నవంబర్ 11, 2026న ఒప్పందం జరిగింది. భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ బెత్వా బ్రహ్మపుత్ర తరగతి ఫ్రిగేట్. సాధారణ పునరుద్ధరణ, ఇంజిన్ వ్యవస్థ మార్పు పనులు నౌకకు చేపడతారు. ప్రస్తుతం ఉన్న ఆవిరి ఆధారిత వ్యవస్థ స్థానంలో డీజిల్ ఇంజిన్ వ్యవస్థ వస్తుంది.

కొత్త ప్రొపల్షన్ వ్యవస్థతో నౌక సామర్థ్యంలో కీలక మార్పు రానుంది. ఆధునిక ఆయుధ సముదాయాన్ని ఏర్పాటు చేసి యుద్ధ సామర్థ్యాలను మెరుగుపరుస్తారు.

ఈ మార్పులు నౌక కార్యకలాపాల ప్రభావాన్ని పెంచుతాయి. నౌక మరమ్మతు, నిర్వహణ రంగంలో దేశీయ సామర్థ్యాలు బలపడనున్నాయి.

సంక్లిష్ట ప్రొపల్షన్ మార్పులు చేపట్టే సామర్థ్యానికి ప్రాజెక్టు తోడ్పడుతుంది. నౌకాదళ వేదికల ఆధునీకరణలోనూ ఈ పనులు ఉపయోగపడతాయి.

ప్రాజెక్టులో 50 కంటే ఎక్కువ మ్యేస్మ్ భాగస్వాములు కానున్నాయి. భారత నౌక నిర్మాణ, అనుబంధ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అంచనా.

ఒప్పందం ఈ రంగానికి విస్తృత పారిశ్రామిక చైతన్యం ఇవ్వనుంది. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి ప్రాజెక్టు ఊతమివ్వనుంది.

మేక్ఇన్ఇండియా దృష్టికోణానికీ ఇది బలం చేకూర్చనుంది. దేశీయ నౌకా మరమ్మతు, నిర్వహణ సామర్థ్యాన్ని ప్రాజెక్టు మరింత బలపరచనుంది.

వుదయం

విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యం: కలెక్టర్

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 11 (వుదయం జిల్లా ప్రతినిధి):

విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం స్వతంత్ర భారతదేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి, భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతిని పురస్కరించుకుని ఐడీఓసి సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, మైనారిటీ నాయకులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి దాయకమని తెలిపారు. మైనారిటీల సంక్షేమం, విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుని అభివృద్ధి సాధించాలని సూచించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు స్వతంత్ర భారతదేశ విద్యా వ్యవస్థ



అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. విద్యను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావడం, జాతీయ సమగ్రత, మతసామరస్యం, సమానత్వం, సామాజిక అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. విద్య ద్వారానే వ్యక్తిగత వికాసంతో పాటు సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని తెలిపారు.జిల్లాలో మైనారిటీల సంక్షేమం, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తూ సమాజంలోని అన్నివర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని తెలిపారు.విద్యార్థులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని క్రమశిక్షణ, పట్టుదల, నిబద్ధతతో విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డా. కుమారస్వామి, యువజన సర్వీసులు క్రీడల శాఖ అధికారి రఘు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మొహమ్మద్ అబ్దుల్ హఫీజ్, మొహమ్మద్ మిరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, జామా మస్జిద్ అధ్యక్షులు మొహమ్మద్ హబీబ్, మైనారిటీ జిల్లా నాయకులు మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు రాజ్ మహమ్మద్, మైనారిటీ నాయకులు వలీ పాషా, అక్కని, నజీమ్, యాకుబ్, సాజిద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం: ఎంపీ కడియం కావ్య



హనుమకొండ టౌన్, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి) :

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) ఒక వరంలా నిలుస్తోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. బుధవారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు రూ.7.53 లక్షల విలువైన CMRF చెక్కులను ఆమె పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు ఈ పథకం ఎంతో భరోసానిస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల ఆరోగ్యం, సంక్షేమానికి మొదటి ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ కడియం కావ్య సూచించారు.

కోదాడ నూతన భవన నిర్మాణ పనులు వేగవంతం



కోదాడ నవంబర్ 11 (వుదయం)

కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తూ నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శనివారం ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి, ఎస్పీ నరసింహతో కలిసి నూతన ఇన్‌పేషెంట్ విభాగాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ఇందుకోసం రూ.26 కోట్లు మంజూరు చేసిందని, 30 పడకల ఆసుపత్రిని 100 పడకల స్థాయికి పెంచుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. పూర్తయిన నూతన భవనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని, శనివారం నుంచి అన్ని రకాల ఉచిత వైద్య సేవలు పునఃప్రారంభించినట్లు తెలిపారు. వైద్యులు, సిబ్బంది రోగులకు బాధ్యతాయుతంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగపీటి రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి!

– ఎన్ హెచ్ ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాము రాజేష్ ఖన్నా



హనుమకొండ సిటీ, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి 30వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు AITUC సంపూర్ణ సంఘీభావం తెలిపింది.ఈ నిరసన కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాము రాజేష్ ఖన్నా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్ హెచ్ ఎం పరిధిలోని 78 క్యాడర్లకు చెందిన సుమారు 17 వేల మంది ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. 'సమాన పనికి సమాన వేతనం' సూత్రాన్ని అమలు చేస్తూ, 100% గ్రాస్ శాలరీ, హెల్త్ కార్డులు మరియు ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు.అలాగే 2022 నుండి కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న 5 శాతం వేతన పెంపును తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సేవలు అందిస్తున్నప్పటికీ ప్రభుత్వం గుర్తించకపోవడం విచారకరమన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరల వల్ల చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం స్పందించి ఉద్యోగ భద్రత కల్పించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మహేందర్ పుట్ట, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రుక్ముద్దీన్, కోశాధికారి మొగిలి నరేష్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఆర్ బి ఎస్ కే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ దుర్గాప్రసాద్, నాయకులు డాక్టర్ జి. రవీందర్, డాక్టర్ రామ్ రాజ్, డాక్టర్ హరికృష్ణ, శ్రీ బద్రి వేణు, మరియు హనుమకొండ జిల్లా ఉద్యోగులు శ్యామ్, రాజేష్ గౌడ్, వెంకటేష్, రాకేష్, యాదవ్, అన్వేష్, సువర్ణ, వనజ, బైరి అశోక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి ఆజాద్ సేవలు చిరస్మరణీయం

ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: కలెక్టర్

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి నవంబర్ 11:



భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యారంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆజాద్, స్వాతంత్ర్యానంతరం దేశ విద్యావ్యవస్థ పటిష్టకు బలమైన పునాదులు వేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, విద్యావంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్ మాట్లాడుతూ విద్య ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలని ఆజాద్ ఆకాంక్షించారని, విద్య ద్వారానే సమాజంలో మార్పు, దేశాభివృద్ధి సాధ్యమని విశ్వసించారని తెలిపారు. ఉన్నత, సాంకేతిక విద్యతో పాటు పరిశోధనా రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి దేశ పురోగతికి ఎంతగానో దోహదపడిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి శ్రీధర్ సుమన్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు బాలికల మైనారిటీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

యాదాద్రి భువనగిరి జిల్లా వుదయం ప్రతినిధి11-11-2026



బుధవారం ఆలేరులోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు)ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా ఈ రోజు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా పాఠశాలలో చిత్ర పఠానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ... పాఠశాలలోని వంటగది, భోజనశాల, మరుగుదొడ్లు, విద్యార్థినుల వసతి గదులను పరిశీలించి, విద్యార్థినులకు అందిస్తున్న భోజనం, వసతి సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులతో మాట్లాడి విద్యా బోధన, పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థినులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి.. వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. ప్రతి సబ్జెక్టుపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. సబ్జెక్టుల్లో ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. కష్టపడి చదువుకొని మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ప్రోత్సహించారు. అనంతరం ఉన్నత విద్యతో పాటు ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర సాంకేతిక విద్యా కోర్సులు, వివిధ పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ విద్యార్థినులకు సూచించారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, భోజన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఆలేరు మండలంలోని బహద్దూర్ పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో ఉన్న చిన్నపిల్లలతో ఆప్యాయంగా మాట్లాడుతూ ప్రతిరోజు ఆహారం మంచిగా అందిస్తున్నారా, గుడ్డు పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే చదువు పై పిల్లలను చిన్న చిన్న ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జయమ్మ, జిల్లా విద్యా శాఖ అధికారి భిక్షపతి, ఎమ్మార్వో ఆంజనేయులు,మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ రన్, హెల్త్ వాక్‌ను ప్రారంభించిన సీపీ ఎన్. శ్వేత

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలి

కేఎంసీ 'ఉత్కర్ష్-2026' వేడుకల్లో భాగంగా

నశా ముక్త్ భారత్ అవగాహన ప్రదర్శన

వరంగల్ క్రైం, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):



డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత చురుకైన పాత్ర పోషించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత పిలుపునిచ్చారు. కాకతీయ వైద్య కళాశాల (కేఎంసీ) వార్షికోత్సవాలు 'ఉత్కర్ష్-2026' (నవంబర్ 11-17) సందర్భంగా నశా ముక్త్ భారత్ అభియాన్ పై అవగాహన కల్పిస్తూ బుధవారం విద్యార్థులు నిర్వహించిన హెల్త్ రన్, హెల్త్ వాక్‌కు సీపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా కేఎంసీ నుంచి హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వరకు సాగిన ఈ ప్రదర్శనలో సీపీ మాట్లాడుతూ.. డ్రగ్స్ వ్యతిరేక సందేశం సమాజంలోని అన్ని వర్గాలకు చేరాల్సిన అవసరం ఉందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కేవలం పోలీసు శాఖ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు వచ్చి ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

మార్గమధ్యంలో సీపీఓ జంక్షన్ వద్ద కేఎంసీ విద్యార్థులు నాటక, నృత్య ప్రదర్శనల ద్వారా మాదకద్రవ్యాల అనర్థాలపై ప్రజల్లో చైతన్యం నింపారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్న అనంతరం విద్యార్థులు 'Say No to Drugs' నినాదంతో భారీ మానవ హారం నిర్వహించి తమ సంకల్పాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, వరంగల్ ఇన్‌చార్జి ఏసీపీ నరసింహారావు, ఇన్స్పెక్టర్లు మచ్చ శివకుమార్, కర్ణాకర్, సాయి రమణ, కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ డి. మోహన్ దాస్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్, కోఆర్డినేటర్లు షణ్ముఖ్, వసంత్, కేఎంసీ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఏ.ఐ.ఏ.ఆర్.ఎల్.ఏ జాతీయ మహాసభల కరపత్రం ఆవిష్కరణ

భూపాలపల్లి నవంబర్ 11 వుదయం ప్రతినిధి:



భూపాలపల్లి వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని అఖిల భారత వ్యవసాయ–గ్రామీణ కార్మిక సంఘం (ఏ ఐ ఏ ఆర్ ఎల్ ఏ) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మారపెల్లి మల్లేష్ పిలుపునిచ్చారు. భూమి, ఉపాధి, కనీస వేతనాలు, సామాజిక భద్రత, విద్య, వైద్యం వంటి మౌలిక హక్కుల సాధన కోసం గ్రామీణ పేదలను సమీకరించి పోరాటాలను బలోపేతం చేయాలని అన్నారు.ఏఐఏఆర్ఎల్ఏ 8వ జాతీయ మహాసభలు నవంబర్ 21, 22 తేదీల్లో జార్ఖండ్ రాష్ట్రంలోని గిరిడీలో జరగనున్నాయి. ఈ మహాసభల సందర్భంగా రూపొందించిన జాతీయ మహాసభల ప్రచార కరపత్రాన్ని మంగళవారం భూపాలపల్లి జయశంకర్ జిల్లా కేంద్రంలోనిరాష్ట్ర కన్వీనర్ మారపెల్లి మల్లేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ సంక్షోభం రోజురోజుకూ తీవ్రమవుతున్నదని, దాని ప్రభావం ప్రధానంగా వ్యవసాయ కార్మికులు, భూమిలేని పేదలు, చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులపై పడుతున్నదని పేర్కొన్నారు. సాగు ఖర్చులు పెరుగుతున్నా రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని,మరోవైపు వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో కూలీలకు ఏడాది పొడవునా ఉపాధి దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో గ్రామీణ పేదల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయని అన్నారు.తెలంగాణలోనూ వ్యవసాయ కార్మికుల పరిస్థితి ఆందోళకరంగా ఉందని, రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రైతులు, కూలీలు, దళితులు, ఆదివాసీలు, మహిళలు, గ్రామీణ పేదల ఆకాంక్షలు ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరలేదని పేర్కొన్నారు.భూమి, పని, కనీస వేతనం, ఇల్లు, విద్య, వైద్యం, సామాజిక భద్రత కోసం పేదలు ఇప్పటికీ పోరాడాల్సిన పరిస్థితి ఉందన్నారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. తెలంగాణలో 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నమోదైన 1,035 లక్షల పనిదినాలు, 2025లో అదే కాలానికి 542.82 లక్షలకు పడిపోవడం గ్రామీణ ఉపాధి సంక్షోభానికి నిదర్శనమని తెలిపారు. ఉపాధి హామీ కింద ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారీ కూలీని పెంచాలని డిమాండ్ చేశారు.భూమి లేని పేదలకు సాగు భూమి పంపిణీ చేయాలని, అసైన్డ్ భూములను పరిరక్షించాలని, పోడు సాగుదారులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అటవీ హక్కుల దరఖాస్తులను పరిష్కరించాలని, కౌలు రైతులకు గుర్తింపు, పంట రుణాలు, పంట నష్టపరిహారం అందించాలని అన్నారు.మహిళా వ్యవసాయ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, దళితులపై కులవివక్ష, అంటరానితనం, సామాజిక దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసి పేదలకు ఉచితంగా నాణ్యమైన సేవలు అందించాలని కోరారు.ఈ సమస్యలన్నింటిపై జాతీయ మహాసభల్లో సమగ్రంగా చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు నాయకులు తెలిపారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాలి: కలెక్టర్



నల్గొండ:

మౌలానా అబుల్ కలాం ఆజాద్ పోరాట స్ఫూర్తిని, ఆలోచనా దృక్పథాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జిల్లా కలెక్టర్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, విద్యావేత్తగా పేరు పొందిన మౌలానా అబుల్ కలాం ఆజాద్, మహాత్మా గాంధీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. స్వదేశీ ఉద్యమం, సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమాల్లో పాల్గొని గాంధేయ మార్గంలో నడిచారని, జర్నలిజం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని పేర్కొన్నారు. దేశానికి ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారని, దేశంలో తొలి విద్యా విధానం రూపకల్పనలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తింపుగా 1992లో భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారంతో గౌరవించిందని వెల్లడించారు. ఆజాద్ పోరాట స్ఫూర్తి, ఆలోచనా విధానాన్ని భావితరాలకు తెలియజేయాలని కలెక్టర్ కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఆఫీజ్ ఖాన్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు.నల్గొండ డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ మాట్లాడుతూ..మౌలానా అబుల్ కలాం ఆజాద్ అసలు పేరు మోహియుద్దీన్ అహ్మద్ అని తెలిపారు. ఆయన విద్యా శాఖ మంత్రిగా ఉన్న సమయంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), ఐఐటీలు, వివిధ అకాడమీల ఏర్పాటుకు కృషి చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి విజయేందర్ రెడ్డి, కార్పొరేటర్లు, మైనార్టీ ప్రముఖులు తదితరులు పాల్గొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఖమ్మంలో 15న ఎల్ఐఏఎఫ్ఐ ఆధ్వర్యంలో విజ్ఞాన సదస్సు

ముఖ్య అతిథిగా జాతీయ ప్రధాన కార్యదర్శి

భీమిశెట్టి మార్కండేయులు

ఖమ్మం బ్రాంచ్ మాజీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ తేజావత్

నరసింహారావు

ఖమ్మం జిల్లా నవంబర్ 11 వుదయం ప్రతినిధి:



ఖమ్మం జిల్లా భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య (LIAFI) ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ ఆదివారం ఖమ్మంలోని రెస్ట్ ఇన్ హోటల్‌లో విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు వరంగల్ డివిజన్ ఖమ్మం బ్రాంచ్ మాజీ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ తేజావత్ నరసింహారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుకు ఎల్ఐఏఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి భీమిశెట్టి మార్కండేయులు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీలో చోటుచేసుకుంటున్న వేగవంతమైన మార్పులు, నూతన పాలసీలు, ఐఆర్‌డీఏ నిబంధనలు, ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి సమాఖ్య చేస్తున్న పోరాటాలు, ఇప్పటివరకు సాధించిన విజయాలు తదితర అంశాలపై ఆయన వివరించనున్నారు. అలాగే ఎల్ఐసీ యాజమాన్యానికి సమాఖ్య అందిస్తున్న సూచనలు, ఏజెంట్ల హక్కుల పరిరక్షణలో ఎల్ఐఏఎఫ్ఐ పాత్ర, ఇతర సంఘాలతో సమాఖ్య సమన్వయం వంటి అంశాలపై సుమారు రెండు గంటలపాటు అవగాహన కల్పించనున్నారు. ఈ విజ్ఞాన సదస్సుకు వరంగల్ డివిజన్ పరిధిలోని వివిధ బ్రాంచ్‌లు, డివిజన్, జోనల్, జాతీయ స్థాయి బాధ్యులు, ఎల్ఐసీ ఏజెంట్లు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లతోపాటు విందు భోజన సదుపాయం కల్పించినట్లు నరసింహారావు పేర్కొన్నారు.

జగదీష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన విన్నర్స్

19న గట్టుప్పల్‌లో ఘనంగా సన్మానం

గట్టుప్పల్, సెప్టెంబర్ 12 (వుదయం)



ఆల్ ఇండియా హ్యాండ్లూమ్స్ వీవర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ (న్యూఢిల్లీ) ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు ఘన విజయం సాధించారు.సొసైటీ ఎన్నికల్లో విజేతగా నిలిచిన కర్నాటి వజ్రమ్మ–వెంకటేశం దంపతులు గురువారం హైదరాబాద్‌లో సూర్యాపేట శాసనసభ్యులు, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన గెలుపునకు సహకరించినందుకు జగదీష్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కర్నాటి గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.19న గట్టుప్పల్‌లో సన్మాన సభచేనేత రంగానికి సేవలు అందిస్తూ జాతీయ స్థాయి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కర్నాటి వజ్రమ్మ వెంకటేశం దంపతులను ఈ నెల 19వ తేదీ (గురువారం) ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గట్టుప్పల్‌లో ఘనంగా సన్మానించనున్నారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, చేనేత సంఘాల ప్రతినిధులు, ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం: అదనపు కలెక్టర్ వి.విక్టర్

కామారెడ్డి, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):



కామారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి సందర్భంగా జాతీయ మైనారిటీ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రెవెన్యూ అదనపు కలెక్టర్ వి. విక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి, కొబ్బరికాయ కొట్టి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య పోరాటంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు, స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగ అభివృద్ధికి ఆయన అందించిన విశేష కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశంలో విద్యావ్యాప్తికి, సమాన అవకాశాల కల్పనకు ఆయన వేసిన పునాదులు నేటికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా, జాతీయ మైనారిటీ దినోత్సవంగా నిర్వహించుకోవడం ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకునే గొప్ప సందర్భమని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ అధికారులు, సిబ్బంది ప్రజలకు నిబద్ధతతో సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ శశి కుమార్, టీజీఓ కార్యదర్శి సాయిరెడ్డి, ఉర్దూ అధికారి అర్షద్ అలీ, జూనియర్ అసిస్టెంట్లు సాయిలు, సత్యం, డీఈఓలు ఇర్ఫాన్, ఇక్రమ్, వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు ఘన స్వాగతం



ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 11:

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఐటీ టవర్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కంది శ్రీనివాస్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. బుధవారం స్థానిక ఏరోడ్రోమ్ హెలీప్యాడ్ వద్దకు మంత్రి చేరుకోగానే కంది శ్రీనివాస్ రెడ్డి పుష్ప గుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఐటీ టవర్‌ను ప్రారంభించేందుకు మంత్రి ఆదిలాబాద్‌కు రావడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో సందడి నెలకొంది. ఐటీ టవర్ ప్రారంభంతో జిల్లాలో ఐటీ రంగానికి సంబంధించిన కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాసర ఐఐఐటీ విద్యార్థులకు నిరంతరం సురక్షిత తాగునీరు అందించాలి: కలెక్టర్

నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి) 11 నవంబర్ 2026



బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు నిరంతరం పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.బుధవారం బాసర ఐఐఐటీ (ఆర్జీయూకేటీ)లో విద్యార్థులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, క్యాంపస్‌లో నీటి సరఫరా సమస్యలు, ఇతర ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తాగునీటి నాణ్యతను పరీక్షించి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే విద్యార్థులకు అందించాలని సూచించారు. నీరు ఎక్కడ కలుషితమవుతుందో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, తాగునీటితో పాటు రోజువారీ అవసరాలకు సరిపడా నీటిని నిరంతరం సరఫరా చేయాలని ఆదేశించారు. విద్యార్థులు తమ సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఖైసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఐఐఐటీ ఉపకులపతి గోవర్ధన్, ఓఎస్డీ మురళీధర్‌న్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

"విద్యారంగానికి పునాదులు వేసిన మహనీయుడు ఆజాద్

ఆజాద్ జయంతి వేడుకల్లో కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):

స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కొనియాడారు. మౌలానా ఆజాద్ జయంతిని పురస్కరించుకుని బుధవారం జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరై మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో మౌలానా ఆజాద్ కీలక పాత్ర పోషించారని, స్వాతంత్ర్యానంతరం దేశ విద్యావ్యవస్థ నిర్మాణానికి విశేష కృషి చేశారని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు దేశ ప్రగతికి ఎంతగానో దోహదపడ్డాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి, ఇన్‌చార్జి మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి జయశ్రీ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యమధర్మరాజు ఆలయంలో ఘనంగా యమద్వితీయ వేడుకలు

స్వామివారికి రుద్రాభిషేకం, ఆయుష్యహోమం





ధర్మపురి నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దేవ స్థానంలో శ్రీయమధర్మరాజు వారి ఆలయంలో బుధవారం యమద్వితీయ, భగినీ హస్త భోజనం పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీయమధర్మరాజు స్వామివారికి రుద్రాభిషేకం, మన్యసూక్తం, ఆయుష్య సూక్తంలతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లోక కల్యాణార్థం, భక్తుల ఆయురారోగ్యాల నిమిత్తం ఘనంగా ఆయుష్యహోమం నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక పర్వదినాన పూజల అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలను పంపిణీ చేసి, హారతి, మంత్ర పుష్పం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, ఓంకార శర్మ సీనియర్ అసిస్టెంట్ వావిలాల తిరుపతి, అర్చకులు నేరెళ్ల సంతోష్ కుమార్, నేరెళ్ల విజయ్ కుమార్, బొజ్జ సంతోష్ కుమార్, బొజ్జ సంపత్ కుమార్, బొజ్జ రాజగోపాల్, కౌన్సిలర్లు సంతోషి, పద్మ, దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఓబీసీల అభ్యున్నతికి సమష్టిగా కృషి చేయాలి:

ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎల్కరి దామోదర్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం కాగజ్‌నగర్‌లోని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు నివాసంలో బుధవారం రోజున నిర్వహించారు. ఈ సమావేశానికి ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి విష్ణు దత్తు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం యాదవ్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓబీసీల అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓబీసీ వర్గాల సమస్యలను గుర్తించి పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీర భద్ర చారి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఒడ్డేటి నాని, హిందూ జాగరణ మంచ్ జిల్లా అధ్యక్షుడు శివ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జల లక్ష్మణ్, బీజేపీ మండల అధ్యక్షుడు పుల్ల అశోక్, ఓబీసీ మోర్చా లోనర్ రవీందర్, ఓబీసీ మోర్చా జిల్లా నానయ్య, బీజేపీ జిల్లా, మండల స్థాయి నాయకులు, బీజేపీ కార్యకర్తలు కిష్టయ్య, అనిల్, మనోహర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

"సింగరేణి స్థాయిలో వార్షిక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం..

మంచిర్యాల/ రామకృష్ణాపూర్/ నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)



సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంపెనీ స్థాయి వార్షిక క్రికెట్ టోర్నమెంట్ బుధవారం మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌ను మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు.ఈ పోటీల్లో సింగరేణి పరిధిలోని 11 ఏరియాల నుంచి ఎంపికైన ఆరు జట్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా జీఎం రాధాకృష్ణ ఆరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకుని, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి స్థాయిలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఈ టోర్నమెంట్‌లో విజయం సాధించిన జట్టును కోల్ ఇండియా స్థాయిలో జరిగే క్రికెట్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో ఆర్జీ ఏరియా జట్టు, భూపాలపల్లి ఏరియా జట్టు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ఆర్జీ ఏరియా జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ, సీఎం ఓఏఐ అధ్యక్షుడు రమేష్, డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, కేకే గ్రూప్ ఏజెంట్ ఖాదిర్, ఏఐటీయూసీ నాయకుడు ఇప్పకాయల లింగయ్య, కార్తీక్, సీనియర్ పీఓ సురేందర్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు సీహెచ్. అశోక్, ఎం. నరేందర్ రెడ్డి, పరస్ శ్రీనివాస్, మందమర్రి ఏరియా స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శివ, క్రికెట్ రిఫరీలు, కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా చెకుముకి సైన్స్ సంబరాలు పోస్టర్ ఆవిష్కరణ



ధర్మపురి నవంబర్11 (వుదయం ప్రతినిధి):

విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులు, అన్వేషణా భావాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు 2026 పోస్టర్‌ను ధర్మపురి మండలం కమలాపూర్ ప్రౌఢ మికోన్నత పాఠశాలలో బుధ వారం ఆవిష్కరించారు.ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, శాంతి కోసం సైన్స్, నినాదంతో సమాజంలో మూఢనమ్మకా లను రూపుమాపి, విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచేందుకు ఈ సంబరాలు ఎంతగానో దోహ దపడతాయని నిర్వాహకులు తెలిపారు. నవంబర్ 12న పాఠశాల స్థాయిలో, నవంబర్ 21న మండల స్థాయిలో నవంబర్ 28 జిల్లా స్థాయి పరీక్షలు నిర్వహిస్తారు. డిసెంబర్ 11, 12, 13న రాష్ట్ర స్థాయి సంబరాలు రాత పరీక్ష, క్విజ్, యాక్టివిటీ రౌండ్స్, సైన్స్ ప్రయోగాలు, సెమినార్లు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి ఉం టాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్లు మ్యాన పవన్ కుమార్,వంశీ, ప్రధానోపాధ్యా యులు ఎదుల మహేష్, ఉపాధ్యాయులు గజ్జెల్లి సునీత, బొమ్మెల ప్రీతి, నూనావత్ రాజేష్, సంద వెంకటేష్, మాదా సు సూర్యతేజ, సతీష్ సంజన, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్లపల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్

జగిత్యాల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)



జగిత్యాల రూరల్ మండలం చర్లపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు 25 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. పంచాయతీ ఆవరణలో మొక్కను నాటారు అనంతరం జిల్లాలోనే మొట్టమొదటి సారిగా 3.50 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో 5 లక్షల రూపాయల చొప్పున నిర్మించనున్న మున్నూరుకాపు రెడ్డి కుల సంఘ భవనాల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. 10లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు అనంతరం గ్రామానికి చెందిన దీటి లావణ్య రాజయ్య గడ్డం అంజయ్య ఈశ్వరి దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చీరను కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా లో మొదటి మ్యాజిక్ డ్రైన్‌కు శంకుస్థాపన చేయటం ఆనందదాయకం అని గ్రామాల్లో నిత్య పారిశుధ్యంతో ఆరోగ్య వాతావరణం ఏర్పడనుందని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పన కోసం కృషి చేస్తున్నానని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు తో పేదల కళ్లలో ఆనందం మహిళ సంఘ భవనాల నిర్మాణానికి అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం మహిళా సాధికారికత కోసం కృషి చేస్తుందని మ్యాజిక్ డ్రైన్ నిర్మాణంతో గ్రామాల్లో కొత్తదనానికి నాంది అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేడిపల్లి వనిత ఆనందరెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి ఎంపిడిఓ రమాదేవి తహసీల్దార్ హకీమ్ ఎంపీఓ రవి బాబు డిఈ మిలింద్ జిల్లా మండల సర్పంచుల ఫోరం బొలిశెట్టి గంగారెడ్డి కట్ట రాజేందర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల ముకుం దం ఏఈ విజయ్ మాజీ సర్పంచ్ తిరు పతి ఉపసర్పంచ్ దుమాల సుమన్ వార్డు సభ్యులు ఇమ్మడి విజయ్బ లుసాని విజయ బలుసాని స్వరూప కోల రాజి రెడ్డి బొమ్మెన రాజేందర్ కార్యదర్శి ఏపీఎం లక్ష్మణ్ మహేష్ డాక్టర్ అమిత్ డాక్టర్ విజయ్ రెడ్డి సర్పంచులు రాజేందర్ నక్క హరీష్ బొడ్డు దామోదర్ మల్లారెడ్డి జగిత్యాల యూత్ అసెంబ్లీ భూమా రెడ్డి నలువాల సురేష్ మహిపాల్ విజయ్ సుమన్ శ్రీకాంత్ తిరుపతిగ్రామ మండల నాయకులు అధికారులు మహిళలు కుల సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి:

ఎమ్మెల్యేకు సమ్మె నోటీసు

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)



ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కి ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేయడం జరిగింది. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించని పక్షంలో 2026 డిసెంబర్ 15వ తేదీ నుంచి ఆశా వర్కర్లు నిరవధిక సమ్మెలో పాల్గొంటారని తెలియజేశారు.ఈ సందర్భంగా ఆశాలు మాట్లాడుతూ ఆశా వర్కర్లు అనేక సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరం ఆరోగ్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని, అయినప్పటికీ వారి శ్రమకు తగిన గుర్తింపు, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించకపోవడం అన్యాయమని అన్నారు. ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనంగా నెలకు రూ.18,000 చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.50 లక్షల జీవిత బీమా, మరణించినప్పుడు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.50 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆశా వర్కర్లు రిటైర్మెంట్ అయినప్పుడు రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించడంతో పాటు, వారు చివరిగా పొందిన పారితోషికంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్లకు ప్రతి ఆదివారం, పండుగ సెలవులు కల్పించాలని, సంవత్సరానికి 20 రోజులు క్యాజువల్ సెలవులతో పాటు ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు మంజూరు చేయాలని అన్నారు. ఏఎన్ఎం, జిఎన్ఎమ్ శిక్షణ పూర్తి చేసిన ఆశా వర్కర్లకు ప్రమోషన్లలో అవకాశం కల్పించాలని, రెండవ పి ఆర్ సి లో రూ.30,000 కనీస వేతనం నిర్ణయించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన రెండు డిఏ లను ఆశా వర్కర్లకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆశా వర్కర్లకు ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను వర్తింపజేసి వారి జీవితాలకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆశా వర్కర్ల సమస్యలను రాష్ట్రప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్లను పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి జరిగే నిరవధిక సమ్మెలో ఆశా వర్కర్లందరూ పాల్గొంటారని ఆశాలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నగరం పద్మ, జిల్లా నాయకులు భాగ్య, పంచశీల, జరీనా, వాణీ లక్ష్మీ, విజయ, రమ సుమలత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ఆజాద్ సేవలు చిరస్మరణీయం

రాజన్న సిరిసిల్ల జిల్లా, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):



భారతదేశ విద్యారంగ అభివృద్ధికి తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని మైనార్టీ బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ ఉరుసా ఫాతిమా అన్నారు. ఆజాద్ జయంతిని పురస్కరించుకుని బుధవారం తంగళ్లపల్లి మండలంలోని మైనార్టీ బాలికల పాఠశాల, కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు, పాటలు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థినులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఉరుసా ఫాతిమా మాట్లాడుతూ స్వాతంత్యసమరయోధుడిగా, గొప్ప పండితుడిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి విశేష సేవలందించారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యం తో ఆయన చేసిన కృషి దేశ విద్యారంగ అభివృద్ధికి పునాదిగానిలిచిందన్నారు. ఆజాద్ ఆశయాలు, ఆదర్శాలను విద్యార్థినులు స్ఫూర్తిగా తీసుకుని క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

యువతలో నాయకత్వ లక్షణాలే వికసిత్ భారత్‌కు పునాది

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):

యూత్ పార్లమెంట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు



యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించి, దేశాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయడమే లక్ష్యంగా జిల్లా స్థాయి వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌లో భాగంగా 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్–2026-27' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మేరా యువ భారత్ (మై భారత్), రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ బి.జె.ఆర్. అగ్రికల్చర్ కళాశాల సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.ఈ సందర్భంగా 'నషా ముక్త్ యువ–డ్రగ్ ఫ్రీ ఇండియా' అంశంపై జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలన, సామాజిక బాధ్యత, దేశాభివృద్ధిపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బి.జె.ఆర్. అగ్రికల్చర్ కళాశాల డీన్ డాక్టర్ ఉపేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే సమాజం, దేశ పురోగతిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. యూత్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు యువతలో నాయకత్వ, వక్తృత్వ నైపుణ్యాలను వెలికితీస్తాయని, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు.పోటీల్లో మొదటి బహుమతిని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు చెందిన దీప్తి రాయ్, రెండో బహుమతిని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థి ఎస్.కె. రామిజ్ రాజా, మూడో బహుమతిని సి.హెచ్. అవినాష్ రెడ్డి సాధించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా యువజన అధికారి గోలి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, అక్కడ ప్రతిభ కనబరిస్తే న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా కార్యక్రమ అధికారి జి. కిరణ్ కుమార్, అగ్రికల్చర్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ రజియా, తెలంగాణ యూనివర్సిటీ కామారెడ్డి ప్రొఫెసర్ డాక్టర్ అంజయ్య, నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ చైతన్య, ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల లెక్చరర్ సవ్య, సైకాలజిస్ట్ పున్నం చందర్, మై భారత్ ప్రతినిధులు లోపెల్లి రాజు, అక్కెం నాగరాజు, సాయి అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

వుదయం



రైతులకు రుణాల చెల్లింపులపై

మారటోరియం అమలు చేయాలి

- రుణాల రీ షెడ్యూలింగ్ కు చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

నారాయణపేట నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)

నారాయణపేట జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో బ్యాంకర్లతో నిర్వహించిన ప్రత్యేక జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ (స్పెషల్ డీసీసీ) సమావేశంలో ఆమె మాట్లాడారు.జిల్లాలో గత 13 నెలలుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, సాధారణ వర్షపాతంతో పోలిస్తే 45 శాతం, గత ఏడాది వర్షపాతంతో పోలిస్తే సుమారు 65 శాతం లోటు వర్షపాతం నమోదైందని కలెక్టర్ తెలిపారు. . వర్షాభావం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. వరి సాగు నుంచి పత్తి తదితర ప్రత్యామ్నాయ పంటల సాగుకు మారిన రైతులు కూడా పెట్టుబడులు పెట్టి ఆశించిన దిగుబడులు పొందలేకపోయారని తెలిపారు.రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉన్నత స్థాయిలో సమీక్షించడంతో పాటు శాసనసభలో కూడా ఈ అంశంపై చర్చించిందని కలెక్టర్ వెల్లడించారు.రైతులు తీసుకున్న రుణాల చెల్లింపులపై మారటోరియం విధించడం, రుణాల పునర్వ్యవస్థీకరణ (రీషెడ్యూలింగ్) ద్వారా రైతులకు ఉపశమనం కల్పించే అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులు,బ్యాంకు మేనేజర్లు రైతులకు సంబంధించిన రుణాల విషయంలో ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతుల రుణాల వసూలు విషయంలో ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టరాదని,రుణాల చెల్లింపులపై మారటోరియం అమలు చేయడంతో పాటు, అవసరమైన చోట రుణాల పునర్వ్యవస్థీకరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత బ్యాంకులు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత బ్యాంకులపై ఉందని,రైతులకు మరింత ఆర్థిక భారం కలగకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు జిల్లాలోని ప్రతి బ్యాంకు శాఖకు చేరేలా చర్యలు తీసుకుని, వాటిని కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

రైతుల సంక్షేమం, వారి ఆర్థిక భద్రతకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఈ విషయంలో బ్యాంకర్లు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్డీవో వెంకట్ రాములు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, లీడ్ బ్యాంక్ మేనేజర్ సురేష్ ఆత్రేయ, అన్ని బ్యాంకుల మేనేజర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయంతో తక్కువ నీటితో అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం

రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి – జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- జడ్చర్ల మండలం ఈర్లపల్లిలో గో ఆధారిత సమీకృత సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్
- సౌరశక్తితో పనిచేసే సోలార్ పాలీ టన్నెల్ ప్రారంభం
- రసాయన రహిత సాగుతో నేల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు అవకాశం

మహబూబ్‌నగర్

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగి తాగునీరు, సాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని, ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలు, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

బుధవారం జడ్చర్ల మండలం ఈర్లపల్లి గ్రామంలో రైతు రాజవర్ధన్ రెడ్డి 34 ఎకరాల్లో అభివృద్ధి చేసిన గో ఆధారిత సమీకృత సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా సౌరశక్తితో పనిచేసే సోలార్ పాలీ టన్నెల్‌ను ప్రారంభించారు.క్షేత్రంలో అమలు చేస్తున్న గో ఆధారిత సేంద్రీయ వ్యవసాయ విధానాలు, వివిధ రకాల పంటల సాగు, పశుపోషణ, మునగతో పాటు ఇతర ఉద్యాన పంటల పెంపకం, సౌరశక్తి సహాయంతో మునగ ఆకుల పొడి తయారీ ప్రక్రియను పరిశీలించారు. ఆవు పేడ, ఆవు మూత్రంతో తయారుచేసిన సహజ ఎరువుల వినియోగం, తక్కువ నీటి వనరులతో పంటలు సాగు చేస్తున్న విధానాలను రైతును అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతుల నుద్దేశించి మాట్లాడుతూ కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ

సేంద్రీయ వ్యవసాయ క్షేత్రంలో ఏ మొక్కను ఎక్కడ నాటాలి, వాటి మధ్య అంతర పంటలుగా ఏయే పంటలను సాగు చేయాలి, తద్వారా నేల సారం, పర్యావరణ సమతుల్యతతో పాటు రైతులకు ఏ విధంగా ప్రయోజనం చేకూరుతుందనే



అంశాలను శాస్త్రీయ అవగాహనతో అమలు చేస్తున్న తీరు అభినందనీయమన్నారు. ఇలాంటి సమీకృత వ్యవసాయ క్షేత్రాలు ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పప్పుధాన్యాలు, కూరగాయలు, చిరుధాన్యాలు, ఆయిల్‌పామ్ వంటి పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు రైతులు మెరుగైన ఆదాయం పొందేందుకు అవకాశాలు ఉంటాయని వివరించారు.

సేంద్రీయ వ్యవసాయంలో ప్రారంభ దశలో నిరంతర పర్యవేక్షణ, తగిన శ్రద్ధ అవసరమని, అయితే రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా దీర్ఘకాలంలో నేల సారం పెరగడంతో పాటు సాగు వ్యయాన్ని తగ్గించుకోవచ్చని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.

వ్యవసాయ రంగంలో యువత భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని, ఐటీ వంటి ఇతర రంగాల్లో పనిచేస్తున్న వారు సైతం సేంద్రీయ వ్యవసాయం వైపు ఆసక్తి చూపడం సంతోషకరమన్నారు. రైతుల పిల్లలు వ్యవసాయానికి దూరం కాకుండా ఆధునిక సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై వారికి అవగాహన, శిక్షణ కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు.

రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం, మారుతున్న ఆహారపు అలవాట్లు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంటూ, రైతులు తమ కుటుంబ అవసరాల కోసం కొంత భూమిలోనైనా రసాయన రహిత ఆహార పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు వంటి పోషక విలువలున్న ఆహార పదార్థాలను నిత్యాహారంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సేంద్రీయ వ్యవసాయంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కల్పిస్తూ రైతులకు మార్గదర్శకత్వం అందిస్తున్న విజయరామ్, హుస్సేన్ బాబు, ముకుంద రెడ్డి తదితరుల సేవలను కలెక్టర్ అభినందించారు. జిల్లాలో మరిన్ని సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాల ఏర్పాటుకు, రైతులు, యువతకు అవసరమైన శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం అందించేందుకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సేంద్రీయ వ్యవసాయ నిపుణులు, రైతులు పాల్గొన్నారు.

ఈ నెల 13న యాలాల మండలంలో ఎమ్మెల్యే పర్యటన

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- *లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

యాలాల: నవంబర్ 11 వుదయం ప్రతినిధి,

ఈ నెల 13వ తేదీ శుక్రవారం తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గారు యాలాల మండలంలో పర్యటించనున్నట్లు యాలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుర్వ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జుంటుపల్లి, అగ్గనూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. అర్హులైనలబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తారని తెలిపారు.



ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,మరియు సంబంధిత అధికారులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కుర్వ మహిపాల్ కోరారు.

విద్యారంగానికి ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయం



- నేటి యువతకు ఆయన జీవితం ఆదర్శనీయం
- ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలు
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, నవంబర్ 12 (వుదయం ప్రతినిధి):

భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగానికి, విద్యా సంస్కరణలకు చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. ఆయన జీవితం, దేశభక్తి నేటి యువతకు ఆదర్శ ప్రాయమని పేర్కొన్నారు.

బుధవారం మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆజాద్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 1923లో తన 35 ఏళ్ల వయసులోనే ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీకి అత్యంత పిన్న వయస్కుడైన అధ్యక్షుడిగా ఆజాద్ ఎన్నికయ్యారని గుర్తుచేశారు. ఆయన జయంతిని ఏటా జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా ఆధునిక విద్యావిధానానికి పునాదులు వేసి, అనేక విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆజాద్ తన జీవితాన్ని దేశసేవకు అంకితం చేశారని, ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా భారతరత్న పురస్కారం లభించిందని తెలిపారు. ఆజాద్ ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని యువత విద్యకు ప్రాధాన్యత తనిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్య సమాజ, దేశ ప్రగతికి పునాది

- ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు

సంగారెడ్డి, నవంబర్ 11:వుదయం



భారతదేశ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్లు పాండు, సంగీత పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల నిధుల సంఘం ఏర్పాటుకు, సాంకేతిక, శాస్త్రీయ విద్యాభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని తెలిపారు.

జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు పాండు, సంగీత ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం వారు మాట్లాడుతూ.. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలందించారని తెలిపారు. దేశంలో ఉన్నత విద్యాసంస్థల స్థాపనకు, యూజీసీ ఏర్పాటుకు, సాంకేతిక, శాస్త్రీయ విద్యాభివృద్ధికి బలమైన పునాదులు వేశారని వివరించారు. చదువుతోనే ప్రపంచాన్ని మార్చగలమని మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశ్వసించారని గుర్తుచేశారు. విద్య వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ అభివృద్ధికి, దేశ ప్రగతికి కూడా పునాది అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆయన ఆశయాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చలపతిరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు,మైనారిటీ వనపర్తి నవంబర్ 11 వుదయం ప్రతినిధి

ఈ సమావేశానికి వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్య దేవరాజన్ మాట్లాడుతూ వి బి జి రామ్ జి కింద నిర్దేశించిన పనుల లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

అనంతరం అదనపు కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో వి బి జి రామ్ జి కింద చేపట్టాల్సిన అన్ని పనులను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల్లో ఇంటింటికి ఇంకుడు గుంతల నిర్మాణం, బోరుబావుల రీచార్జ్ నిర్మాణాలు, వ్యవసాయ కుంటల ఏర్పాటు పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రతి ఎంపీడీఓ తమ పరిధిలోని గ్రామాల్లో పనుల లక్ష్యాలను పర్యవేక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంకుడు గుంతల నిర్మాణాలకు ప్రభుత్వం వద్ద తగినన్ని నిధులు అందుబాటులో ఉన్నాయని, పనులు పూర్తయిన 15 రోజుల్లోగా నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని తెలిపారు. కాబట్టి నిధుల కొరతపై ఆందోళన చెందకుండా పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు సర్పంచులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో పనులను ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా కూలీల సమీకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రామాల్లో కూలీలకు అవగాహన కల్పించి పనుల్లో ఎక్కువ మంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వి బి జి రామ్ జి పనులన్నింటినీ నిర్దేశించిన లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ ఉమాదేవి, జెడ్పి సీఈవో యాదయ్య, డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్, సంబంధిత జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, పంచాయతీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.సంక్షేమ శాఖ సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఏడేళ్లకు ఛాంబర్లకు మూతలు.. కుప్పలు ఎత్తేది ఎప్పుడో!

- పనులు పూర్తయినా రోడ్డుపైనే వ్యర్థాలు.. ప్రమాదాలకు నిలయంగా 35వ వార్డు రహదారి
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

గద్వాల నవంబర్ 11 (వుదయం బ్యూరో)



జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని 35వ వార్డులో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. డ్రైనేజీ నిర్మాణం చేపట్టి దాదాపు ఏడేళ్లకు ఛాంబర్లకు మూతలు ఏర్పాటు చేసినా, నిర్మాణ పనుల సందర్భంగా పేరుకుపోయిన సిమెంట్, మట్టికుప్పలను తొలగించడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నా రని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, చిన్నారులు ప్రమాదాల బారినపడి గాయపడుతున్నారని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత రహదారిని శుభ్రం చేయాల్సిన కనీస బాధ్యతను కూడా అధికారులు విస్మరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఛాంబర్ల మూతల కోసం ఏడేళ్లు వేచి చూడాల్సి వచ్చిందని, ఇప్పుడు రోడ్డుపై ఉన్న కుప్పలను తొలగించేందుకు ఇంకెన్నేళ్లు ఎదురుచూడాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి కైనా జిల్లా కలెక్టర్ స్పందించి, 35వ వార్డులో పేరుకుపోయిన వ్యర్థాలను తక్షణమే తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సిద్దిపేటలో 13 న పార్టీ ఆఫీస్ కు భూమి పూజ చేయనున్న కల్వకుంట్ల కవిత

కొండపాక ,వుదయం



తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తొలి జిల్లా ప్రాంతీయ కార్యాలయ నిర్మాణానికి ఈ నెల 13వ తేదీ ఉదయం 8గంటలకు సిద్దిపేట రంగదాంపల్లిలో భూమి పూజ చేయనున్నారని, ఇట్టి కార్యక్రమానికి గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తలు తరలిరావాలని కోరారు టీఆరెస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ కొట్టాల యాదగిరి.

ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ

ఉద్యమ చరిత్రకు నిలయమైన సిద్దిపేట గడ్డపై పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు అనువుగా జిల్లా పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ, సామాజిక పరిస్థితులను పరిశీలించి, ప్రజా సమస్యలే లక్ష్యంగా, సామాజిక న్యాయమే ధ్యేయంగా తెలంగాణ రక్షణ సేనను స్థాపించిన కల్వకుంట్ల కవిత ప్రజల పక్షాన నిలుస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. కల్వకుంట్ల కవిత తెలంగాణ తొలి మహిళా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎట్ల నర్సింలు, గజ్వేల్ నియోజకవర్గ న్యాయ విభాగం అధ్యక్షులు నరేష్ చారి, గజ్వేల్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగని రాజు, పాషా, శ్రీనివాస్, మల్లేశం, అఫ్రఖ్, మున్ను, లక్ష్మణ్, మహిళా నాయకురాలు శైలజ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు సిద్దిపేట సమాయత్తం





- బందోబస్తు, పగడ్బందీ ఏర్పాట్లకు అధికారులకు కలెక్టర్ ఆదేశం

సిద్దిపేట, నవంబర్ 11 (వుదయం బ్యూరో)

రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈనెల 19వ తేదీన సిద్దిపేట జిల్లాలో జరగనున్న భారీ బహిరంగ సభకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ కె. హైమావతి, కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మీ పెరుమాళ్‌తో కలిసి నాగదేవత గుడి సమీపంలోని సభ ప్రాంగణాన్ని, హెలిప్యాడ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సభకు వచ్చే వీఐపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు మరియు మీడియా ప్రతినిధుల కోసం పగడ్బందీగా ప్రత్యేక గ్యాలరీలు, బలమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ బందోబస్తుతో పాటు భారీగా తరలివచ్చే జనానికి తాగునీరు, నిరంతర విద్యుత్ వంటి వసతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా శాఖలవారీగా ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, రెవెన్యూ, ఆర్ అండ్ బి, విద్యుత్, గ్రామీణాభివృద్ధి మరియు పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి

- డిసెంబర్ 30న తుది జాబితా ప్రచురణ : కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నాగర్‌కర్నూల్, నవంబర్ 11 (వుదయం బ్యూరో) :



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 30వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు ఆయన తెలిపారు.బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ బి. చెన్నయ్యతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు .ఈ సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు, ఓటరు జాబితా సవరణ, పేర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రక్రియలో భాగస్వాములై, సూచనలు, అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు.

ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా అభ్యంతరాలు, క్లెయిమ్‌లు సమర్పించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అందిన ప్రతి అభ్యంతరాన్ని, క్లెయిమ్‌ను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరిస్తారని స్పష్టం చేశారు.అభ్యంతరాల పరిశీలన, పరిష్కార ప్రక్రియ పూర్తయిన అనంతరం కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా సవరణ ప్రక్రియను బాధ్యతాయుతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ కోరారు. పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి, నిబంధనల అమలు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, డిసెంబర్ 30న తుది జాబితా ప్రచురణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎండి హుస్సేన్, బాలకృష్ణ, ఎండి హబీబ్, పర్వతాలు, రాజేందర్, వెంకటయ్య, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్, ఎన్నికల డీటీ కల్పన, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విజయేందర్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), నవంబర్ 11, వుదయం:

మిరుదొడ్డి గ్రామంలో ఇటీవల మృతి చెందిన కంచర్ల విజయేందర్ గౌడ్ కుటుంబాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్ర రాజిరెడ్డి బుధవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, రూ.5000 ఆర్థిక సాయంతో పాటు 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ... అధైర్యపడవద్దని, తామంతా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ గృహప్రవేశం వేడుకలలో పాల్గొన్న ఏఎంసి చైర్మన్ బి పరుశరామ్ రెడ్డి.

పూడూర్ నవంబర్ 11, (వూదయం)
వికారాబాద్ జిల్లా బుధవారం పరిగి మండలంలోని హీర్యా నాయక్ తండాలో, మాదారం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లుల ప్రారంభోత్సవంలో మరియు పలు శుభకార్యాలలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన పరిగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భూమన్న గారి పరశురాం రెడ్డి . ఈ కార్యక్రమంలోపరిగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు , డిసిసి జనరల్ సెక్రెటరీ అశోక్ , పరిగి పట్టణ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి , పరిగి మున్సిపల్ నాయకులు కుడుముల వెంకటేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు నాయక్, మున్సిపల్ కౌన్సిలర్ లు ఆనం ఆంజనేయులు, నస్కల్ చంద్రయ్య, చిన్న నరసింహులు, సాయిరాం , ఘనమోని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో వేగం పెంచాలి

పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలి



మహబూబ్‌నగర్
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ అధ్యక్షతన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో అమలవుతున్న గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి హామీ పథకం పురోగతి, వివిధ మౌలిక వసతుల అభివృద్ధి పనుల మంజూరు, పెండింగ్ పనులపై సమగ్రంగా సమీక్షించారు .ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ హాజరయ్యారు. డీఆర్‌డీఓ నర్సింహులు, డీపీఓ వెంకట్ రెడ్డి, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా జాబ్ కార్డుల స్థితిగతులు, కూలీల సమీకరణ, మేట్ల నియామకం, స్థానీకరణ, శిక్షణ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. జలసిరి పనులు, మెటీరియల్ కాంపోనెంట్ జనరేషన్‌పై సమీక్ష నిర్వహించారు.అలాగే నూతన గ్రామ పంచాయతీ భవనాలు, గ్రామ సంఘాల (VO) భవనాలు, అంగన్వాడీ కేంద్రాల (AWC) భవనాల మంజూరు ప్రతిపాదనలతో పాటు గ్రామీణ నీటి సరఫరా (RWS) మరమ్మతు పనులు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనుల మంజూరుపై చర్చించారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు, పనుల జియో ట్యాగింగ్, జల్ శక్తి అభియాన్ (JSJB) కార్యక్రమం అమలు, పురోగతిని కూడా సమీక్షించారు.
ఈ సందర్భంగా నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడం, పెండింగ్ పనులను త్వరితగతిన పరిష్కరించడం, అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత పాటించడం, ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించడంపై దృష్టి సారించాలని కమిషనర్ దివ్య దేవరాజన్ సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలు పెంపొందించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె దిశానిర్దేశం చేశారు.



మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

నారాయణపేట టౌన్ నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)
మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ విద్యారంగ అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను పిలుపునిచ్చారు.బుధవారం భారత తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్‌తో కలిసి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారతదేశానికి విశిష్ట సేవలందించారని కొనియాడారు. దేశంలో విద్యావ్యవస్థ బలోపేతానికి, విద్యావకాశాల విస్తరణకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్య ద్వారానే వ్యక్తి వికాసం, సమాజ అభివృద్ధి, దేశ ప్రగతి సాధ్యమవుతాయని అన్నారు.జాతీయ సమైక్యత, మతసామరస్యం, సమానత్వం వంటి ఉన్నత విలువల కోసం మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషి నేటి తరానికి ఆదర్శప్రాయమని తెలిపారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలన్న ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లాలని, విద్య ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ విద్యారంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ. రషీద్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, జిల్లా మత్స్యశాఖ అధికారి రెహమాన్, వివిధ శాఖల అధికారులు, మైనార్టీ సంక్షేమ శాఖ సిబ్బంది రషీద్, షమీమ్, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో పాలక వర్గానికి సన్మానించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



వెల్దండ నవంబర్ 11 (వు దయం)
వెల్దండ మండల సింగిల్ విండో నూతన పాలక వర్గాన్ని బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చైర్మన్ భూపతి రెడ్డి, వైస్ చైర్మన్ శంకర్ నాయక్ మరియు డైరెక్టర్ లను శాలువాల తో సన్మానించి అభినందించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ... రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండాలని సూచించారు. ఈ పాలక వర్గం ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, వైస్ చైర్మన్ మండల పార్టీ అధ్యక్షుడు హరి కిషన్ నాయక్, డైరెక్టర్ లు గంగాధరి మల్లేష్ ముదిరాజ్, కొయ్యల పుల్లయ్య, యాదమ్మ, కళ్యమ్మ, లాల్ నాయక్, శ్రీనివాస్ యాదవ్, పవన్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రషీద్, ఫూల్ సింగ్, పురుషోత్తం, శ్రీనివాస్ లు, లక్మణ్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాటలతో కాదు.. చేతల్లో అభివృద్ధి చేసి చూపిస్తాం.



- **ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి.**

నారాయణఖేడ్, నవంబర్ 11(వుదయం)
నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ముందుకు సాగుతున్నామని, గతంలో పదేళ్ల పాటు అధికారంలో ఉండి చేయలేని పనులను తాము కేవలం మూడేళ్లలోపు పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నామని శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం
ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి చేసిన విమర్శలకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తిప్పి కొట్టారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, మంజూరైన నిధులు, భవిష్యత్తులో చేపట్టనున్న ప్రాజెక్టుల వివరాలను వెల్లడించారు.
విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో సుమారు రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ స్థాయిలో విద్యా సంస్థను నారాయణఖేడ్ కు తీసుకురావాలనే ఆలోచన గతంలో పదేళ్లు అధికారంలో ఉన్న నాయకులకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు.
నారాయణఖేడ్ పట్టణ పరిధిలో ఉన్న సుమారు 350 ఎకరాల అటవీ భూమిని గుర్తించి, దానిని అద్భుతమైన అర్బన్ ఫారెస్ట్ పార్కుగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చదనం అందించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని పేర్కొన్నారు.
నియోజకవర్గ అభివృద్ధికి మంజూరైన రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, రూ.5 కోట్లతో అర్బన్ ఫారెస్ట్ పార్క, రూ.5 కోట్లతో ఇండోర్, అవుట్ డోర్ స్టేడియం,రూ.47 కోట్లతో ఏటీసీ సెంటర్,రూ.2 కోట్లతో సాయిల్ టెస్టింగ్ ల్యాబ్,రూ.5 కోట్లతో కమలాపూర్ చెరువులో బోటింగ్ మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు, రూ.65 కోట్లతో సింగూరు నుంచి నల్లవాగు వరకు కెనాల్ నిర్మాణ ప్రతిపాదన త్వరలోనే జీవో విడుదల,పట్టణంలో రూ.16.28 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, మంగల్ పేట నుంచి రాజీవ్ చౌక్ వరకు రూ.15 కోట్లతో మురుగు నీటి కాల్వలు, సీసీ రోడ్లు, రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఇవే కాకుండా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాల మౌలిక సదుపాయాలు, రైతు సంక్షేమ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు.నారాయణఖేడ్ నియోజకవర్గంలో భూగర్భ జలాలు పెంపొందించడంతో పాటు ప్రతి మండలానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో మినీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సింగూరు నుంచి నేరుగా నల్లవాగు వరకు కెనాల్ నిర్మాణం చేపట్టడం ద్వారా సాగునీరు, తాగునీటి అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.
నారాయణఖేడ్ పట్టణ రింగ్ రోడ్డు పనులు ప్రజల సహకారంతోనే చేపట్టబడ్డాయని, ఈ రోడ్డు నిర్మాణానికి స్థానిక రైతులు స్వచ్ఛందంగా భూమి అందించారని తెలిపారు. రింగ్ రోడ్డు అంటే పట్టణానికి అవసరమైన అంతర్గత రవాణా సౌకర్యం, ట్రాఫిక్ నియంత్రణ, పట్టణ విస్తరణకు తోడ్పడే రోడ్డు అని వివరించారు. ప్రస్తుత పనులు ప్రజల అవసరాలు, భూమి లభ్యత, నిధుల లభ్యతను దృష్టిలో ఉంచి దశలవారీగా చేపట్టబడుతున్నాయని, భవిష్యత్తులో పట్టణానికి అవసరమైన విస్తృత రింగ్ రోడ్డు, బైపాస్ పనుల కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని చెప్పారు.
చిన్నచిన్న భూములు కలిగిన రైతులు సైతం తమ భూమిలో కొంత భాగం ఇచ్చైనా సరే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని స్వచ్ఛందంగా ముందుకు వచ్చారన్నారు. స్థానిక కౌన్సిలర్లు, నాయకులు, కాలనీవాసులు కూడా రింగ్ రోడ్డు నిర్మాణానికి సహకరించడంతో ముందుకెళ్లామన్నారు.100 అడుగుల వెడల్పుతో రోడ్డు వేయాలని మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేకు క్షేత్ర స్థాయిలో రైతుల పరిస్థితులు, భూముల స్వరూపం గురించి తెలుసా అని ప్రశ్నించారు. అభివృద్ధి అనేది ప్రజల అవసరాలు, రైతుల అభిప్రాయాలు, స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని జరగాలని అన్నారు.బానాపూర్, జి. హుక్రా, వెంకటాపూర్ గ్రామాల పేరుతో రూ.1.65 కోట్ల నిధులు దుర్వినియోగమైనట్లు చేసిన ఆరోపణ పూర్తిగా తప్పని, ఈ నిధులు ఏ పనులకు మంజూరయ్యాయో, ఎక్కడ జరిగాయో, ఎవరు పర్యవేక్షించారో, ఏ శాఖ పరిధిలో ఉన్నాయో అన్ని వివరాలు అధికారిక రికార్డుల్లో ఉన్నాయని తెలిపారు.
నిజాంసాగర్ ప్రాజెక్టులో మునిగిన భూములకు సంబంధించిన రికార్డులు, ధరణిలో భూముల నమోదు, ప్రభుత్వ భూముల వ్యవహారాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై సంబంధిత రికార్డులు, ఆధారాలతో విచారణ జరగాలని పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే గతంలో చేసిన అభివృద్ధిని ప్రజలు చూశారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను కూడా ప్రజలు ప్రత్యక్షంగా గమనిస్తున్నారన్నారు.మున్సిపాలిటీకి అందించిన యంత్రాలు, వాహనాలు ప్రజల సొత్తేనని, వాటిని ప్రైవేట్ పనులకు వినియోగిస్తున్నట్లు నిర్ధారణ అయితే తక్షణమే తగిన చర్య తీసుకుంటామన్నారు. అయితే ఆధారం లేకుండా ప్రజా సంస్థల పనితీరును దూషించడం సరికాదని అన్నారు.
ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపడుతుంటే వాటికి సహకరించాల్సింది పోయి, రాజకీయ విమర్శలతో ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదన్నారు.నారాయణఖేడ్ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మరిన్ని నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.
మాటలతో కాదు.. చేతల్లో అభివృద్ధి చేసి చూపిస్తాం. రాజకీయ విమర్శలకు భయపడేది లేదు.. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే మా లక్ష్యం అన్నారు.దేవుడు అన్నీ గమనిస్తూనే ఉంటాడు. ఎవరు ప్రజల కోసం పనిచేస్తున్నారు? ఎవరు రాజకీయాల కోసం మాట్లాడుతున్నారు? అనేది ప్రజలకు తెలుసు. ప్రజల ఆశీర్వాదంతో నారాయణఖేడ్ అభివృద్ధి ప్రస్థానం కొనసాగుతుందన్నారు.
ఈ కార్యక్రమంలో నారాణఖేడ్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరికల్ రైల్వే స్టేషన్ ను సందర్శించిన డిఆర్ఎం



మరికల్ నవంబర్ (11 వుదయం ప్రతినిధి)
మరికల్ మండల కేంద్రంలోని బుధవారం మరికల్ రైల్వే స్టేషన్ కు సౌత్ సెంట్రల్ రైల్వే డిఆర్ఎం సంతోష్ కుమార్ శర్మ సందర్శించారు ఆ సమయంలో మరికల్ అఖిల పక్ష నాయకులు ఆధ్వర్యంలో మదికల్లో వారిని కలిసి విశాఖ ఎక్స్ప్రెస్ ఆపాలని విన్నపం ద్వారా తెలిపారు మిగతా ప్రస్తుత నడుస్తున్న రైళ్లు ఉదయం సమయంలో మాకు అనుకూలంగా సమయంలో నడపాలని ఉదయం ప్రజలు హైదరాబాదు వెళ్తూ పనులు నిమిత్తం ప్రజలు పాలమూరు గానీ హైదరాబాదు గాని వెళ్లి వారి పనులు చూసుకోని అనుకూలంగా ఉంటుందని అలాగే విద్యార్థులకు ఉద్యోగులకు సానుకూలంగా ఉంటుందని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు ఆయన సానుకూలంగా స్పందించారు

అఖిలభారత్ కిసాన్ జాతీయ మహాసభలను

జయప్రదం చేయండి



రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. శ్రీనివాస్ పిలుపు
బిజినపల్లి, నవంబర్ 09 (వుదయం ప్రతినిధి) :
అఖిలభారత్ కిసాన్ సభ జాతీయ 36వ మహాసభలు నల్లగొండ పట్టణంలో జరుగుతున్నాయని, ఈ నెల 15న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. శ్రీనివాస్ పిలుపునిచ్చారు.
బుధవారం నాడు
బిజినపల్లి మండల కేంద్రంలో జీప్ జాతాను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. విద్యుత్తును ప్రైవేటీకరణ చేయడంతో పంపుసెట్లపై ఆధారపడే రైతులందరూ అప్పుల పాలు కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొస్తూ కార్పొరేట్ శక్తులకు వ్యవసాయాన్ని అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో దేశంలో రైతుల అండగా నిర్వహించబోయే పోరాటాలను ఈ మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు అశోక్, కాశన్న, మధు, హనుమంతు, కాశన్న, రాములు, వెంకటయ్య, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

అప్పాయిపల్లిలో రీసర్వే



భూ వివరాల పరిశీలనలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు దౌల్తాబాద్ నవంబర్ 11 (వుదయం):
దౌల్తాబాద్ మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూ రికార్డులను సరిచూసేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. రీసర్వే ద్వారా భూ సరిహద్దులు, భూ వివరాల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోసాని యాదగిరి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) నాగరాజు, లైసెన్స్‌డ్ సర్వేయర్ రాజు, జీపీఓ కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ కేశబోయిన ప్రభాకర్, స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసం ఎమ్మెల్యే పదవికైనా రాజీనామా చేస్తా!

- **పదవి ముఖ్యం కాదు.. రైతుల ప్రయోజనాలే ముఖ్యం**
- **దుబ్బాకను కరువు ప్రాంతంగా ప్రకటించాలి.. పెండింగ్ సాగునీటి పనులు పూర్తి చేయాలి**
- **ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**



దౌల్తాబాద్, నవంబర్ 11 (వుదయం):
రైతులకు మేలు జరుగుతుందంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి సైతం సిద్ధంగా ఉన్నానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. తనకు పదవులు ముఖ్యం కాదని, రైతుల ప్రయోజనాలు, నియోజకవర్గ అభివృద్ధే ప్రధానమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్నారనే కారణంతో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం లేదని భావిస్తే, రైతుల కోసం రాజీనామా చేసేందుకు సిద్ధమని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. దుబ్బాక నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.బుధవారం రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి కాల్వల పనులను తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి తిరిగి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.
సాగునీరు అందక, సరిపడా విద్యుత్ సరఫరా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ పంటలను నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. రాజకీయ కక్షసాధింపు ధోరణితో రైతులకు అన్యాయం చేయడం సరికాదని, పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.
సిద్దిపేట జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సమానంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి, ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.తనపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలను ఖండిస్తూ.. ప్రజా సమస్యలపై స్పందించకుండా రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు. విమర్శలు చేయడం మానుకుని, అసంపూర్తిగా ఉన్న సాగునీటి కాల్వల పనులు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సవాల్ విసిరారు. రైతుల కష్టాలను గుర్తించి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని, రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో ఏపీఎం యాదగిరి, ఏవో నరేష్, ఆర్ఐ రాజమల్లు, గ్రామ సర్పంచ్ సోమని నిర్మల ఇస్తారి, సర్పంచులు నరసింహారెడ్డి, అహ్మద్ పర్వేజ్, మాసంపల్లి రాజు, మాజీ జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, ఉప సర్పంచులు వేణుగోపాల్ గౌడ్, సంతోష్, రాజు, మండల మాజీ ఉపాధ్యక్షులు వెంకట్ గౌడ్, సత్యం, రాష్ట్ర యువజన విభాగం నాయకులు రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, మాజీ సర్పంచులు తిరుపతి, నర్సింలు, రామచంద్రం గౌడ్, నాయకులు శ్రీధర్, భార్గవ్, బాలరాజ్ గౌడ్, బాగిరెడ్డి, రాజయ్య, ప్రసాద్ గౌడ్, మధు, బాలనర్స్, సీసీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి పూర్ణచందర్, ఫీల్డ్ అసిస్టెంట్ సరిత, ఏఈఓ మాధవి తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా కిమ్స్ ఎరీట్ హాస్పిటల్





శేరిలింగంపల్లి, నవంబర్ 11, (వుదయం ప్రతినిధి) :
అడ్వాన్స్‌డ్ స్పైన్ కేర్ విభాగంలో హైదరాబాద్‌లోని కిమ్స్ ఎరీట్ హాస్పిటల్ అరుదైన ఘనత సాధించింది. హాస్పిటల్‌లోని స్పైన్ ఇన్‌స్టిట్యూట్‌కు జర్మనీకి చెందిన ప్రముఖ సంస్థ 'రీవోస్పైన్' (RIWOspine) "సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఫుల్ ఎండోస్కోపిక్ అడ్వాన్స్‌డ్ స్పైన్ సర్జరీ"గా గుర్తింపునిచ్చింది. డాక్టర్ సుకుమార్ సురా నేతృత్వంలో గత 13 ఏళ్లకు పైగా ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ విభాగంలో అందించిన విశేష సేవలకు గానూ భారతదేశంలోనే మొదటిసారిగా ఈ గుర్తింపు లభించింది.మూడు దశాబ్దాలకు పైగా ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ సాంకేతికత, శిక్షణ మరియు విద్యారంగంలో అనుభవం ఉన్న రీవోస్పైన్ (జర్మనీ) ప్రతినిధుల సమక్షంలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధికారికంగా ప్రారంభమైంది. కిమ్స్ ఎరీట్ హాస్పిటల్‌లో ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ సాధారణ డిస్క్ చికిత్సలకే పరిమితం కాకుండా, స్పైనల్ కెనాల్ స్టెనోసిస్, సెలెక్టెడ్ ఫిక్సేషన్ ప్రొసీజర్లు, స్పైనల్ ట్యూమర్లు, అలాగే సెర్వికల్ మరియు థొరాసిక్ స్పైన్‌కు సంబంధించిన సంక్లిష్ట సమస్యలకు చికిత్స అందించే స్థాయికి విస్తరించింది.ఫుల్‌ఎండోస్కోపిక్ పద్ధతుల ద్వారా చిన్న గాటు (ఇన్సిషన్)తోనే వెన్నుపూస సమస్యలను నయం చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల కండరాలకు నష్టం తగ్గడమే కాకుండా, రక్తస్రావం తగ్గి, రోగులు త్వరగా కోలుకుంటారు. సమస్య తీవ్రతను బట్టి, కొందరు రోగులు సర్జరీ జరిగిన కొన్ని గంటల్లోనే నడవగలుగుతారు మరియు 24 గంటల్లోగా డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళ్లవచ్చు.ఈ సందర్భంగా కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి. భాస్కర్ రావు మాట్లాడుతూ.. "నేడు వైద్యరంగం అత్యాధునిక శస్త్రచికిత్సల వైపు వేగంగా అడుగులు వేస్తోంది. సాంకేతికత ఎంత ముఖ్యమో, వైద్యుల అనుభవం, నైపుణ్యం కూడా అంతే ముఖ్యం. సరైన శిక్షణ, వైద్య అనుభవం మరియు రోగుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అత్యాధునిక వైద్య విధానాలను బాధ్యతాయుతంగా అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యం" అని తెలిపారు.కిమ్స్ ఎరీట్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ నారోసర్జన్, క్లినికల్ డైరెక్టర్ & హెచ్ఓడీ (స్పైన్ సర్జరీ), నేషనల్ లీడ్ (ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ) డాక్టర్ సుకుమార్ సురా మాట్లాడుతూ..". ఫుల్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ విభాగంలో అత్యుత్తమ వైద్య ప్రమాణాలు అందించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుంది" అని పేర్కొన్నారు.కిమ్స్ హాస్పిటల్స్ గ్రూప్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిఖిల్ మాథూర్ మాట్లాడుతూ.. "ఆధారాలతో కూడిన వైద్యం (ఎవిడెన్స్‌బేస్డ్ మెడిసిన్) మరియు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవడమే కిమ్స్ హాస్పిటల్స్ ధ్యేయం. రీవోస్పైన్ గుర్తింపు మా వైద్య నాణ్యతకు, నిరంతర ఆవిష్కరణలకు నిదర్శనం" అని అన్నారు. రీవోస్పైన్ (జర్మనీ) సిఓఓ శ్రీ డిర్క్ గోథెల్, ఇంటర్నేషనల్ సేల్స్ డైరెక్టర్ శ్రీమతి లెనా గోథెల్ మాట్లాడుతూ.. "ఫుల్‌ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీకి కేవలం సాంకేతికత మాత్రమే సరిపోదు; సరైన శిక్షణ, అనుభవం మరియు రోగుల పట్ల నిర్మాణాత్మకమైన విధానం అవసరం. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌కు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గుర్తింపును అందించడం మాకు ఎంతో సంతోషంగా ఉంది" అని తెలిపారు.ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రధానంగా రెండు అంశాలపై దృష్టి సారిస్తుంది: అర్హులైన రోగులకు అడ్వాన్స్‌డ్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ సేవలను విస్తరించడం మరియు స్పైన్ సర్జన్లకు అవసరమైన శిక్షణ, నాలెడ్జ్ షేరింగ్ అందించడం.డాక్టర్ సుకుమార్ సురా ఆరు సంవత్సరాల క్రితం ఏషియన్ స్పైన్ హాస్పిటల్‌ను స్థాపించారు. ఈ హాస్పిటల్ ఇటీవలే కిమ్స్ ఎరీట్ హాస్పిటల్‌స్‌లో విలీనమైంది. రీవోస్పైన్ గుర్తింపుతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఎరీట్ హాస్పిటల్ అడ్వాన్స్‌డ్ ఎండోస్కోపిక్ టెక్నాలజీ, మెరుగైన వైద్య సేవలు మరియు శిక్షణను ఒకే వేదికపైకి తీసుకొచ్చింది.

తొలి దశలో గుర్తిస్తే క్యాన్సర్‌కు మెరుగైన చికిత్స

గుమ్మడిదల , నవంబర్ 11 (వుదయం):
మహిళలు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని, వ్యాధిని తొలి దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స పొందవచ్చని వైద్యాధికారి డాక్టర్ ఎస్. మధుకర్ సూచించారు. మండలంలోని అనంతారం గ్రామంలో మహిళల కోసం నిర్వహించిన ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కొమ్ము శీను ప్రారంభించారు. యూసి బెస్ట్ ఫౌండేషన్, ఏఐజీ ఆసుపత్రి, తెలంగాణ ప్రభుత్వం, గ్రాన్యూల్స్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 40 ఏళ్లు పైబడిన మహిళలు పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దని వైద్యాధికారి సూచించారు. కార్యక్రమంలో వైద్యులు నాయని శ్రీనివాస్, సాయి కృపాలి, షరోత్, సీజీఆర్ ట్రస్ట్ వైస్ చైర్మన్ చిమ్ముల నరేందర్ రెడ్డి, ఈవో సురేష్ యాదవ్, ఉపసర్పంచ్ యాదిరెడ్డి, వార్డు సభ్యులు మంగ, పావని, భాస్కర్ గౌడ్, శిల్పా రాము, నాయకులు గోపాల్, మహేష్ యాదవ్, లక్ష్మణ్, రమణ,



యాదగిరి, ఆంజనేయులు పాల్గొన్నారు.

చక్కని ఆరోగ్యం

జుట్టుకు నూనె రాస్తున్నారా.. ఈ ముఖ్యమైన విషయాలను తెలుసుకోవడం తప్పనిసరి..



జుట్టు ఆరోగ్యంగా, దట్టంగా ఉండాలంటే రాత్రంతా నూనె రాసి ఉంచాల్సిందే అనే అభిప్రాయం చాలా మందిలో ఉంటుంది. అయితే వేగవంతమైన జీవనశైలిలో అలాంటి సమయం దొరకకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. తలస్నానానికి ముందు కేవలం 30 నిమిషాల పాటు హెయిర్ ఆయిల్ రాసినా జుట్టు, తల చర్మానికి అవసరమైన పోషణ అందుతుందని తాజా సూచనలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం తరచూ హీట్ స్టైలింగ్ పరికరాలు ఉపయోగించడం, కాలుష్యం, గట్టి నీటితో తలస్నానం చేయడం, వాతావరణ మార్పులు వంటి కారణాల వల్ల జుట్టు పొడిబారడం, చిట్లిపోవడం, మెరుపు కోల్పోవడం, సులభంగా విరిగిపోవడం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఈ ప్రభావాల వల్ల జుట్టు పైపొర బలహీనపడటంతో తేమ త్వరగా కోల్పోయి జుట్టు నిర్జీవంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో హెయిర్ ఆయిలింగ్ జుట్టును సంరక్షించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. జుట్టుకు నూనె రాయడం వల్ల వెంట్రుకలపై రక్షణ పొర ఏర్పడి తేమను నిల్వ ఉంచడంలో సహాయపడుతుంది.

దోమలు 'నన్నే ఎందుకు ఎక్కువగా కుడుతున్నాయి?' అనే సందేహం చాలామందికి ఉంటుంది. అయితే దీనికి దోమలను ఆకర్షి స్తాయని పరిశోధనలు చెబుతున్నాయి. అందుకే ఒకే గదిలో ఉన్నప్పటికీ కొందరినే దోమలు ఎక్కువగా కుడుతుంటాయని నిపుణులు చెబుతున్నారు.ఆరోగ్య నిపుణుల ప్రకారం.. మనం శ్వాస తీసుకుని వదిలినప్పుడు కార్బన్ డయాక్సైడ్ విడుదల అవుతుంది. దోమలు ఈ వాయువును దూరం నుంచే గుర్తించగలవు. వ్యాయామం చేసే వారు లేదా శారీరకంగా ఎక్కువ శ్రమించే వారు ఎక్కువ కార్బన్ డయాక్సైడ్ విడుదల చేస్తారు. అందుకే వారివైపు దోమలు ఎక్కువగా

దోమలు కొందరినే ఎక్కువగా ఎందుకు కుడతాయో తెలుసా?



ఆకర్షితమవుతాయి. మన చెమటలో ఉండే లాక్టిక్ యాసిడ్, అమ్మోనియా వంటి రసాయనాలు దోమలను ఆకర్షిస్తాయి. అలాగే శరీర ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండే వారిని కూడా దోమలు త్వరగా గుర్తిస్తాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం.. 'O' బ్లడ్ గ్రూప్ ఉన్నవారిని దోమలు ఎక్కువగా ఆకర్షించే అవకాశం ఉందని గుర్తించారు. 'A' బ్లడ్ గ్రూప్ ఉన్నవారితో పోలిస్తే, 'O' గ్రూప్ ఉన్నవారిని దోమలు ఎక్కువగా ఆకర్షిస్తాయని పరిశోధనల్లో వెల్లడైంది. 'B' బ్లడ్ గ్రూప్ ఉన్నవారు ఈ రెండింటి మధ్యస్థంగా ఉన్నట్లు చెబుతున్నారు. కొంతమంది శరీర లక్షణాలు దోమలను ఎక్కువగా ఆకర్షించేలా ఉండవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. అందుకే కొందరిని దోమలు ఎక్కువగా కుడుతుంటే, మరికొందరిని తక్కువగా కుడుతాయి. మన చర్మంపై సహజంగా ఉండే బ్యాక్టీరియా చెమటను విచ్ఛిన్నం చేసి ప్రత్యేకమైన వాసనను ఉత్పత్తి చేస్తుంది. ఈ వాసన కొంతమందిలో దోమలను ఎక్కువగా ఆకర్షించవచ్చు. అందుకే ఒకే ఇంట్లో ఉన్న వారిలో కూడా కొందరినే దోమలు ఎక్కువగా కుడతాయి. గర్భధారణ సమయంలో శరీర ఉష్ణోగ్రత కొద్దిగా పెరగడంతో పాటు ఎక్కువ కార్బన్ డయాక్సైడ్ విడుదల అవుతుంది. ఈ కారణంగా గర్భిణీలను దోమలు ఎక్కువగా ఆకర్షించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

యాదృచ్ఛికం మాత్రమే కారణం కాదు. మన శరీరం నుంచి విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్, చెమటలోని రసాయనాలు, శరీర ఉష్ణోగ్రత, బ్లడ్ గ్రూప్, చర్మంపై ఉండే బ్యాక్టీరియా వంటి అనేక అంశాలు

కీళ్ల క్షీణత సమస్య ఉంటే ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..

నేలపై కాళ్లు మడిచి కూర్చోవడం, స్క్వాట్ చేయడం, మెట్లు ఎక్కడం లేదా దిగడం, ఎక్కువసేపు కూర్చున్న తర్వాత లేవడం, పంగి షూల లేసులు కట్టుకోవడం వంటి రోజువారీ పనులు చేయడంలో ఇబ్బంది కలుగుతోందా? చాలామంది వీటిని వయసు పెరగడం వల్ల వచ్చే సాధారణ సమస్యలుగా భావించి పట్టించుకోరు. అయితే ఇవి కీళ్ల క్షీణత (జాయింట్ డిజెనరేషన్) ప్రారంభ సంకేతాలు అవుతాయని ఆర్థోపెడిక్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు వారిలో ఈ సమస్యలు పెరుగుతున్నట్లు వారు చెబుతున్నారు. నిపుణుల ప్రకారం, గతంలో వృద్ధాప్యంలో ఎక్కువగా కనిపించే మోకాళ్ల నొప్పి, వెన్ననొప్పి, కీళ్ల కదలికలు తగ్గడం వంటి సమస్యలు ఇప్పుడు మధ్యవయసు వారిలో కూడా సాధారణమవుతున్నాయి. కీళ్ల క్షీణత ఒక్కసారిగా తీవ్రమైన నొప్పితో ప్రారంభం కాదు. మొదట్లో స్వల్ప బిగుతు, కదలికల్లో అసౌకర్యం వంటి లక్షణాలతో నెమ్మదిగా అభివృద్ధి చెందుతుంది. చాలామంది వీటిని బిజీ జీవనశైలి, వ్యాయామం లేకపోవడం లేదా వయసు ప్రభావంగా భావించి నిర్లక్ష్యం చేస్తారని నిపుణులు పేర్కొంటున్నారు. కీళ్ల క్షీణతకు సంబంధించిన ప్రారంభ హెచ్చరిక సంకేతాల్లో నేలపై కాళ్లు మడిచి కూర్చోవడం లేదా స్క్వాట్ చేయడం కష్టంగా అనిపించడం, మెట్లు ఎక్కేటప్పుడు లేదా దిగేటప్పుడు నొప్పి రావడం, ఉదయం నిద్రలేచిన వెంటనే లేదా ఎక్కువసేపు కూర్చున్న తర్వాత కీళ్లు బిగుసుకుపోవడం, శరీర కదలికల్లో వశ్యత తగ్గడం, కీళ్ల చుట్టూ అప్పుడప్పుడు వాపు కనిపించడం, కదిలేటప్పుడు కీళ్లలో రాపిడి లేదా క్రిక్ శబ్దం వినిపించడం వంటి లక్షణాలు ఉంటాయని నిపుణులు వివరిస్తున్నారు. ఈ లక్షణాలు తరచూ కనిపిస్తూ కొనసాగితే వాటిని నిర్లక్ష్యం చేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు. చాలామంది రోజువారీ పనులు చేయలేనంతగా నొప్పి పెరిగిన తర్వాత మాత్రమే వైద్యులను సంప్రదిస్తారని, అయితే ప్రారంభ దశలోనే సమస్యను గుర్తిస్తే కీళ్ల పనితీరును కాపాడుకోవడంతో పాటు మరింత క్షీణతను నివారించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

మోకాళ్ల నొప్పి లేదా కీళ్లు అరిగిపోవడం అంటే చివరికి తప్పనిసరిగా శస్త్రచికిత్స చేయించుకోవాల్సిందే అనే అభిప్రాయం సరైనది కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రారంభ దశలోనే సమస్యను గుర్తిస్తే ఫిజియోథెరపీ, కండరాలను బలపరిచే వ్యాయామాలు, బరువు నియంత్రణ, జీవనశైలిలో మార్పులు వంటి చికిత్సలతో చాలా వరకు కీళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వారు వివరిస్తున్నారు. నొప్పి భరించలేనంత వరకు వేచి ఉండటం చాలా మంది చేసే పెద్ద తప్పిదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కీళ్లలో అసౌకర్యం, బిగుతు లేదా కదలికల్లో ఇబ్బందులు నిరంతరంగా కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం ద్వారా చికిత్స ఫలితాలు మెరుగ్గా ఉండటంతోపాటు ఎక్కువకాలం చురుకుగా, స్వతంత్రంగా జీవించే అవకాశం పెరుగుతుందని వారు సూచిస్తున్నారు.



దీంతో పొడిబారడం తగ్గి జుట్టు సహజ తేమ సమతుల్యతను కాపాడుకోవచ్చు. అలాగే కాలుష్యం, ఎండ, ఇతర పర్యావరణ ప్రభావాల నుంచి జుట్టుకు కొంత రక్షణ కూడా లభిస్తుంది. తల చర్మం ఆరోగ్యంగా ఉండటం కూడా అందమైన జుట్టుకు ఎంతో అవసరం. నూనె రాసేటప్పుడు కొన్ని నిమిషాల పాటు మృదువుగా మసాజ్ చేయడం వల్ల రక్తప్రసరణ మెరుగై వెంట్రుకల కుదుళ్లకు పోషకాలు చేరేందుకు సహాయపడుతుంది. అలాగే తల చర్మం పొడిబారడం, చుండ్రు వంటి సమస్యలను తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. ముఖ్యంగా కొబ్బరి నూనె ఆధారిత హెయిర్ ఆయిల్ కేవలం 30 నిమిషాల్లోనే వెంట్రుకల్లోకి చొచ్చుకుపోయి అవసరమైన పోషణను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. హెయిర్ కేర్‌లో ఉపయోగించే అనేక రకాల నూనెల్లో కొబ్బరి నూనె ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఇందులో ఉండే లారిక్ యాసిడ్ అనే మధ్యస్థ గొలుసు కొవ్వు ఆమ్లం జుట్టుకు పోషణ అందించడంతోపాటు సూక్ష్మజీవుల పెరుగుదలను నియంత్రించే లక్షణాలను కలిగి ఉంటుంది. దీని అణు నిర్మాణం చిన్నదిగా ఉండటంతో జుట్టు పైపొరపై మాత్రమే కాకుండా వెంట్రుకల లోపలికి కూడా సులభంగా చొచ్చుకుపోయి లోతైన పోషణ అందిస్తుంది. ఆధునిక జీవనశైలిలో హెయిర్ ఆయిలింగ్‌ను రోజువారీ అలవాటులో భాగం చేసుకోవడం పెద్దగా సమయం తీసుకునే పని కాదు. తల చర్మంతో పాటు జుట్టు మొత్తం పొడవునా నూనె సమానంగా రాసి కొన్ని నిమిషాలు మసాజ్ చేయాలి.

అనంతరం సుమారు 30 నిమిషాలు అలాగే ఉంచి, తర్వాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేస్తే సరిపోతుంది. సమయం ఉంటే మరికొంత సేపు ఉంచినా మంచిదే. ఇలా వారంలో ఒకటి లేదా రెండు సార్లు ఈ అలవాటును పాటించడం ద్వారా జుట్టు ఆరోగ్యాన్ని సులభంగా కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

బెల్లాన్ని ఇలా తీసుకుంటే..

బెల్లాన్ని కొన్ని పదార్థాలతో కలిపి తీసుకుంటే దాని సుగుణాలు రెట్టింపవుతాయంటున్నారు పోషకాహార నిపుణులు. తద్వారా ఆయా ఆరోగ్య సమస్యల్ని తగ్గించడంలో బెల్లం మరింత ప్రభావవంతంగా పని చేస్తుందంటున్నారు.

బెల్లం+నెయ్యి: ఈ రెండూ కలిపి తీసుకుంటే మలబద్ధకం నుంచి విముక్తి పొందచ్చుట.

బెల్లం+ధనియాలు: నెలసరి సమయంలో అధిక రక్తస్రావం నుంచి విముక్తి పొందచ్చు. నెలసరి నొప్పుల్నీ తగ్గించుకోవచ్చు. స్పాటింగ్ మాత్రమే అవుతోందని బాధపడే వారికి ఆ సమస్య తగ్గి ఎప్పటిలాగే పిరియడ్స్ ప్రారంభమవుతాయట.

బెల్లం+సోంపు: నోటి దుర్వాసనను దూరం చేసుకోవచ్చు.. దంతాలపై పాచి పేరుకుపోకుండా జాగ్రత్తపడచ్చు.

బెల్లం+గోంద్: ఎముకల్ని దృఢంగా చేయడానికి ఈ కాంబినేషన్ చక్కగా ఉపకరిస్తుంది. అలాగే పాలిచ్చే తల్లులు తీసుకుంటే చనుబాలు పుష్కలంగా ఉత్పత్తవుతాయట!

బెల్లం+అలీవ్ గింజలు: తీసుకునే ఆహారంలోని ఫోలికామ్లం, ఐరన్‌ను శరీరం త్వరగా గ్రహించేందుకు ఈ కాంబినేషన్ తోడ్పడుతుంది. ఇక చర్మంపై ఏర్పడిన పిగ్మెంటేషన్‌ని తగ్గించడంతో పాటు జుట్టు పెరుగుదలకూ దోహదం చేస్తుందట.

బెల్లం+నువ్వులు: దగ్గు, జలుబు, ఫ్లూ.. వంటివి దరిచేరకుండా కాపాడుతుందట.

బెల్లం+పల్లీలు: శరీరంలో సత్తువను పెంచడానికి, ఆకలిని అదుపు చేయడానికి, ఆహారపు కోరికల్ని తగ్గించడానికి ఈ కాంబినేషన్ అద్భుతంగా పని చేస్తుందంటున్నారు నిపుణులు.



పిల్లలు ఫోన్ ఎక్కువగా చూసే అలవాటును కలిగి ఉంటే..



కేవలం వినోదం కోసమే కాకుండా చదువుల కోసం కూడా డిజిటల్ పరికరాల వినియోగం పెరిగిపోతున్న ఈ రోజుల్లో పిల్లలకు మొబైల్ ఫోన్ ఇవ్వడం చాలా కుటుంబాల్లో సాధారణమైంది. అయితే ఫోన్ కొనివ్వడం కంటే, దాన్ని ఎలా బాధ్యతాయుతంగా ఉపయోగించాలో నేర్పించడం తల్లిదండ్రుల ప్రధాన బాధ్యత అని నిపుణులు చెబుతున్నారు. చిన్న వయసులోనే అధిక స్క్రీన్ టైమ్ అలవాటుగా మారితే అది పిల్లల శారీరక, మానసిక, భావోద్వేగ వికాసంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, పిల్లల మెదడు ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలో ఉంటుంది. ముఖ్యంగా ఏకాగ్రత, స్వీయ నియంత్రణ, నిర్ణయాలు తీసుకోవడం, భావోద్వేగాలను సమతుల్యం చేసుకోవడం వంటి సామర్థ్యాలు ఈ దశ లోనే రూపుదిద్దుకుంటాయి. ఎక్కువ సేపు మొబైల్, ట్యాబ్ లేదా ఇతర స్క్రీన్‌ల ముందు గడపడం వల్ల మెదడుపై అధిక ఉత్తేజం ఏర్పడి, ఏకాగ్రత తగ్గడం, భావోద్వేగాలను నియంత్రించలేకపోవడం, వాస్తవ జీవితంలోని కార్యకలాపాలపై ఆసక్తి తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని వారు వివరిస్తున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా షార్ట్ వీడియోలు, వేగవంతమైన గేమ్స్ వంటి కంటెంట్ పిల్లలను నిరంతరం ఆకర్షిస్తుంటాయి. దీంతో నిజ జీవితంలో నెమ్మదిగా జరిగే ఆటలు, పుస్తకాలు చదవడం, స్నేహితులతో గడపడం వంటి కార్యకలాపాలపై ఆసక్తి తగ్గిపోతుంది. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల్లో చిరాకు, అసహనం, ఏకాగ్రత లోపం, మూడ్ స్వింగ్స్, బయట ఆడుకోవాలనే ఆసక్తి తగ్గడం వంటి మార్పులను గమనిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. స్క్రీన్‌లకు అలవాటు పడిన పిల్లల్లో తక్షణ సంతృప్తి కోరుకునే స్వభావం కూడా పెరుగుతుందని నిపుణులు అంటున్నారు. గేమ్‌లలో వచ్చే రివార్డులు, నిరంతరం అందుబాటులో ఉండే కొత్త వీడియోలు లేదా కంటెంట్ కారణంగా పిల్లలు ఎప్పటికప్పుడు ఫోన్‌ను ఉపయోగించాలని భావిస్తారు. ఫోన్‌ను తీసేస్తే కొందరిలో కోపం, ఏడుపు, అసహనం లేదా ఆందోళన వంటి లక్షణాలు కనిపిస్తాయని వారు పేర్కొంటున్నారు. అధిక స్క్రీన్ టైమ్ ప్రభావం ముందుగా నిద్రపై పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పడుకునే ముందు ఎక్కువసేపు మొబైల్ వాడితే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గి నిద్ర నాణ్యత దెబ్బతింటుంది. పిల్లల్లో సరైన నిద్ర లేకపోవడం వల్ల జ్ఞాపక శక్తి, నేర్చుకునే సామర్థ్యం, భావోద్వేగ నియంత్రణ, మొత్తం ఆరోగ్యంపై ప్రతి కూల ప్రభావం పడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అయితే పిల్లలను పూర్తిగా సాంకేతిక పరికరాలకు దూరంగా ఉంచడం ఆచరణలో సాధ్యం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సాంకేతికతను పూర్తిగా నిషేధించడం కంటే, సమతుల్యంగా ఉపయోగించే అలవాటు పెంపొందించడం ముఖ్యమని సూచిస్తున్నారు. టెక్నాలజీని బాధ్యతాయుతంగా వినియోగిస్తే అది హానికరం కాదని, పిల్లల్లో ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్లు పెంపొందించడం అవసరమని చెబుతున్నారు. దీని కోసం ప్రతిరోజూ నిర్దిష్ట స్క్రీన్ టైమ్‌ను నిర్ణయించడం, బయట ఆటలు, క్రీడలు, శారీరక వ్యాయామాలను ప్రోత్సహించడం, పుస్తకాలు చదవడం, చిత్రలేఖనం, సంగీతం వంటి హాబీలను అలవాటు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసే సమయంలో, నిద్రకు ముందు స్క్రీన్‌లను పూర్తిగా దూరంగా ఉంచడం వంటి చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే తల్లిదండ్రులే మొబైల్ వినియోగంలో ఆదర్శంగా ఉండి, పిల్లలతో కలిసి సమయం గడపడం ద్వారా ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్లు పెంపొందించవచ్చని వారు పేర్కొంటున్నారు.

లంచ్ బాక్సులో ఆరోగ్యాన్ని సర్దుదాం..



ఉదయం హడావుడి లంచ్ బాక్స్‌లో ఏదో ఒకటి పెట్టేయాలన్న తొందర. పిల్లలు ఇష్టంగా తింటారని నూడుల్స్, పాస్తా, ప్యాక్డ్ చిప్స్ పెడుతుంటారు.. కానీ దీని వల్ల బాక్సులో అనారోగ్యాన్ని సర్ది పంపుతున్నట్టే. ఇందుకు ప్రత్యామ్నాయంగా పక్కాగా ఆరోగ్యంగా ఉండే వాటిని పెడితే పిల్లల్లో సమతుల్యమైన ఆహారం అందే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఓ వైపు రక్తహీనత, మరో వైపు బాల్యంలోనే ఊబకాయం వంటి సమస్యలు అధికంగా వస్తుంటాయని వైద్యులు చెబుతున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూటిషన్ తమ ఆహార మార్గదర్శకాలను పూర్తిగా సవరించాయి. రోజు వారి ఆహారంలో సగం కూరగాయలు (400 గ్రాములు), పండ్లు (100 గ్రాములు) ఉండాలి. ఇవీ శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ పూర్తిగా తగ్గిస్తాయి. రక్తహీనతను అరికట్టడానికి ఆకుకూరల వాడకాన్ని 50 నుంచి 100 గ్రాములకు పెంచాలి. తృణధాన్యాలు, పప్పులు, పాలు 3:1:2:5 నిష్పత్తిలో ఉండేలా చూసుకోవాలి. దీనికి వల్ల పూర్తి స్థాయిలో ప్రోటీన్ అందుతుంది. చక్కెర ఐదు శాతం కంటే తక్కువగా ఉండాలి. అంటే రోజుకు గరిష్టంగా 25- 30 గ్రాములు మించకూడదు. రోజుకు 35 గ్రాముల నూనె గింజలు లేదా డ్రై ఫ్రూట్స్ ఇవ్వడం ద్వారా మెదడు వికాసానికి అవసర మైన కొవ్వులు అందుతాయి. కూరగాయలు వేసి రాగి సేమియా/ హోల్-వీట్ పాస్తా వేయించిప ఫుల్ మఖానా/పాప్ చేసిన జొన్నలు మసాల మజ్జిగ/కొబ్బరి నీళ్లు, బాదం స్టఫ్ చేసిన ఖర్జూరాలు ఇంట్లో చేసిన రాగిఓట్స్ బార్స్ ఆవిరిపై ఉడికించిన ధాన్యాలతో తయారు చేసిన ఇడ్లీలు/బేక్ చేసిన వెజ్ కట్‌లెట్స్ ఇవ్వడంతో రక్తంలో గ్లూకోజ్ స్థాయిని స్థిరీకరిస్తోంది. సోడియం, ట్రాన్స్ ఫ్యాట్స్ పూర్తిగా తగ్గుతాయి. మెగ్నిషియం అందుతుంది. హానికరమైన కార్న్ సిరప్ దూరమవుతుంది. ఎలక్ట్రోలైట్స్ అందుతాయి. ఐరన్, మెగ్నిషియం అందుతాయి. రిఫైన్డ్ షుగర్ ఉండదు. కొవ్వు శాతాన్ని పూర్తిగా తగ్గిస్తోంది. పూర్తి ప్రొటీన్ అందుతోంది. పిల్లల రోజువారి తృణధాన్యాలు కోటాలో కనీసం 50 శాతం సిరిధాన్యాలు ఉండాలి. రాగిలో పాల కంటే మూడు రెట్లు ఎక్కువ కాల్షియం (364 ఎంజీ/100 గ్రా) ఉంటుంది. సజ్జలలో ఐరన్ (8.0 ఎంజీ/100 గ్రా), జింక్ సమృద్ధిగా ఉండి రక్తహీనతను తగ్గిస్తాయి. జొన్నలు పీసీఓఎస్ నియంత్రణకు మేలు చేస్తాయి. వీటిని పిల్లలకు రెండు వారాల గోధుమ పిండి లేదా బియ్యంలో 20-30 శాతం సిరిధాన్యాల పిండి కలిపి రోటీలు, ఇడ్లీలు తయారు చేయాలి. వండే ముందు కచ్చితంగా నానబెట్టిన లేదా మొలకలు వచ్చేలా చేయాలి.

కాళ్ల నొప్పులు తగ్గాలంటే...

ఆఫీసుల్లో కాళ్లు వేలాడేసుకుని గంటల పాటు కూర్చోవడం, ఉద్యోగాల రీత్యా ఎక్కువ సేపు నిలబడే ఉండటం, దూరాభారాలు నడవడం, చాలా సమయం పాటు నిల్చొనే వంట చేయడం... కారణం ఏదైనా వీటన్నింటివల్లా మహిళలకు కాళ్ల నొప్పులు సహజం. ఇలాంటప్పుడు ఈ చిట్కాలు పాటిస్తే కాస్త ఉపశమనం కలుగుతుంది.

నొప్పిగా ఉన్నప్పుడు కాళ్లకి కాస్త విశ్రాంతి ఇవ్వండి. ముఖ్యంగా ఎక్కువ సేపు నిలబడకుండా కూర్చోవడం మంచిది. నిద్రించేటప్పుడు కాళ్ల కింద రెండు దిండ్లు పెట్టుకోవాలి. ఇలా పాదాలను గుండె స్థాయి కంటే కొంచెం ఎత్తులో ఉంచితే వాపు, నొప్పి తగ్గుతాయి. కాళ్ల వాపులు, కండరాల నొప్పులు ఉన్నప్పుడు హాట్ అండ్ కోల్డ్ థెరపీ చక్కగా పనిచేస్తుంది. ఐస్ ముక్కలను కాటన్ వస్త్రంలో చుట్టి 15 నిమిషాల పాటు నొప్పి ఉన్న చోట పెట్టండి. లేదంటే గోరువెచ్చని నీటిలో కొంచెం ఉప్పు వేసి కాళ్లు పెడితే రక్త ప్రసరణ మెరుగుపడి ఉపశమనం దొరుకుతుంది.

నువ్వుల నూనె లేదా ఆవనూనెను కొద్దిగా వేడి చేసి, కాళ్లకు సున్నితంగా మసాజ్ చేయడం వల్ల కండరాలు వదులవుతాయి. పసుపులోని యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి.

శరీరం డీహైడ్రేట్ అయితేకండరాల తిమ్మిర్లు వస్తాయి. కాబట్టి దాహం వేసినా లేకున్నా తగినన్ని నీళ్లు తాగడం మర్చిపోకండి.

రోజువారీ పనుల మధ్యలో చిన్నపాటి స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయండి. కూర్చున్న చోటే పాదాలను అటు ఇటు తిప్పడం, వేళ్లను కదిలించడం వంటివి కాళ్లను సౌకర్యంగా మారుస్తాయి. మడమల నొప్పి ఉంటే హీల్స్ వాడటం తగ్గించండి. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా నొప్పి, వాపు తగ్గకపోతే తప్పక వైద్యుల్ని సంప్రదించాలి.



సెన్సెక్స్ ▲ 81,879.40	గోల్డ్ 1,41,452 (10 గ్రాములు)	యూస్ డాలర్ $ 93.6800	ఎస్ బి ఐ రూ. 5,665.00
నిఫ్టీ ▲ 25,255.05	సిల్వర్ 1,82,868 (1 కిలో)	బ్రిటన్ పౌండ్ £ 124.2904	NTPC రూ. 3,222.70
	చమురు 8,263 (రూ. బ్యారెల్)	యూరో € 103.8815	BSE రూ. 3,906.00
		జపాన్ యెన్ ¥ 0.5863	Tech Mahindra రూ. 1,788.50
			HCL Technologies రూ. 1,395.00
			ICICI Bank రూ. 1,571.60



అమెరికా వీసా నిబంధనలపై పర్యవేక్షణ



▶ పర్మ్ ప్రక్రియ గ్రీన్‌కార్డ్‌కు తొలి దశగా ఉంటుంది.

▶ 2026 ఆర్థిక సంవత్సరంలో ఐబీఎం 1,100కుపైగా ఎచ్-1బీ దరఖాస్తులు చేసింది.

న్యూయార్క్‌లో ఐబీఎం కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా కన్సల్టింగ్ విభాగంలోని చాలా ఉద్యోగాలకు ఎచ్ 1బీ వీసా, గ్రీన్‌కార్డ్ ప్రాయోజకత్వాన్ని నిలిపివేస్తోంది. ట్రంప్ పరిపాలన వలస ప్రక్రియలపై పర్యవేక్షణ పెంచిన సమయంలో ఈ నిర్ణయం వచ్చింది. ఐబీఎం కన్సల్టింగ్‌లో 1,50,000 మందికిపైగా పనిచేస్తున్నారు. ప్రభావిత విదేశీ ఉద్యోగులపై నిర్ణయం నేరుగా పడనుంది. బ్లూమ్‌బర్గ్ ప్రకారం, బాధిత ఉద్యోగులకు రెండు ఎంపికలు ఇచ్చారు. అమెరికా వెలుపల నుంచి ఐబీఎం పనిని కొనసాగించవచ్చు. లేకపోతే ఈ ఏడాది చివర్లోగా సంస్థను వీడాల్సి ఉంటుంది. ఐబీఎం ప్రతినిధి ఈ పరిణామాన్ని ధ్రువీకరించారు. వీసా కార్యక్రమాల్లో సంస్థ భాగస్వామ్యం కొన్నేళ్లుగా తగ్గుతోందని న్యూస్‌వీక్‌కు తెలిపారు. ఐబీఎం నిర్ణయం ఎచ్ 1బీ దరఖాస్తులకు మాత్రమే పరిమితం కాదు. ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డ్‌కు కీలకమైన పర్మ్ ప్రక్రియకూ వర్తిస్తుంది. పర్మ్ అమెరికాలో ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డ్‌కు తొలి దశ. అర్హులైన అమెరికా ఉద్యోగులు అందుబాటులో లేరని యజమానులు నిరూపించాలి. ఇప్పటికే ఎచ్ 1బీపై పనిచేస్తున్న ఉద్యోగుల భవిష్యత్తు స్పష్టంగా లేదు. ఇకపై ఐబీఎం ద్వారా గ్రీన్‌కార్డ్ ప్రాయోజకత్వం లభించకపోవడమే కారణం. ఈ విషయంపై న్యూస్‌వీక్ ఐబీఎంను మరిన్ని వివరాలు కోరింది. ఉద్యోగులపై తుది ప్రభావం ఇంకా వెల్లడికాలేదు. అమెరికా కార్మిక శాఖ గణాంకాలు ఐబీఎం దరఖాస్తులు తక్కువని చూపుతున్నాయి. 2026 ఆర్థిక సంవత్సరంలో ఐబీఎం 1,100కుపైగా ఎచ్ 1బీ వీసాలకు దరఖాస్తు చేసింది. ఆ సంవత్సరం సెప్టెంబర్ 30తో ముగిసింది. శాశ్వత నివాసానికి ఎంతమంది దరఖాస్తు చేశారో తెలియదు.

మహారాష్ట్ర షిర్వాటా పంప్డ్ స్టోరేజీకి టాటా పవర్ ఆమోదం



టాటా పవర్ బోర్డు మహారాష్ట్రలోని షిర్వాటాలో ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. సంస్థ ₹11,871 కోట్ల పెట్టుబడిని ఇందులో పెట్టనుంది. 1.8జీడబ్ల్యూ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు పూర్తికి 51 నెలలు పడుతుందని అంచనా. ప్రాజెక్టు వ్యయంలో 75 శాతం రుణంతో సమకూరుతుంది. మిగిలిన 25 శాతం ఈక్విటీ ద్వారా వస్తుంది. పునరుత్పాదక విద్యుత్‌ను గ్రిడ్‌లో కలపడానికి ఈ ప్రాజెక్టులు సహాయపడతాయని సంస్థ తెలిపింది. కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ ప్రకారం, భారత్‌లో 122.7జీడబ్ల్యూ సామర్థ్యం నిర్మాణ దశలో ఉంది. ప్రస్తుతం 7.4జీడబ్ల్యూ పంప్డ్ స్టోరేజీ సామర్థ్యం పనిచేస్తోంది. టాటా పవర్ 2027 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో ₹10,000 కోట్ల మూలధన వ్యయం చేసింది. సెప్టెంబర్ త్రైమాసికంలో సంస్థ 0.9జీడబ్ల్యూ సౌర కణాలను ఉత్పత్తి చేసింది. తొలి అర్ధభాగంలో సౌర మాడ్యూల్ ఉత్పత్తి 2జీడబ్ల్యూకు చేరింది. ఒడిశా ప్లాంట్‌లో వేఫర్, ఇంగాట్ తయారీని మార్చి 2027 నాటికి ప్రారంభించాలని టాటా పవర్ యోచిస్తోంది.

భారత్‌లో ఉద్యోగాల కోతలు

▶ మూడు నెలల జీతానికి సమానమైన పరిహారం ఉద్యోగులకు అందించారు.



బేగున్‌లో క్వాల్‌కామ్ ఉద్యోగాల కోతలు ప్రారంభమయ్యాయి. దాదాపు 1,000 లేదా అంతకంటే ఎక్కువ ఉద్యోగాలు ప్రమాదంలో ఉన్నాయని ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ తెలిపింది. బెంగళూరు కేంద్రంలో సోమవారం తొలి విడత కోతలు మొదలయ్యాయి. భారత్‌లోని కోతలు అమెరికాలో చేపట్టిన ఉద్యోగాల తగ్గింపును అనుసరిస్తున్నాయి. క్వాల్‌కామ్ కార్యకలాపాల్లో ఈ ప్రక్రియ దశలవారీగా కొనసాగనుంది. అమెరికా కేంద్రంగా పనిచేసే చిప్ తయారీ సంస్థ ప్రపంచవ్యాప్త సిబ్బంది పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. క్వాల్‌కామ్‌కు ప్రపంచవ్యాప్తంగా 52,000 మంది ఉద్యోగులు ఉన్నారు. వారిలో దాదాపు 7 శాతం మందిపై పునర్వ్యవస్థీకరణ ప్రభావం చూపవచ్చని వర్గాలు తెలిపాయి. ఈ లెక్క సెప్టెంబర్ 2025 నాటి సిబ్బంది వివరాలపై ఆధారపడింది. భారత్‌లో క్వాల్‌కామ్ ఉద్యోగులు సుమారు 20,000 మంది ఉన్నారు. సమాన నిష్పత్తి ప్రకారం దాదాపు 1,000 ఉద్యోగాలు తగ్గవచ్చని ఈఐఐఆర్‌ట్రెండ్ సీఈఓ పరిఖ్ జైన్ అంచనా వేశారు. మూడు నెలల జీతానికి సమానమైన పరిహారం ఉద్యోగులకు అందించారు. మూడు రోజుల్లో రిలీవింగ్ పత్రాలు సంతకం చేసినవారికి అదనంగా మరో నెల జీతం ఇచ్చారు. మరో విడత ఉద్యోగాల కోతలు జనవరిలో ఉండవచ్చని విశ్లేషకులు తెలిపారు. క్వాల్‌కామ్ సీఈఓ క్రిస్టియానో అమోన్ అక్టోబర్‌లో అంతర్గత మెమో ద్వారా పునర్వ్యవస్థీకరణను ప్రకటించారు. నవంబర్‌లో వార్షిక ఉద్యోగి సమీక్షల అనంతరం తగ్గింపు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. క్వాల్‌కామ్ అమెరికాలో ఒక్కో షేరుకు 2.17 డాలర్ల లాభాన్ని ప్రకటించింది. ఆదాయం 10.44 బిలియన్ డాలర్లకు చేరింది, మార్కెట్ అంచనా 10.14 బిలియన్ డాలర్లను మించింది.


"పైసాబజార్ " రెండు గంటల్లోనే రూ.7 లక్షల వరకు వ్యక్తిగత రుణం


▶ 70కి పైగా భాగస్వామ్య సంస్థలు ఉన్నాయి

హైదరాబాద్, నవంబరు 10: పైసాబజార్ తక్షణ వ్యక్తిగత రుణ కార్యక్రమాన్ని విస్తరించింది. ఆరు ప్రముఖ బ్యాంకులతో సహా 18 రుణ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. అర్హులైన వినియోగదారులకు డిజిటల్ విధానంలో రుణాలు అందించనుంది. పైసాబజార్ ప్రకటించిన పథకంలో 7 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు లభించనున్నాయి. రుణ సంస్థ ఆమోదం, ప్రక్రియ పూర్తయితే ఒకటి నుంచి రెండు గంటల్లో నగదు అందే అవకాశం ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, యెస్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్, ఫెడరల్, ఇండస్‌ఇండ్ బ్యాంకులు భాగస్వాములుగా ఉన్నాయి. ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్, పూనావాలా ఫిన్‌కార్ప్, టాటా క్యాపిటల్, హీరో ఫిన్‌కార్ప్ సంస్థలు కూడా కార్యక్రమంలో ఉన్నాయి. పైసాబజార్ సీఈఓ సంతోష్ అగర్వాల్ రుణాలు వేగంగా, సులభంగా అందాలని వినియోగదారులు కోరుకుంటున్నారని తెలిపారు. వివిధ సంస్థల ఆఫర్లను ఒకే వేదికపై అందిస్తున్నామని చెప్పారు. పైసాబజార్ వేదికపై దరఖాస్తు ప్రక్రియ నాలుగు దశల్లో సాగుతుంది. వ్యక్తిగత, ఆదాయ వివరాల నమోదు, రుణ ఆఫర్ ఎంపిక, వీడియో కేవైసీ ఇందులో ఉన్నాయి. అర్హత, అవసరాలకు అనుగుణంగా రుణాన్ని ఎంచుకోవచ్చు. ప్రస్తుతం పైసాబజార్‌కు వివిధ రుణ విభాగాల్లో 70కి పైగా భాగస్వామ్య సంస్థలు ఉన్నాయి.

మొక్కజొన్న సాగులో నూతన ఆవిష్కరణలకు సింజెంటా ప్రాధాన్యం

హైదరాబాద్, నవంబర్ : మొక్కజొన్న సాగులో ఉత్పాదకత పెంపు, పంటల సంరక్షణ, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అంతర్జాతీయ సహకారం అవసరమని సింజెంటా పేర్కొంది. హైదరాబాద్‌లో నవంబర్ 2 నుంచి 4 వరకు జరిగిన తొలి అంతర్జాతీయ మొక్కజొన్న సదస్సు (ఐఎంసీ) 2026లో సంస్థ తన నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలను ప్రదర్శించింది. ప్రపంచంలో మొక్కజొన్న ఉత్పత్తిలో భారత్ ఐదో స్థానంలో, సాగు విస్తీర్ణంలో నాలుగో స్థానంలో ఉందని సంస్థ తెలిపింది. ఆహారం, పశువుల దాణా, ఇంధనం, పారిశ్రామిక అవసరాల్లో మొక్కజొన్నకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని సదస్సు చర్చించింది. ఈ సందర్భంగా TYMIRIUM® సాంకేతికతతో రూపొందించిన VICTRATO® విత్తన శుద్ధి ఉత్పత్తిని సింజెంటా ప్రదర్శించింది. ఇది నులిపురుగులు, వివిధ తెగుళ్ల నుంచి భూమి లోపల, పైన పంటకు రక్షణ కల్పించడంతో పాటు మొలకెత్తడం నుంచి కోత వరకు పంట ఎదుగుదలకు తోడ్పడుతుందని తెలిపింది. సింజెంటా AMEA సీడ్‌కేర్, బయోలాజికల్స్ విభాగం అధిపతి రవి చౌహాన్ మాట్లాడుతూ.. మొక్కజొన్న ఉత్పాదకత విత్తనం నుంచే ప్రారంభమవుతుందని, కీలక దశల్లో పంటను రక్షించడం ద్వారా రైతులు ఆశించిన దిగుబడిని పొందేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. సింజెంటా సస్టైనబిలిటీ అండ్ కార్పొరేట్ అఫైర్స్ విభాగం అధిపతి డాక్టర్ సంగీతా దాపర్ మాట్లాడుతూ.. రైతులు, పరిశోధనా సంస్థలు, ప్రభుత్వాలు, పరిశ్రమలు కలిసి పనిచేసినప్పుడే మొక్కజొన్న సాగులో స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. సదస్సులో సింజెంటా సీడ్‌కేర్ ప్రొడక్ట్ బయాలజీ లీడ్ డాక్టర్ ఎస్. లక్ష్మీపతి, కార్న్ ప్రొడక్ట్ మేనేజర్ వి. సిద్ధేష్ కూడా పాల్గొని సుస్థిర విత్తన శుద్ధి, ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యాల ప్రాధాన్యంపై ప్రసంగించారు.





సోమయ్య ఇంటి చోరీ కేసులో ఎనిమిది అంతర్జాతీయ పతకాలు స్వాధీనం


బెంగళూరు పోలీసులు ఎంఎం సోమయ్య ఇంటి చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి 1980 మాస్కో ఒలింపిక్స్ స్వర్ణపతకంతోపాటు ఎనిమిది అంతర్జాతీయ పతకాలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన మాణిక్యపై 33 కేసులున్నాయి, వాటిలో 25 కర్ణాటకలో నమోదయ్యాయి. చోరీ 28 అక్టోబర్ నాడు హెచ్‌ఏఎల్ థర్డ్ స్టేజ్‌లో జరిగింది. ఇరవై ఏడేళ్ల సోమయ్య కుటుంబంతో కోడగు జిల్లాలోని స్వస్థలానికి వెళ్లినప్పుడు దొంగతనం జరిగింది.

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో నిరాజ్ కుమార్




దోహాలో బుధవారం జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో నిరాజ్ కుమార్ కాంస్యం గెలిచాడు. దీంతో 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు భారత్‌కు కోటా లభించింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో ఈ ఫలితం నమోదైంది. నిరాజ్ 346.5 పాయింట్లతో మూడోస్థానంలో నిలిచాడు. 34వ షాట్‌లో 9.4 స్కోరు అతడిని వెండిపతకం నుంచి దూరం చేసింది. వ్యక్తిగత తటస్థ అథ్లెట్ దిమిత్రి పిమెనోవ్ 362.8 పాయింట్లతో స్వర్ణం సాధించాడు. స్లోవేకియా షూటర్ ప్యాట్రిక్ జానీ రజతం గెలిచాడు. పిమెనోవ్, జానీలకు కూడా ఒలింపిక్ కోటాలు దక్కాయి. ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ 323.7 పాయింట్లతో ఐదోస్థానంలో ముగించాడు. జట్టు విభాగంలో భారత్ 1,751 పాయింట్లతో కాంస్యం సాధించింది. చెక్ రిపబ్లిక్ 1,754తో స్వర్ణం, నార్వే 1,752తో రజతం గెలిచాయి. అర్హత రౌండ్‌లో నిరాజ్ 591 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఐశ్వర్య 586 పాయింట్లతో నాలుగోస్థానం సాధించి ఫైనల్‌కు చేరాడు.

భారత్ ఏ జట్ల ప్రకటన



భారత్ ఏ జట్లను ప్రకటించింది. నవంబర్ 30న పూణేలో సిరీస్ మొదలవుతుంది. ఇంగ్లాండ్ ఏతో సొంతగడ్డపై మూడు టీ20లు జరగనున్నాయి. భారత్ ఏ మహిళల ఎంపిక కమిటీ ఈ జట్లను ప్రకటించింది. మూడు వన్డేలు, బహుళదిన మ్యాచ్ కూడా సిరీస్‌లో ఉన్నాయి. టీ20లు పూణేలోని మహారాష్ట్ర క్రికెట్ సంఘం స్టేడియంలో జరుగుతాయి. వన్డేలు, బహుళదిన మ్యాచ్ ముంబైలోని వాంఖడే స్టేడియానికి కేటాయించారు. అనుష్క శర్మ టీ20, వన్డే జట్లకు కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. మిన్ను మణి రెండు జట్లకు వైస్ కెప్టెన్‌గా ఉంటారు. టీ20 తొలి మ్యాచ్ నవంబర్ 30న మధ్యాహ్నం 1 గంటలకు మొదలవుతుంది. డిసెంబర్ 3, 5 తేదీల్లోని మిగతా మ్యాచ్‌లు సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతాయి. గి కామలిని, శిప్రా గిరి వికెట్‌కీపర్లుగా ఎంపికయ్యారు. వన్డేలు డిసెంబర్ 8, 11, 14 తేదీల్లో జరుగుతాయి. తొలి వన్డే ఉదయం 9 గంటలకు మొదలవుతుంది. మిన్ను మణి బహుళదిన మ్యాచ్‌కు కెప్టెన్‌గా ఉంటారు, అది డిసెంబర్ 19న ముంబైలో మొదలవుతుంది.

సచిన్ టెండూల్కర్ కెరీర్ జ్ఞాపకాలతో 26 బ్యాట్లు ముంబై మ్యూజియంలో ప్రదర్శితం కానున్నాయి



ముంబై క్రికెట్ అసోసియేషన్‌కు చెందిన శరద్ పవార్ క్రికెట్ మ్యూజియంలో నవంబర్ 16న ప్రదర్శన జరగనుంది. సచిన్ టెండూల్కర్ తన 26 ప్రత్యేక బ్యాట్లను మ్యూజియంకు అందించనున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో నమోదైన 100 శతకాల రికార్డుతో ఈ బ్యాట్లు ముడిపడి ఉన్నాయి. సచిన్ ఉపయోగించిన బ్యాట్లతోపాటు హెల్మెట్, జెర్సీ, వ్యక్తిగత నోట్లను కూడా అభిమానులు చూడనున్నారు. 'బ్యాట్‌గ్రఫీ' పేరుతో ఈ ప్రదర్శన నిర్వహించనున్నారు. బ్యాట్ల ద్వారా సచిన్ కెరీర్‌లోని గుర్తుండిపోయే ఇన్నింగ్స్‌ను మ్యూజియం పరిచయం చేయనుంది. నవంబర్ 16, 2026న సచిన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పి 13 సంవత్సరాలు పూర్తవుతాయి. నవంబర్ 16, 2013న ముంబై వాంఖడే స్టేడియంలో వెస్టిండీస్‌పై ఆయన 200వ, చివరి టెస్టు ఆడారు. అదే మైదానంలో సచిన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. మ్యూజియం అధ్యక్షుడు అజింక్య నాయిక్ ప్రకారం, బ్యాట్‌గ్రఫీ కొత్త కోణాన్ని జోడించనుంది. చారిత్రక క్షణాలు సృష్టించిన వస్తువులను చూసి, వాటి వెనుక కథను ప్రేక్షకులు తెలుసుకోగలరు. సచిన్ తన విలువైన వస్తువులను ఎమ్సీఏతో పంచుకోవడం గౌరవంగా భావిస్తున్నామని ఆయన చెప్పారు. భారత, ప్రపంచ క్రికెట్‌లో సచిన్ కృషిని సంరక్షించడమే ఈ కార్యక్రమం లక్ష్యం. బ్యాట్లతో ఆయన కెరీర్ జ్ఞాపకాలు, పోరాటాలు, చారిత్రక విజయాలు ముడిపడి ఉన్నాయి. అభిమానులకు చరిత్ర సృష్టించిన ఆ బ్యాట్లను దగ్గరగా చూసే అవకాశం లభించనుంది.

డబ్ల్యూటీఏ ఫైనల్స్ గ్రూప్ వన్‌లో లిండా నొస్కోవా

▶ పెగులా కొస్త్యూక్‌ను 6-2, 7-5తో ఓడించారు.

▶ కొస్త్యూక్ పోటీ నుంచి నిష్క్రమించారు.



చెన్నైలో మంగళవారం లిండా నొస్కోవా కోకో గాఫ్‌ను ఓడించి డబ్ల్యూటీఏ ఫైనల్స్ సెమీఫైనల్‌కు చేరారు. జెస్సికా పెగులా మార్టా కొస్త్యూక్‌పై గెలిచి పోటీలో నిలిచారు.

చెక్ రిపబ్లిక్‌కు చెందిన ఎనిమిదో సీడ్ నొస్కోవా గ్రూప్ వన్‌లో 63, 63తో విజయం సాధించారు. గాఫ్ సర్వీస్‌లో తడబాటును నొస్కోవా సమర్థంగా ఉపయోగించుకున్నారు.

తొలి సెట్‌లో నాలుగుసార్లు సర్వీస్ బ్రేక్ చేశారు. రెండో సెట్ ఆరంభంలోనే కీలక బ్రేక్ సాధించి, మ్యాచ్‌లో తొమ్మిదో ఏస్‌తో గెలుపు ఖరారు చేశారు.

నొస్కోవా తన ప్రదర్శనపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి విజయం ఈ పోటీలో కీలకమని ఆమె చెప్పారు.

గాఫ్ చివరి పాయింట్ వరకు పోరాడతారని, అందుకే సిద్ధంగా ఉండాల్సి వచ్చిందని నొస్కోవా తెలిపారు. ఆదివారం జరిగిన ప్రారంభ గ్రూప్ మ్యాచ్‌లో నొస్కోవా ఉక్రెయిన్‌కు చెందిన కొస్త్యూక్‌ను ఓడించారు.

గాఫ్ చేతిలో ఓటమి తర్వాత పెగులా కొస్త్యూక్‌పై 62, 75తో గెలిచారు. కొస్త్యూక్ మంగళవారం ఓటమితో పోటీ నుంచి నిష్క్రమించారు.

గ్రూప్ వన్‌లో మిగిలిన ఒక్క సెమీఫైనల్ స్థానానికి గాఫ్, పెగులా పోటీపడుతున్నారు. పెగులా రెండో సెట్‌లోని గందరగోళాన్ని అధిగమించారు.

నిర్ణాయక బ్రేక్‌ను పదకొండో గేమ్‌లో సాధించారు. పెగులా నాలుగో బ్రేక్ పాయింట్‌ను సద్వినియోగం చేసుకుని 6 5 ఆధిక్యాన్ని సాధించారు.

కొస్త్యూక్ ఫోర్‌హ్యాండ్‌ను బయటకు కొట్టడంతో మ్యాచ్ ముగిసింది. 32 ఏళ్ల పెగులా తొలి సెట్‌లో రెండు సర్వీస్ బ్రేక్‌లతో ఆధిపత్యం చూపారు.

రెండో సెట్‌లో వరుసగా నాలుగు సర్వీస్ బ్రేక్‌లు నమోదయ్యాయి. డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో చెన్నై ఓపెన్ 2026 తర్వాత వైష్ణవి, మాయా కెరీర్ అత్యుత్తమ స్థాయికి చేరారు.

ట్యాటమ్ 21 పాయింట్లతో మెరిశాడు

▶ బ్రౌన్ నాలుగు టర్నోవర్లు చేశాడు.

▶ జార్జ్ ఫిలడెల్ఫియాకు తిరిగి వచ్చాడు.

ట్యాటమ్ 21 పాయింట్లతో బోస్టన్‌ను గెలిపించాడు. ఫిలడెల్ఫియాలో పాల్ జార్జ్ 36 పాయింట్లు చేశాడు. సెల్టిక్స్ 76ఏర్స్పై 123101తో గెలిచింది. ఈ మ్యాచ్ మంగళవారం రాత్రి జరిగింది.

జైలెన్ బ్రౌన్ బోస్టన్‌పై తొలి మ్యాచ్‌లో 13 పాయింట్లే చేశాడు. ప్రారంభంలోనే ఫౌల్స్ సమస్యలో చిక్కుకున్నాడు.

బ్రౌన్ నాలుగు టర్నోవర్లు కూడా చేశాడు. 2024 ఎన్బీఏ ఫైనల్స్ ఎమ్వీపీగా నిలిచిన బ్రౌన్ వేసవిలో 76ఏర్స్ను మారాడు.

ట్యాటమ్, బ్రౌన్ మధ్య పోరు సీజన్‌లో ఆసక్తికరంగా మారింది. ఇద్దరూ తమ చల్లని సంబంధంపై ఎక్కువగా మాట్లాడలేదు.

ప్రారంభానికి ముందు ట్యాటమ్ బ్రౌన్ భుజం తట్టి, ఛాతిపై కొట్టాడు. బ్రౌన్ ఆ పలకరింపును పట్టించుకోలేదు.

ట్యాటమ్ లెబ్రాన్ జేమ్స్‌తో చేతులు కలిపి ఆలింగనం చేసుకున్నాడు.

మ్యాచ్ తర్వాత ట్యాటమ్ ముందస్తు పలకరింపుపై వివరాలు చెప్పలేదు.

ఆటపై దృష్టి పెట్టానని ట్యాటమ్ తెలిపాడు. జట్టు కోసం మేలు చేసేదిపైనే దృష్టి ఉందని బ్రౌన్ అన్నాడు.

బ్రౌన్, ట్యాటమ్ కలిసి బోస్టన్‌కు ఎన్బీఏ టైటిల్ అందించారు. వారి సంబంధం ప్రభావంతో 12గా ఉన్న జోడీపై చర్చ మొదలైంది.

గత నెల బ్రౌన్ ఇద్దరి మధ్య విభేదం లేదన్నాడు. అయితే సంబంధం ముగిసిన చర్చ సీజన్‌లోకి సాగింది.

పాల్ జార్జ్ గతంలో 76ఏర్స్లో రెండు సీజన్లు ఆడాడు. బ్రౌన్ కోసం జార్జ్‌ను సెల్టిక్స్ తీసుకుంది.

నాలుగో త్రిపాయింటర్‌తో సెల్టిక్స్ 10082 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ విజయంతో 10 మ్యాచ్‌ల్లో తొమ్మిదో గెలుపు సాధించింది.



జోయెల్ ఎంబీడ్ రెండో అర్ధభాగంలో నేలపై పడిపోయాడు. విసిరిన లేయప్ విఫలమైనప్పుడు అతను అసౌకర్యంగా దిగాడు.

విరామ సమయానికి సెల్టిక్స్ 6251తో ముందుంది. 76ఏర్స్ 93 రికార్డుతో ఈస్ట్‌లో సెల్టిక్స్ 92 వెనుక రెండో స్థానంలో ఉంది.

వుదయం సినిమా

‘సిద్ధు10’ ఘనంగా ప్రారంభం



వుదయం సినిమా: స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ తన కొత్త చిత్రం ‘సిద్ధు10’లో సరికొత్త ప్రేమకథతో అలరించబోతున్నా రు. తబిత సుకుమార్ సమర్పణలో, సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. అన్మోల్ శర్మ, బన్నీ వాస్, అశోక్ బండ్రెడ్డి నిర్మాతలుగా వ్యవహ రిస్తున్నారు. ఈ సినిమాతో మోహన్ బి దర్శకుడిగా పరిచయం అవుతున్నా రు. ‘ఇడుపు కాయితం’ తర్వాత సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ కలిసి నిర్మి స్తున్న రెండో సిని మా ఇది. ప్రస్తుతం ‘ఇడుపుకాయి తం’ విడుదల కు సిద్ధమవు తోంది. ప్రముఖ కథా రచ యిత సుకు మార్ టీమ్‌లో కీలకం గా ఉన్న మోహన్ బి.. ఈ సినిమా కోసం ఒక అందమైన, కొత్త తరహా ప్రేమకథను సిద్ధం చేశారు. ఈ చిత్రంలో సిద్ధు జొన్నలగడ్డను పూర్తిగా కొత్త అవతార్‌లో చూపించబో తున్నారు. తనదైన స్క్రీన్ ప్రెజెన్స్, విభిన్నమైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న సిద్ధు.. ఈ కొత్త కాంబినేషన్‌తో ప్రేక్షకులను అలరించనున్నారు. సిద్ధుకు జోడీగా నయన్ సారిక హీరోయిన్‌గా నటించనున్నారు. ఈ సినిమా హైదరాబాద్‌లో నేడు సంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు. మాస్టర్ స్టోరీ టెల్లర్ సుకుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, అగ్ర నిర్మాత అల్లు అరవింద్ తొలి క్లాప్ కొట్టారు. నిర్మాతలు విశ్వప్రసాద్, బాపినీడు, దర్శకులు బుచ్చిబాబు, చందూ మొండేటి చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందించారు. దర్శకులు హరీశ్ శంకర్, నందినీ రెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంతో సినిమా ప్రయాణం శుభారంభమైంది.సినిమా ప్రారంభోత్సవంతో పాటు ఆసక్తికరమైన థీమ్ పోస్టర్‌ను కూడా మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో అందమైన చెట్టుతో చుట్టుముట్టబడిన భారీ జలపాతం, దాని మధ్యలో వేలాడుతున్న ఉయ్యాల కనిపిస్తున్నాయి. ఎరుపు, పసుపు, నలుపు రంగుల్లో ప్రవహిస్తున్న వస్త్రం ఈ విజువల్ కు ప్రత్యేకత తీసుకొచ్చింది. పోస్టర్‌లోని విజువల్స్ నాస్టాల్జియా, ప్రేమ, కవితాత్మకమైన అందాన్ని చూపిస్తున్నాయి. సినిమా కథలోని భావోద్వేగ ప్రపంచాన్ని, అందమైన ప్రేమకథను ఈ పోస్టర్ ద్వారా పరిచయం చేశారు.ఈ చిత్రానికి ప్రతిభావంతమైన సాంకేతిక బృందం పనిచేస్తోంది. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. చంద్రు సెల్వరాజ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ సాహి సురేష్ ఈ సినిమా విజువల్ వరల్డ్‌ను రూపొందించనున్నారు.

అశోక క్రియేషన్స్ మరో భారీ ప్రాజెక్ట్ ప్రకటన..

వుదయం సినిమా: టాలీవుడ్‌లో ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థగా గుర్తింపు తెచ్చుకున్న అశోక క్రియేషన్స్ మరో భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించింది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కనున్న ఈ చిత్రం సంస్థకు ప్రొడక్షన్ నెం.3. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. క్రియేటివ్ డైరెక్టర్ మోహనకృష్ణ ఇంద్రగంటి, యంగ్ సెన్సేషన్ రోషన్ మేక ఈ ప్రాజెక్ట్ కోసం చేతులు కలిపారు. విభిన్నమైన కథలు, సరికొత్త కథనాలతో సినిమాలు తెరకెక్కించే మోహన కృష్ణ



ఇంద్రగంటి.. ఈ చిత్రంలో రోషన్‌ను సరికొత్త కోణంలో చూపించనున్నారు. తన స్క్రీన్ ప్రెజెన్స్,ఆకట్టుకునే నటనతో ఇప్పటికే తన ప్రతిభను నిరూపించుకున్న రోషన్.. ఈ భారీ చిత్రంతో మరో కొత్త అవతార్‌లో ప్రేక్షకులను అలరించ నున్నారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో రూపొందు తున్న ఈ చిత్రం నేడు ఘనంగా ప్రారంభమైంది.ఈ ప్రతిష్టా త్మక పాన్ ఇండియా సినిమా ప్రారం భోత్సవం ఘనంగా జరిగింది. ముప్పా వెంకయ్య చౌదరి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, హీరో శ్రీకాంత్ క్లాప్ కొట్టారు. అనంతరం ముప్పా వెంకయ్య చౌదరి చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందజేశారు. దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి రోషన్మేకను గతంలో ఎన్నడూ చూడని పవర్ ఫుల్ సూపర్‌హీరో అవతార్‌లో చూపించేందుకు భారీ స్థాయి కథాంశానికి అత్యాధునిక సాంకేతికత, భారీ స్థాయి విజువల్స్‌ను జోడించి అన్ని వర్గాల ప్రేక్ష కులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని రూపొం దిస్తున్నారు.ఈ సినిమాతో బాలీవుడ్ నటి రేఖా పాండే తెలుగు చిత్ర పరిశ్ర మలోకి అడుగుపెడుతున్నారు. నటుడు వినయ్ రాయ్ కీలక పాత్రలో కనిపిం చనున్నారు.

వుదయం సినిమా: ఇట్లు అర్జున’ నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో అనీష్ విలేకరులు

‘ఇట్లు అర్జున’ అందరికీ కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది..



సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

ఇట్లు అర్జున్ కథ విన్నప్పుడు మిమ్మల్ని ఆకట్టు కున్న అంశాలు ఏమిటి? ఈ కథతోనే మీ తొలి సినిమా చేయడానికి కారణమేంటి?

ఈ కథ విన్నప్పుడు నాకు బాగా నచ్చిన అంశం ఒక మూగవాడి ప్రేమకథ. తన భావాలను మాటల్లో వ్యక్తపరచ లేని వ్యక్తి ప్రేమను ఎలా చూపిస్తాడనేది నాకు చాలా నచ్చింది. అలాగే కథ నడిచే విధానం, హీరో, హీరోయిన్ ప్రయాణం, యాక్షన్, ఎమోషన్ చాలా ఆర్గానిక్‌గా అనిపించాయి. ఇందులో చాలా ఆసక్తికరమైన సన్నివేశాలు ఉన్నాయి. అలాంటి సందర్భాలను ఒక మూగవాడు ఎలా ఎదుర్కొం టాడు, వాటిని ఎలా హ్యాండిల్ చేస్తాడు అనేది నాకు చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది.

ఈ పాత్ర కోసం ఎలాంటి హోమ్ వర్క్ చేశారు ?

–ఈ సినిమా కోసం దాదాపు ఆరు నెలల పాటు వర్క్‌షాప్ చేశాం. బాడీ లాంగ్వేజ్, రియాక్షన్స్, ఎక్స్‌ప్రెషన్స్ .. విషయా లపై డైరెక్టర్ గారికి చాలా క్లారిటీ ఉంది. కొంత సైన్ లాంగ్వేజ్ కూడా ఉపయోగించాం. అయితే అది అందరికీ అర్థమయ్యేలా ఉంటుంది.

ఎన్టీఆర్, రామ్ చరణ్ లాంటి పెద్ద స్టార్స్ మీకు సపోర్ట్ చేశారు. ఈ విషయంలో మీపై ఎంత బాధ్యత ఉందని భావిస్తున్నారు?

అంత పెద్ద స్టార్స్ వచ్చి మా సినిమా గురించి మాట్లాడటం ఇప్పటికీ నాకు ఒక కలలాగే అనిపి స్తోంది. అంత మంచి సపోర్ట్ లభించడం చాలా ఆనందంగా ఉంది.

సినిమాలో యాక్షన్ ఎలా ఉండబోతోంది?

యాక్షన్‌ను ఇందులో చాలా కొత్తగా డీల్ చేశాం. ఇది ఒక అండర్‌డాగ్ క్యారెక్టర్‌కు తగ్గట్టుగానే యాక్షన్ సన్నివే శాలు ఉంటాయి. మాస్ కమర్షియల్ సినిమాల్లో ఉండే యాక్షన్‌లా కాకుండా ఆ పాత్ర స్వభావానికి అనుగు ణంగా ఉంటుంది.

మీకు నటనపై ఆసక్తి ఎప్పుడు ఏర్పడింది? ఎలాంటి శిక్షణ తీసుకున్నారు?

–నాకు చిన్నప్పటి నుంచీ నటనపై ఆసక్తి ఉండేది. వైజాగ్‌లో సత్యానంద్ గారి దగ్గర నటనలో శిక్షణ తీసుకున్నాను. అలాగే ఒక ఏడాది పాటు యూఎస్‌లో కూడా నేర్చుకున్నాను. మరికొన్ని చోట్ల కూడా నటనకు సంబంధించిన విషయాలు నేర్చుకున్నాను.

తొలి సినిమా చేయడానికి ముందు దాదాపు ఏడాది పాటు కథలు విన్నారట కదా?

అవును. తొలి సినిమా చేయ డానికి ముందు దాదాపు ఏడాది పాటు కథలు విన్నాను. ఆ సమయంలో మహేష్ గారు ఈ కథ తీసుకొచ్చారు. నాకు చాలా నచ్చింది.

సుడిగాలి సుధీర్ కెరీర్‌కు 'గోట్' కెరీర్‌లో నిలిచిపోతుంది!

వుదయం సినిమా: ప్రముఖ హాస్య కథానాయకు డు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం G.O.A.T (గోట్) Greatest Of AllTimes అనేది ఉపశీర్షిక. దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైక్షణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్



సినిమాస్ సమర్పణలో ఈ చిత్రం నవంబరు 12న థియేట్రికల్ విడుదల కానుంది.ఈ సంద ర్భంగా ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హీరో మంచు మనోజ్, నిర్మాత నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సందర్భంగా నిర్మాత నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ "సుడిగాలి సుధీర్‌కు నేను అభిమానిని.. ఆయన బుల్లి తెర నుంచి ఎలా ఎదిగాడో అందరికి తెలుసు. సుడిగాలి సుధీర్ మరిన్ని మంచి సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. గోట్ పెద్ద హిట్ కావాలని ఆశిస్తున్నాను' అన్నారు. హీరో యిన్ దివ్యభారతి మాట్లాడుతూ " ఈ సినిమా కోసం రెండేళ్లుగా ఎదురుచూస్తున్నాను. ఈ రోజు సినిమా విడుదల కావడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ సినిమా నా కెరీర్‌లో ఎంతో ముఖ్యమైన సినిమా. ఇది కేవలం ఎంటర్‌టైన్‌మెంట్ సినిమానే కాదు. నేడు గ్రామాల్లో జరుగు తున్న బెట్టింగ్.. గ్యాంబ్లింగ్‌ల గురించి చెప్పే సినిమా. ఈ సినిమాలో సొసైటికి మంచి మేసేజ్ ఉంది. ఈసినిమాను ఈరోజు ఇలా విడుద ల అవుతుంది అంటే నిర్మాత చంద్రశేఖరే కారణం. ఎన్నో కష్టాలు ఎదుర్కొని నిర్మాత ఎక్కడా రాజీ పడకుండా ఈసినిమాను పూర్తిచేశాడు. ఈ సినిమాతో నాకు పర్సనల్‌గా ఎంతో ఎమోషనల్ అనుబంధం ఉంది. ఈ సినిమా తప్పకుండా బ్లాక్‌బస్టర్ అవ్వాలని కోరుకుంటున్నాను.దర్శకుడు వేదవ్యాస్ మాట్లాడుతూ " ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల భారతదేశంలో ఎన్నో లక్షల మంది ఎఫెక్ట్ అవుతున్నారు.

‘డాన్ బాస్కో’ టీజర్ లాంచ్



వుదయం సినిమా: రుష్య దత్తా హీరోగా పరిచయం అవుతున్న చిత్రం ‘డాన్ బాస్కో’. రాధా కృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై వెంకట్ ఉప్పుటూరి నిర్మాణంలో గౌరీ శంకర్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో రాజ్‌కుమార్ కసిరెడ్డి, మిర్నా మీనన్, మౌనిక, మురళీ శర్మ, ప్రిన్సిపాల్ విశ్వనాథ్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, విష్ణు ఓఐ, ఉత్తేజ్, వినయ్ సల్లకడి, మోహన శ్రీ సురాగా తదితరులు కీలక పాత్రలు పోషించారు. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా బుధవారం నాడు టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌కి సక్సెస్ ఫుల్ డైరెక్టర్ వెంకీ అట్లూరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో..వెంకీ అట్లూరి మాట్లాడుతూ .. ‘‘డాన్ బాస్కో’ టీజర్ బాగుంది. ఎంతో వినో దాత్మకంగా సాగింది. శంకర్ గారు చక్కగా హ్యాండిల్ చేశారు. శ్రీచరణ్ బీజీఎం బాగుంది. మిర్నాప్రతీ పాత్రకు ప్రాణం పోస్తుంటారు. రుష్య నాకు ఫ్యామిలీ మెంబర్. వెంకట్ గారు ఏ సినిమా డిస్ట్రిబ్యూట్ చేసినా సక్సెస్ అవుతుంది. ఈ మూవీతో ఆయనకు మంచి విజయం దక్కాలని కోరుకుంటున్నాను. నేను సొంతంగా సినిమా నిర్మిస్తే ఎంత పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటానో ఈ చిత్రం కూడా అంత పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.హీరో రుష్య దత్తా మాట్లాడుతూ .. ‘‘మ్యాడ్’ డైరెక్టర్ కళ్యాణ్ శంకర్ వల్లే నాకు మా దర్శకుడు గౌరీ శంకర్ పరిచయం అయ్యారు. నిర్మాత వెంకట్ గారు మమ్మల్ని ఎంతో సపోర్ట్ చేశారు. శ్రీచరణ్ గారు మంచి మ్యూజిక్ ఇచ్చారు. రాజు గారు అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. ఎడిటర్ వంశీ గారికి థాంక్స్. చినబాబు గారు నాకు ఎప్పుడూ అండగా ఉంటారు.

‘ఈఎన్ఈ రిపీట్’ నుంచి ఫస్ట్ సింగిల్ ‘మిత్వా’ రిలీజ్



వుదయం సినిమా: 'ఈ నగరానికి ఏమైంది' చిత్రంతో ప్రేక్షకుల కు బాగా దగ్గరైన క్రేజీ గ్యాంగ్ మరోసారి సందడి చేసేందుకు సిద్ధమైంది. ఆ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ‘ENE Repeat’ నవంబర్ 19న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో విశ్వక్ సేన్, అభినవ్ గోమఠం, వెంకటేష్ కాకుమాను, శ్రీనాథ్ మాగంటి తమ పాత పాత్రలతో మళ్లీ అలరించనున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన మేకర్స్ తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ ‘మిత్వా’ను విడుదల చేశారు. స్నేహబంధంలోని అందమైన అనుభూతులను గుర్తుచేసేలా ఈ పాట సాగింది.వివేక్ సాగర్ స్వరపరిచిన ‘మిత్వా’ వినసొంపైన మెలోడీగా ఆకట్టుకుంటోంది. చక్కటి ఆర్కెస్ట్రేషన్, కొత్త తరహా మ్యూజిక్ అరేంజ్‌మెంట్స్ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భరద్వాజ్ గాలి రాసిన సాహిత్యం స్నేహితులు పక్కన ఉన్నప్పుడు కలిగే ఆనందాన్ని, వారితో కలిసి గడిపిన మధురమైన జ్ఞాపకాలను అందంగా చూపించారు. నకుల్ అభ్యంకర్ తన వాయిస్‌తో పాటకు ప్రాణం పోయగా, వీణా ఘంటసాల వాయిస్ మరింత భావోద్వేగాన్ని తీసుకొచ్చింది.ఈ పాటకు సంబంధించిన విజువల్స్ కూడా ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయి. థాయ్‌లాండ్ ట్రిప్‌లో ENE గ్యాంగ్ కలిసి సరదాగా గడిపిన క్షణాలను చూపించారు. అందమైన ప్రదేశాలు, బీచ్‌లలో ఎంజాయ్ చేయడం, పబ్స్‌లో పార్టీలు చేసుకోవడం వంటి సన్నివేశాలతో వారి అల్లరి, స్నేహం, అనుబంధాన్ని చూపిం చారు. అనీషా అంబ్రోస్, శివాత్మిక రాజశేఖర్ కూడా ఈ గ్యాంగ్‌తో కలిసి సందడి చేస్తూ కనిపించారు.'ఈఎన్ఈ రిపీట్' లోని అసలైన ఫన్, ఎమోషన్‌ను ‘మిత్వా’ పాట మరోసారి గుర్తుచేస్తోంది. ఈ పాత్రల మధ్య స్నేహం, వారి కెమిస్ట్రీ ప్రేక్షకులకు ఎందుకు అంతగా నచ్చా యో ఈ పాట చూస్తే అర్థమవుతుంది. కేవలం ఒక మెలోడీగానే కాకుండా, స్నేహంలోని అల్లరి, ఆనందం, అనుబంధాలను గుర్తుచేసే పాటగా ‘మిత్వా’ ఆకట్టుకుంటోంది.

"టార్టాయిస్" నుంచి సాంగ్

సస్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ రూపొంది స్తున్నారు. మానస కుమార్ కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందిస్తున్న "టార్టాయిస్" సినిమా బ్లాక్ బస్టర్ మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేసింది. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన 'నీ పరిచయం..' సాంగ్ మ్యూజిక్ లవర్స్ నుంచి హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ రోజు "టార్టాయిస్" సినిమా నుంచి 'రంగు రంగు పిల్లరో..' లిరికల్ సాంగ్ ను మేకర్స్ రిలీజ్ చేశారు.'రంగు రంగు రంగు పిల్లరో..' పాటను మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ ఎనర్జిటిక్ ట్యూన్ తో కంపోజ్ చేయగా, ప్రముఖ జానపద గాయకుడు, కవి పెంచల్ దాస్ లిరిక్స్ రాసి పాడారు.



‘జయంత్ అండ్ ది జింగో పెన్’ ప్రీ రిలీజ్ ఈవెంట్



వుదయం సినిమా: నమో జయం ప్రొడక్షన్స్ బ్యానర్ మీద దివ్య ప్రవీణ్ బొలిశెట్టి నిర్మాణంలో జాతీయ అవార్డు గ్రహీత నవీన్ దేశబోయిన తెరకెక్కించిన చిత్రం ‘జయంత్ అండ్ ది జింగో పెన్’. ఈ సినిమాలో మాస్టర్ జయంత్ బొలిశెట్టి, మన శంకర వర ప్రసాద్ ఫేమ్ ఊహా రెడ్డి, సత్యం రాజేష్, ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్, మానిక్ రెడ్డి, అశోక్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, తెలుగు ఎక్స్‌పరిమెంట్స్ సాయి కృష్ణ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఈ మూవీని నవంబర్ 14న విడు దల చేయనున్నారు. ఈ క్రమంలో మంగళవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశా రు. ఈ ఈవెంట్‌లో..తణికెళ్ల భరణి మాట్లాడుతూ .. ‘పిల్లలందరూ కలిసి చూసే ఓ మంచి సినిమా ఈ మధ్య కాలంలో రాలే దు. పిల్లల కోసం మంచి సందేశం ఇచ్చేలా ‘జయంత్ అండ్ ది జింగో పెన్’ మూవీని తెరకెక్కించారు. దివ్య గారు, ప్రవీణ్ గారు ఈ మూవీని గొప్పగా నిర్మించారు. జయంత్ అద్భుతమైన కుర్రాడు. పిల్లాడికి బంగారు భవిష్యత్తు ఉంది. రానున్న కాలంలో మంచి నటుడు అవుతాడని కచ్చితంగా చెప్పగలను. మంచి సందేశంతో నవీన్ ఈ మూవీని తెరకెక్కించారు. ఇలాంటి మంచి చిత్రం కచ్చితంగా విజయం అవ్వాలి.. కచ్చితంగా సక్సెస్ అవుతుంది’ అని అన్నారు.కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ .. ‘పిల్లలతో చేసే మంచి చిత్రాలు ఎప్పుడూ సక్సెస్ అవుతాయి. ఈ సినిమాలో జయంత్ గొప్పగా నటించాడని అర్థం అవుతోంది. ప్రవీణ్ గారు మల్టీటాలెంటెడ్‌గా కనిపిస్తున్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.